www.jagritiweekly.com
సంపుటి : 77 సంచిక : 30 పుటలు : 52

జాగృతి

కలి 5127-శ్రీ విశ్వావసు వైశాఖ బహుళ సప్తమి
19-25 మే 2025
వెల : ₹20/-

ఆపరేషన్ సిందూర్

ఒక విజయం.. ఒకింత విరామం

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

దేశ పరమవైభవ స్థితి సాధనే సంఘ లక్ష్యం

జడ్చర్ల: తెలంగాణ సంఘశిక్షావర్గ ప్రథమవర్ష-2025 జడ్చర్లలోని స్వామి నారాయణగురుకుల్‌లో ఏప్రిల్27నుండి ప్రారంభమై మే11 సార్వజని కోత్సవంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ప్రముఖ కంటివైద్యులు, డా. భరద్వాజ్ నారాయణరావు, శ్రీ మళయాళ స్వామి లక్ష్మినారాయణ ఆశ్రమ పీఠాధిపతులు పూజ్యశ్రీ ఆచార్యపరమాత్మ ఆనందగిరిస్వామీజీ పాల్గొని ఆశీఃప్రవచనం చేస్తూ అనుశాసనాయుతమైన యువత నిర్మాణంలో ఆర్ఎస్ఎస్ గత వందసంవత్సరాలుగా కృషిచేయడం, సనాతన ధర్మరక్షణకు కట్టుబడి ఉండడం, అందరి అదృష్టమని అన్నారు. భరద్వాజ నారాయణరావు మాట్లాడుతూ ఇవాళ మనందరం హిందువులుగా ఉన్నామంటే మన పూర్వీకులు మతం మారకుండా ఉండడమే కారణమని అన్నారు.

ముఖ్యవక్తగా పాల్గొన్న తెలంగాణ ప్రాంత సహకార్యవాహ మల్లికార్జున్ ప్రసంగిస్తూ వ్యక్తి నిర్మాణం ద్వారానే దేశం పరమ వైభవ స్థితికి వెళుతుందని ఆకాంక్షించిన పరమ దేశభక్తుడు డాక్టర్‌జీ అని, ఈ దేశం కుల, మత, ప్రాంతాల పేరుతో విభజించబడకుండ ఉండాలంటే నేషన్ ఫస్ట్ అని అనుకునే సమాజం కావాలనే ఉద్దేశంతో డాక్టర్‌జీ సంఘాన్ని స్థాపించారని అన్నారు. నేడు 1,21,000 గ్రామాలలో సంఘం పనిచేస్తుంది. సమాజంలో అంటరానితనం అమానుషమనే భావనతో సమరసత వేదికగా సంఘం పనిచేస్తుంది. హిందూ కుటుంబ వ్యవస్థను కాపాడుకోవడం ద్వారా భారతదేశం పరమవైభవస్థితికి చేరుకుంటుందని అన్నారు. ఇందులో శ్రీ స్వామినారాయణగురుకుల్ అధిపతులు శ్రీశ్రీశ్రీసర్వదర్శన్ స్వామి, వర్గసర్వాధికారి పాలేటి వెంకట్రావ్, వర్గకార్యవాహ బలవత్రిగణేశ్, సహకార్యవాహ బోలనాగభూషణం, అఖిలభారత ప్రచారప్రముఖ్ సునీల్‌అంబేకర్, ప్రాంత సంఘచాలక్ సుందర్‌రెడ్డి, పాలమూర్ విభాగ్ సంఘచాలక్ శ్రీనివాస్‌రెడ్డి ఇతర సంఘ పెద్దలు పాల్గొన్నారు. వర్గలో శిక్షణ పొందిన స్వయంసేవకుల ద్వారా జరిగిన శారీరిక్ ప్రదర్శనలను చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ వర్గలో తెలంగాణ నలుమూలల నుండి 400 మంది శిక్షార్థులు పాల్గొన్నారు. జడ్చర్ల చుట్టుపక్కల గ్రామాల నుండి మూడు వేలమంది ఈ కార్యక్రమం తిలకించారు.

సామాజిక సమరసతకు సాధనం – మీడియా

భాగ్యనగర్: భారతీయ పత్రికా రచనకు ఆద్యులు నారద మహాముని అని, ఆయన నుంచి సత్యనిష్ఠ, హితంగా చెప్పడం అన్న లక్షణాలను పాత్రికేయులు అలవర్చు కోవాలని దేవర్షి నారద జయంతి సందర్భంగా పాల్గొన్న వక్తలు సూచించారు. సమాచారభారతి ఆధ్వర్యంలో మే 10న భాగ్యనగర్, కోఠిలోని వై.ఐ.ఎమ్.ఎస్. భవనంలో ఈ కార్యక్రమం జరిగింది. పాత్రికేయుడికి ఉండాల్సిన అన్ని లక్షణాలూ నారదునిలో ఉన్నాయని, అందుకే నారద జయంతిని జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. నారదుడు కలహప్రియుడు అంటూ లోకంలో ప్రచారంలో ఉందని, ఇది శుద్ధ తప్పు అని వక్తలు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా సమాచారభారతి అధ్యక్షులు ఆచార్య గోపాల్ రెడ్డి, ముఖ్య అతిథిగా ఐఏఏఎస్ (రిటైర్డ్) సి.హెచ్.వి. సాయిప్రసాద్, ముఖ్య అతిథిగా ఐఏఎస్ (రిటైర్డ్), విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర అధ్యక్షులు చామర్తి ఉమామహేశ్వరరావు హాజరయ్యారు.

నారద జయంతి సందర్భంగా మీడియా రంగంలో విశేష సేవలందించిన పలువురు పాత్రికేయులను, సీనియర్ కాలమిస్టులను, మీడియా నిపుణులను సన్మానించారు. సీనియర్ పాత్రికేయుడు కొరిడే మహేష్, గాండ్ల సంపత్, సీనియర్ కాలమిస్ట్ డాక్టర్ భాస్కరయోగి, ఓయు జర్నలిజం విభాగం అధ్యాపకురాలు డాక్టర్ కలువాయి అనిత, సీనియర్ వీడియోగ్రాఫర్ కర్ణటపు రాఘవేంద్రలను సమాచారభారతి తరఫున విశిష్ట సేవా పురస్కారాలతో సత్కరించారు.

ఈ సందర్భంగా సభాధ్యక్షులు ఆచార్య గోపాల్ రెడ్డి మాట్లాడుతూ సమాచార భారతి మూడు దశాబ్దాలుగా పత్రికా రంగంపైనే ప్రధానంగా దృష్టి పెడుతోందని, వీటితో పాటు సామాజిక సమరసత, జాతి ఔన్నత్యం, సమగ్రతను పెంచడానికి మీడియా రంగాన్ని సాధనంగా చేసుకుంటోందని వివరించారు. నారద జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం జర్నలిజంలో ఉత్తమ విలువలతో వున్న జాతీయ భావాలు గల పాత్రికేయులను సమాచారభారతి పక్షాన సన్మానిస్తున్నామని తెలిపారు.

చామర్తి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం ఫేక్ న్యూస్ విపరీతంగా వస్తోందని, దీనిని అరికట్టడానికి సమాచార భారతి కృషి చేయాలన్నారు. దేశహితం కాని వార్తలు కూడా వస్తున్నాయని, వాటికి కౌంటర్లు ఎలా ఇయ్యాలో కూడా ఆలోచించాలని, లేదంటే తప్పుడు కథనాలు సమాజంలో వ్యాప్తి చెందుతాయని హెచ్చరించారు. విద్యాభారతి ఈ పని కూడా చేస్తోందని, ప్రస్తుతం పిల్లల్లో వివిధ మాధ్యమాల ద్వారా విష బీజాలను నాటుతున్నారని, ఆ విషబీజాలను ఎదుర్కోవాలన్నారు. దీని కోసం పుస్తకాలు, భారతీయ సాహిత్యాన్ని బాగా అధ్యయనం చేయాలని సూచించారు.

సి.హెచ్.వి. సాయిప్రసాద్ మాట్లాడుతూ నారదుడు త్రిలోక సంచారిగా విషయాలన్నింటినీ సత్యనిష్ఠతో హితంగా చెబుతూ.. అన్ని వర్గాల వారికీ సమాచారాన్ని చేరవేశారన్నారు. సత్యనిష్ఠ, హితంగా చెప్పడం అన్న లక్షణాలతోనే కథన నిర్మాణాన్ని చేశారన్నారు. ఈ ఆదర్శాలను ఆధారంగా చేసుకుంటూ పాత్రికేయులు కూడా ఆదర్శ స్థితికి చేరాలని అభిలషించారు. మరోవైపు సమాజంలో ఎప్పుడూ ప్రతికూల ఆలోచన అనేది ఉంటుందని, కానీ మనం మాత్రం మంచినే గ్రహించాలని అన్నారు. ఏఐ ద్వారా ప్రపంచనికి ముప్పు ఉందని, కానీ దానిని వ్యతిరేకించలేమని, దానిలోని మంచినే స్వీకరించాలని సూచించారు.చివరగా ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్రం ప్రచార ప్రముఖ్ నడింపల్లి ఆయుష్ మాట్లాడుతూ సమాచార భారతి ద్వారా జరుగుతున్న కార్యక్రమ వివరాలును, వాటి విశిష్టతను తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ప్రచార ప్రముఖ్ కట్టా రాజగోపాల్‌తో పాటు సమాచార భారతి కార్యకర్తలు, పాత్రికేయులు పాల్గొన్నారు. ★

కరీంనగర్: మే 2వ తేదీన వాగేశ్వరి కాలేజీలో జరిగిన నారద జయంతి కార్యక్రమంలో ముఖ్య వక్తగా తెలంగాణ గ్రామ వికాస్ ప్రముఖ్ జిన్నా సత్యనారాయణరెడ్డి, విభాగ్ కార్యవాహ పాక సత్యనారాయణ పాల్గొన్నారు. 70 మంది పాత్రికేయులు, 27 మంది ఇతరులు పాల్గొన్నారు.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
Editor : Dr. Goparaju Narayana Rao.

సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
040-27561453 / 9959997013

సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)

కె. దుర్గారెడ్డి : అసోసియేట్ ఎడిటర్ -
సబ్ ఎడిటర్ : - **9959991304**

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

Link / QR Code ద్వారా మీ చందా చెల్లించినప్పుడు Remarks దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 **సంవత్సర చందా రూ.850**

బ్యాంకు ఖాతా వివరాలు

A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

- సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

జాతి ప్రబల ఆకాంక్ష మేరకు, వారి ఉగ్రకామనను గౌరవించి భారత సైన్యం ఆపరేషన్ సిందూర్‌ను ఆరంభించింది. ఈ ఆపరేషన్‌లో ఇంతవరకు జరిగిన పరిణామాలన్నీ ప్రపంచ యుద్ధ చరిత్రలో సరికొత్త వాక్యాలుగానే నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఖ్యాతి భారత్‌దే. భారత సేనా వాహినులదే. ఇలాంటి సంక్షుభిత సమయంలో దేశాన్ని నడిపిస్తున్న కేంద్ర ప్రభుత్వానిది, ఆ ప్రభుత్వ నేత నరేంద్ర మోదీదే కూడా. ఇంకా, సరిహద్దులలో రణఘోషల మధ్య భారతజాతి వినిపించిన ఐక్యతా గళం మహత్తరమైనది. దేశం కల్లోలంలో ఉంటే మేమంతా ఎప్పటికీ ఒక్కటే అన్న సందేశాన్ని మరొక్కసారి శత్రువుకు ప్రదర్శించారు జాతి జనులు. ఇది అర్థవంతమైన ఆవేశం. దేశం ప్రదర్శించిన ఈ ధర్మాగ్రహం స్వాగతించదగినది. కానీ ఎన్నో గహనమైన పరిస్థితుల నడుమ ఘర్షణకు స్వల్ప విరామం ఇవ్వవలసి వస్తే ఇంతటి జాతి, అందులోని ఆవేశం క్షణంలో దిశ మార్చేసుకోవడం అవాంఛనీయం. ధర్మాగ్రహం దారి తప్పడం అత్యంత విషాదకరం, శోచనీయం. ఇది ఆగాలి. కాల్పులకు విరామం రణభూమిలో భారత్ వెనుకడుగు అని నిర్ధారించే వరకు వెళ్లిన వారిని మే 12వ తేదీ రాత్రి ప్రధాని మోదీ జాతిని ఉద్దేశించి చెప్పిన మాటలు మేల్కొలిపి ఉండాలి.

నిజమే, ఆపరేషన్ సిందూర్ ఆరంభించిన మూడో రోజునే భారత్ కాల్పుల విరమణకు అంగీకరించింది. కాదు, అంగీకరించవలసి వచ్చింది. కానీ భారత్ వైఖరి మారలేదు. గురీ మారలేదు. చర్చలంటూ ఉంటే ఉగ్రవాదుల, ఆక్రమిత కశ్మీర్ అప్పగింతల మీద మాత్రమేనని కుండబద్దలు కొట్టి ప్రకటించింది. అయినా ఈ ఆపరేషన్ ద్వారా భారత్ ఎంతో సాధించిందన్నది తిరుగులేని సత్యం. దీనిని గమనించకుంటే ఎలా? 130 నుంచి 140 మంది ముస్లిం మతోన్మాదులను/ ఉగ్రవాదులను ఆపరేషన్ సిందూర్‌తో భారత్ వధించింది. ఇది నీతీ జాతీ రీతీ ఎరుగని ఒక రోగ్ నేషన్ పాక్‌తో జరుగుతున్న ఘర్షణ. అలాగే అణ్వాయుధాలు కలిగిన రెండు దేశాల మధ్య ప్రపంచంలో తొలిసారిగా జరుగుతున్న ఘర్షణ. నీవు ఉపయోగించకుంటే అణ్వాయుధాలను మాకు ఇమ్మని పాకిస్తాన్ మీద ఉగ్రవాదులు వత్తిడి తెస్తున్నట్టు వచ్చిన వార్తలు కొట్టి పారేయదగినవి కావు. గోధుమల పద్దు కోసం తన మందుగుండును ఉక్రెయిన్‌కి అమ్మేసిన పాకిస్తాన్ దగ్గర ఇప్పుడు ఆయుధాలూ లేవు. అందుకే, ఇక మిగిలినవి అణ్వాయుధాలేనని అమెరికాకు చెప్పిందంటున్నారు. ఇది పరోక్షంగా అణ్వాయుధాన్ని బయటకి తీస్తామన్న హెచ్చరిక. దశాబ్దం పాటు కశ్మీర్ మినహా మిగిలిన భారత్‌లో ఒక్క ఉగ్రవాద పేలుడు కూడా సాగనీయకుండా

శాలివాహన 1947 శ్రీ విశ్వావసు వైశాఖ బహుళ సప్తమి

లోపలి పేజీలలో...

6లో

ముఖపత్ర కథనం

ఆపరేషన్ సిందూర్

ఆధ్యాత్మికం

సర్వ సలక్షణ శోభితుడు హనుమ

25లో

సిందూర్ ప్రయోగంలో ధీరవనితలు (మహిళ)	-	26
రేవంత్ 'ఆర్థిక' ప్రకటనపై దుమారం (తెలంగాణ)	-	28
పీఎం జనౌషధి కేంద్రాలకు ప్రోత్సాహం (ఆంధ్రప్రదేశ్)	-	30
అజరామరం సంగం సాహిత్యం (గళమెత్తిన గతం)	-	32
భారత సేనకు 'సైనిక' క్రీడాకారుల వెన్నుదన్ను (క్రీడ)	-	43
సింపుల్ లవ్ స్టోరీతో 'సింగిల్' (సినిమా)	-	50

జాగృతి

సంపాదకీయం

ప్రజలను కాపాడుతూ వచ్చిన ప్రధాని మోదీ ఈ వాస్తవాలను గమనించకుండా ఉండడం సాధ్యం కాదు. దాని ఫలితం, ఆ ఫలితంతో సాధించిన పురోగతి విస్మరించడానికి వీలు లేదు. మోదీకి ముందటి హయాంలో జరిగిన ముంబై పేలుళ్లను మరచిపోయిన కొందరు ప్రధాని మోదీ గుర్తించక తప్పని ఆ వాస్తవాన్ని తొందరపడి శంకిస్తున్నారు. ఇది బాధాకరం. ఆపరేషన్ సిందూర్ ముగిసిందని మోదీ ప్రకటించలేదు. నీరూ నెత్తురూ ఒకేచోట ప్రవహించడం సాధ్యం కాదనే తేల్చి చెప్పారు. ముందు నుంచి చెబుతున్నారు. దీనిని విస్మరిస్తే ఎలా? 'పాక్ అణ్వాయుధం ప్రయోగిస్తే, 25 శాతం భారతీయులను కోల్పోయినా మేం ఖాతరు చేయం. కానీ పాకిస్తాన్ ఆ తరువాతి రోజు సూర్యోదయం చూడదు' అని నాటి అటల్ బిహారీ వాజపేయి ప్రకటించిన సంగతి విస్మరించొద్దు. 'పాక్ అణు హెచ్చరికలకు ఒక్కటే సమాధానం. మా దగ్గరా అణ్వాయుధాలు ఉన్నాయి. అవి

జాతి, నేత, నమ్మకం

దీపావళికి కాల్చుకోవడానికి కాదు' అంటూ మన మోదీ తెగేసి చెప్పిన సంగతీ అప్పుడే పాత పడితే ఎలా? యుద్ధ సమయంలో జాతి జాగరూకతతో ఉండకపోతే మొదటి విజయాన్ని ఎగరేసుకుపోయేది అబద్ధమే. ఇప్పటికే క్షిపణుల స్థాయిలో బలహీనుల మెదళ్లను తాకిన అవాస్తవాలు చేయగలిగినంత నష్టం చేశాయి. భారతజాతిని ఇంకా ఇంకా డోలాయమాన స్థితికి తీసుకువెళ్లడానికి పెద్ద అప్రకటిత యుద్ధమే జరుగుతోంది.

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత్ ఎంపిక చేసుకుని ధ్వంసం చేసిన తొమ్మిది కేంద్రాలలో మురిద్కే ఒకటి. మురిద్కే ప్రశాంత ఆధ్యాత్మిక కేంద్రమనీ, భావి పౌరులను బుద్ధిమంతులుగా, బంగారుకొండల్లా తీర్చిదిద్దే విద్యాలయమనీ సీఎన్ఎన్ జర్నలిస్ట్ కౌర్టెలియా లించ్ అక్కడ నుంచే నివేదించింది. ఈ నివేదిక పాశ్చాత్య మీడియా వక్రభాష్యాలకీ, వికార పోకడలకీ పాఠంగా ఎంపిక చేయదగినది. ఎందుకంటే ముంబై నెత్తుటి కాండను సాగించిన నరహంతకుడు అజ్మల్ కసబ్ ఇక్కడే ఉత్పత్తి అయ్యాడు. డేవిడ్ హెడ్లీ, తహవూర్ రాణా ఇక్కడే శిక్షణ పొంది భారత భూభాగాలను రక్తంతో తడిపేశారు. ఇలాంటి కేంద్రాన్ని ధ్వంసం చేసినందుకు స్థానికులు భారత్ మీద ఆగ్రహావేశాలతో రగిలిపోతున్నారంటూ ఈ మహిళా జర్నలిస్ట్ కళ్లు మూసుకుపోయి, హద్దులెరుగని అజ్ఞానంతో నివేదించింది. నీ నివేదికలో అణుమాత్రమైనా నిజం ఉందేమో, పోయి హఫీజ్ సయీద్‌నే అడిగి తెలుసుకో అంటూ భారత ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ సంచాలకుడు యశోవర్ధన్ ఝా అజాద్ ముఖం పగిలే రీతిలో ఖండించారు. ఉగ్రవాదులను మిలిటెంట్లు అంటూ గౌరవించిన న్యూయార్క్ టైమ్స్ చీవాట్లు తిన్నది. కొందరు భారత వ్యతిరేక నాటు యూట్యూబర్లు, అమ్ముడుపోయిన స్వయం ప్రకటిత వార్తా వ్యాఖ్యాతలు ఈ స్థాయిలోనే దేశ ప్రజల ఆత్మ స్థయిర్యాన్ని దెబ్బ తీయడానికి నడుం కట్టేశారు. కాల్పుల విరమణ వార్తకు ఒక చెత్త యూట్యూబర్ 'భారత్ వెనకడుగు' అని శీర్షిక పెట్టాడు. ఇవి వాస్తవాలా? మందు పడితేనే గాని మాట పెగలని, కలం కదలని జర్నలిస్టుల మత్తురాతలా? దేశం ఆలోచించాలి. కాల్పుల విరమణకు పాకిస్తాన్ దేబరించిందన్నదే తిరుగులేని వాస్తవం. భారత్ వెనకడుగు వంటి మాటలు ఏ కోణం నుంచి చూసినా నిజమని ఎవరైనా చెప్పగలరా? ఆ అవసరం ఎవరిది?

దేశం సంక్షోభంలో కొట్టుమిట్లాడుతున్నప్పుడు, ఒక నిర్దిష్ట, శాశ్వత ఫలితం కోసం యుద్ధంలోకి దూకినప్పుడు జాతిలో డోలాయమాన స్థితి ప్రమాదకరమే. మతోన్మాదం తలకెక్కి ఏడున్నర దశాబ్దాలుగా స్వైర విహారం చేస్తున్న ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెళ్లగించాలన్న సంకల్పంతో మొదటిసారి జాతి నాయకత్వం కదిలిన తరువాత అవాచ్యాలు పేలడం ఆత్మహత్యా సదృశమే. భారతజాతి ఔన్నత్యాన్ని నిరంతరం కించపరిచే శక్తులు బలపడుతున్న వేళ, భారత సార్వభౌమాధికారాన్ని అంతర్జాతీయ వేదికల నుంచి దూషించే ప్రతిపక్షం ఉన్న కాలంలో సహేతుకమైన దృష్టితో వ్యవహరించడం జాతీయవాదుల కనీస కర్తవ్యం. జాతిని నడిపే చోదకశక్తి స్థానంలో జాతీయవాదమే శాశ్వతంగా ఉండాలి. అలాంటి జాతీయవాదమే ఊపిరిగా, చారిత్రక తప్పిదాల సవరణ మీద గొప్ప దృష్టి, దేశం పట్ల బాధ్యత కలిగిన నేటి ప్రభుత్వం విషయంలో ఇలాంటి శంకలు, అనాలోచిత నిర్ణయాలు, ఆవేశంతో కూడిన సత్వర తీర్పులు, అర్ధరహిత ప్రకటనల క్షిపణిని వేగంగా వదలడం సరికాదని సవినయంగా మనవి చేస్తున్నాం. ★

38లో

కథ

సంధ్యా సమయం

- గోపరాజు వెంకట సూర్యనారాయణ



ఆపరేషన్ ఒక విజయం..

పెహల్గామ్‌లో భారతీయ మహిళల నుదుటి కుంకుమ చెరిపేయడం పాకిస్తాన్ చేసిన నూరో తప్పు. ఫలితం– ప్రపంచ పటం మీద ఆ దేశం తుడిచిపెట్టుకు పోయే పరిస్థితులు క్షిపణి వేగంతో బలపడ్డాయి. ఈ నేపథ్యంలో అంకురించినదే ఆపరేషన్ సిందూర్. సర్జికల్ స్ట్రయిక్స్ మోతాదు పొరుగు ఉన్మాదికి ఎంతమాత్రం సరిపోలేదని అర్థమైన భారత్ అపరేషన్ సిందూర్‌ను ఎంచుకుంది. అమాయకుల ప్రాణాలను తీయవద్దని, నెత్తుటికాండకు స్వస్తి పలకాలని డెబ్బయ్ అయిదేళ్లుగా చెబుతున్నా పట్టించుకోని పాకిస్తాన్‌కు బీభత్సమైన తీరులో భారతదేశం తుది హెచ్చరిక చేసింది. అణ్వాయుధాలకీ బెదరబోమని తేల్చింది.

ఎన్ని దాడులు.. ముంబైలో పేలుళ్లు (1993, 2006, 2008), తమిళనాడు పేలుళ్లు (1998), ఎర్రకోట మీద దాడి (2000), జమ్ముకశ్మీర్ అసెంబ్లీ భవనం, భారత పార్లమెంట్ భవంతి మీద (2001) దాడులు, రఘునాథ్ ఆలయం, అక్షరధామ్ మీద దాడులు (2002), వారణాసిలో వరస పేలుళ్లు (2006, 2010), జైపూర్ పేలుళ్లు (2007), హైదరాబాద్ పేలుళ్లు (2013), పఠాన్‌కోట దాడి, యూరి దాడి (2016).. ఇవి కొన్ని మాత్రమే. జమ్ముకశ్మీర్‌ను ఎన్నిసార్లు రక్తంతో తడిపారో లెక్కలేదు. ఢిల్లీ, ముంబైలను ఆ ముష్కరులే ఎన్నిసార్లు లక్ష్యం చేసుకున్నారు! ఎంత రక్తపాతం, ఎన్ని మరణాలు.. ఎంత వ్యథ, ఎంతెంత కన్నీరు! కిడ్నాప్‌లు, హైజాక్‌లు... ఇక మరొక్క ఉగ్రవాద దాడి జరిగినా అది యుద్ధచర్యగానే పరిగణిస్తామని, ప్రతి దాడి తప్పదని చెప్పేసింది బాధిత భారత్.

ఏప్రిల్ 22న పెహల్గామ్‌లో 26 మంది అమాయక పర్యాటకులను మతం అడిగి చంపిన పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం మీద భీకర ప్రతీకారం తీర్చుకుంది భారత్. మతం అడిగి హిందువులను చంపిన పాకిస్తాన్ మతమేదో తెలిసినా, ఆ మతాన్ని ప్రేమించే దేశాలేవీ దానికి వత్తాసు పలకకపోవడమే గొప్ప వైచిత్రి. మే 7వ తేదీ అర్ధరాత్రి మొదలైన గగనతల యుద్ధంతో 100 మందికి పైగా కరుడు గట్టిన ఉగ్రవాదులు ఆనాటి సూర్యోదయం చూడలేదు. దానత్వం మూర్తీభవించిన దాయాది దేశంలోని 9 ఉగ్రవాద శిబిరాల మీద మాత్రమే గురి పెట్టింది భారత సేన. కొన్ని గంటల విరామం తరువాత 11 వైమానిక కేంద్రాలను నామరూపాలు లేకుండా చేసింది. మొత్తం 20 దాడులు. అంతే, అణ్వాయుధాలు సిద్ధం చేశామంటూ, మోదీని లేపేస్తామంటూ బీరాలు పలికిన పొరుగుదేశం రెండు దశాబ్దాలకు కూడా కోలుకోలేని రీతిలో చతికిల పడింది. అయోధ్యలో రామాలయాన్ని కూల్చి మసీదు కడతామని పేలిన పాకిస్తాన్ గుండె మీదే భారత్ దాడి చేసింది. దాడులన్నీ భారత్‌ను హిందూరక్తంతో తడపడమే ధ్యేయంగా కుట్రలు పన్నుతున్న మూకల మీదే జరిగాయి. ప్రపంచాన్ని ఔరంగజేబ్ కాలానికీ ఇంకా వీలైతే అల్లావుద్దీన్ ఖిల్జీ కాలానికీ వెనక్కి మళ్లిద్దామనుకుంటున్న కుళ్లు మెదళ్లు చిట్లిపోయాయి. ఇంతకీ ఇది పూర్తి స్థాయి యుద్ధం కానేకాదు. భారత సైనిక పాటవానికి చిరు ఉదాహరణ. పెహల్గామ్

సిందూర్

ఒకింత విరామం

ఘటన తరువాత భారత్ సింధు జలాలను ఆపేస్తే, సిమ్లా ఒప్పందాన్ని నిలిపివేసి కాల్పులకు తెగబడింది పాకిస్తాన్. అంటే మౌఢ్యం వీడక తన అంతాన్ని తానే వీక్షించడానికి ఆ రోగ్ దేశం తహతహలాడుతోంది.

ఆపరేషన్ సిందూర్ రెండు అణ్వాయుధ దేశాల మధ్య ప్రపంచ చరిత్రలో జరుగుతున్న సైనిక చర్య. ఇది పూర్తిగా గగనతలంలో, డ్రోన్‌ల సాయంతో జరిగింది. కేవలం ఉగ్రమూకల శిబిరాలనే లక్ష్యంగా, సాధారణ పౌరులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తపడిన వ్యూహంతో సాగింది.

భారత సరిహద్దులకు వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న 9 ఉగ్రవాద శిబిరాలను డ్రోన్లతో ధ్వంసం చేయడమే అపరేషన్ సిందూర్ లక్ష్యం. అదే జరిగింది. 25 క్షిపణులను ప్రయోగించారు. భారత్ గురి పెట్టిన ఉగ్రమూకల శిబిరాలు: మురీద్‌కే, బహవల్‌పుర్, తెహ్రాకలాన్, సియాల్‌కోట్, సయ్యద్ నా బిలాల్, బర్నాలా, కోట్లీ, ముజఫరాబాద్‌లో (రెండు) శిబిరాల మీద దాడులు జరిగాయి. ఈ శిబిరాలు లష్కరే తాయిబా, జైష్ ఏ మహమ్మద్, హిజ్‌బుల్ ముజాహిదీన్‌కు చెందినవి. సైనిక, వైమానిక, నౌకా దళాలు కలసి చేసిన ఈ దాడి అర్ధరాత్రి 1.05కు మొదలై, 1.30 వరకు సాగింది. కేవలం 25 నిమిషాలే. ఈ దాడులను జాతి మొత్తం స్వాగతించింది. ప్రధాని, ఆయన మంత్రిమండలి హర్షం వ్యక్తం చేసింది. తరువాత ప్రధాని రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలసి పరిస్థితి వివరించారు. ఆపరేషన్ సిందూర్ వివరాలను ఆర్మీ లెఫ్టినెంట్ కర్నల్ సోనియా ఖురేషీ, వైమానిక దళ వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్, విదేశాంగ కార్యదర్శి మిస్రి దేశానికి తెలియచేశారు.

ఆపరేషన్ సిందూర్ తరువాత పాకిస్తాన్ కొంత ఆవేశపడింది. మే 9వ తేదీ అర్ధరాత్రి డ్రోన్లు, క్షిపణులతో భారత్‌పై విరుచుపడే ప్రయత్నం చేసింది. ఢిల్లీ, పంజాబ్, హరియాణాలలోని భారత సైనిక స్థావరాలపై దాడులకు ప్రయత్నించింది. దీనికి భారత వాయుసేన దీటుగా సమాధానం చెప్పింది. పాకిస్తాన్‌కు అత్యంత కీలకమైన సైనిక స్థావరాలను, వైమానిక కేంద్రాలను ఎంపిక చేసుకుని దాడికి దిగింది. అంటే మే 10 అర్ధరాత్రి దాడి చేసింది. నిజంగా ఈ దాడి భారత్–పాక్ తాజా ఘర్షణలో కీలకమైనది. పాక్‌ను అమెరికాకు పరుగెత్తాలా చేసింది. దాడి చేసిన కేంద్రాలు: చక్లాలా ఎయిర్‌బేస్, మురిద్ ఎయిర్‌బేస్, రఫీఖ్ ఎయిర్‌బేస్, రహీమ్ యార్‌ఖాన్ ఎయిర్‌బేస్, సుక్కుర్ ఎయిర్‌బేస్, నూర్ ఖాన్ ఎయిర్‌బేస్, సుక్కుర్ ఎయిర్‌బేస్, చునియన్ ఎయిర్‌బేస్. ఇందులో నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ దాడితో ఆపరేషన్ సిందూర్ మలుపు తిరిగిందని చెబుతున్నారు. దీని తరువాతే పాకిస్తాన్, భారత్ కాల్పుల విరమణకు అంగీకరించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి వర్తమానం వెళ్లింది. పాకిస్తాన్ మిలటరీ కార్యకలాపాలల డైరెక్టర్ నుంచి భారత్ మిలటరీ కార్యకలాపాల డైరెక్టర్‌కు హాట్‌లైన్ పిలుపు వచ్చింది.

పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌ను, ఉగ్రవాదుల అప్పగింత మీద మాత్రమే ఆ దేశంతో చర్చలు ఉంటాయని భారత్ అమెరికాకు తెగేసి చెప్పింది. కశ్మీర్ మీద మాకు స్పష్టమైన వైఖరి ఉంది. చర్చలకు ఒక్కటే ప్రధానం. అది ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి అప్పగించడం. అంతకు మించి మాట్లాడడానికి ఏమీ లేదు. వాళ్లు ఉగ్రవాదుల అప్పగింత గురించి మాట్లాడితేనే మేం మాట్లాడతాం. మరొక అంశం ఏదీ చర్చించడానికి మేం సిద్ధంగా లేము. ఈ చర్చలకు వేరొకరు మధ్యవర్తిత్వం వహించాలని మేం కోరుకోవడం లేదు. అని అమెరికాకు చెప్పినట్టు

ప్రభుత్వ వర్గాలు చెప్పాయి.

పెహల్గామ్ దాడి తరువాత పాకిస్తాన్‌కు అన్నీ ఎదురుదెబ్బలే తగిలాయి. ఆ దేశానికి జీవనాడి వంటి సింధు జలాలు ఆగిపోయాయి. ఆ దేశ సైన్యాధ్యక్షుడు అసీఫ్ మునీర్ కుట్ర ఫలితమే పెహల్గామ్ దాడి అన్నదే ప్రధానంగా వినిపిస్తున్నది. ఇంతలోనే రక్షణమంత్రి ఖ్వాజా అసీఫ్ మూడు దశాబ్దాలుగా మేం ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న మాట నిజమని ఆ దేశ నేషనల్ అసెంబ్లీలో అంగీకరించారు. ఇదే మాట బిలావల్ భుట్టో (మాజీ విదేశాంగ మంత్రి) కూడా చెప్పారు. తాము మదర్సాలలో చదివే పిల్లలను సైన్యానికి సహాయకులుగా ఉపయోగించుకోవాలని కూడా రక్షణమంత్రి చెప్పడం విశేషం. పుల్వామా దాడి మా పనేనని ఒక సైనికాధికారి కూడా వెల్లడించాడు. మే 7 నాటి ఆపరేషన్ సిందూర్ పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని దాదాపు అన్ని ఉగ్రవాద శిబిరాలను సర్వనాశనమయ్యాయి. పాకిస్తాన్ నేతలది తలొక దారి అని తేలిపోయింది. రష్యా నుంచి వచ్చి ఎస్ 400 (సుదర్శన చక్రం), రఫేల్ విమానాలు భారత్‌కు ఎంతో ఉపకరించాయి. ఇందుకు భారత్ ఆ దేశాలకు కృతజ్ఞులై ఉండాలి. ఆపరేషన్ సిందూర్ ప్రపంచానికి ఆధునిక యుద్ధ రీతిని పరిచయం చేసిందన్న కీర్తిని సాధించింది. భారత్ సైనిక పాటవం, ఆత్మ నిర్భర భారత్ ప్రయోజనం లోకానికి, దేశానికి వెల్లడయ్యాయి.

అమెరికా జోక్యంతో మే 10 న పాకిస్తాన్‌తో భారత్ కాల్పుల విరమణకు అంగీకరించింది. పాకిస్తాన్‌లో నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ జరిగిన దాడిలో పక్కనే ఉన్న కిరానా కొండలలోని అణ్వాయుధాగారం దెబ్బ తిన్నదని, అణ్వాయుధాలన్నీ శక్తిని, లక్షణాన్ని కోల్పోయాయని, ఇప్పుడు పాక్ అణు దేశం కాదని వార్తలు వస్తున్నాయి. అణ్వాయుధాలు ప్రయోగం జరగకుండా, కొన్ని లక్షల ప్రాణాలు పోకుండా తామే కాపాడమని అమెరికా అధ్యక్షుడు ప్రకటించుకోవడం విశేషం. ఈ 'యుద్ధం'లో పాక్‌దే విజయం అంటూ ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటించడం, ఆ దేశ పౌరులు సంబరాలు చేసుకోవడం అర్థంకాని విషయం. పాక్ ద్వంద్వ వైఖరి ఇలా ప్రతి అడుగునా బయటపడుతూనే ఉంది. ఒక పక్క సైనిక వ్యవహారాల డైరెక్టర్‌ల స్థాయి సమావేశంలో సరిహద్దు లలో సైన్యాన్ని తగ్గించుకోవాలని అనుకోవడం ఒకటి. కానీ సరిహద్దులలోల కాల్పులు ఆగకపోవడం మరొకటి. కాల్పుల విరమణకు అమెరికా అధ్యక్షుడు ఆర్భాటంగా పిలుపునిచ్చాడు. కానీ పాక్ వైపు నుంచి కాల్పులు జరుగుతూనే ఉన్నాయి. భారత్ తిప్పికొడు తూనే ఉంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ మే 12న అంత తీవ్ర హెచ్చరిక చేసిన తరువాత కూడా సరిహద్దులలో తుపాకులు మోత ఆగలేదు.

జాగృతి డెస్క్

విరామం

ఆపరేషన్ సిందూర్‌లో కాల్పుల విరమణ ఒక ప్రహేళికగా చాలా మంది భావిస్తున్నారు. ఇప్పుడు విరమణ అవసరమా అని ప్రశ్నిస్తున్నారు. ఇది భారత్‌లో గొప్ప గందరగోళాన్ని సృష్టించిన మాట వాస్తవం. కానీ కేంద్ర ప్రభుత్వం, నరేంద్ర మోదీ తమ విధానాలలో, చర్యలలో స్పష్టంగానే ఉన్నారు. కాల్పుల విరమణ క్రమాన్ని ఈ వ్యాసంలో పరిశీలిద్దాం.

'యహా సే గోలీ చలేగీతో యహా సే గోలా చలాగా' ఇదీ ప్రధాని నరేంద్ర మోదీ, సైన్యానికి చేసిన నిర్దేశం. అంటే పాకిస్తాన్ తూటాలు పేలిస్తే, క్షిపణుల తో సమాధానం ఇవ్వాలని అర్థం. అంత కచ్చితంగా ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ అకస్మాత్తుగా కాల్పుల విరమణకు అంగీకరించడం, పాకిస్తాన్‌పై తీవ్ర ఆగ్రహావేశాలతో ఉన్న దేశవాసులకు అర్థం కాలేదు. పాకిస్తాన్‌కు గట్టి బుద్ధి చెప్పడమే కాదు, పాక్ ఆక్రమిత కశ్మీర్ విషయంలో సానుకూల పరిణామం చోటుచేసుకుంటుందని, దాన్ని మనదేశంతో కలిపేసుకోవడానికి ఇంతకు మించిన అవకాశం మళ్లీ రాదని ప్రజలు గట్టిగా నమ్మారు. నరేంద్రమోదీ ఇప్పటివరకు తాను చేస్తాన న్నది చేసి చూపించిన ఆచరణశీలి కావడంతో ప్రజలు ఆయన్ను గట్టిగా నమ్మారు. పాక్‌ను అన్నిరకాలుగా ఓడించి, దాన్ని దోషిగా నిలబెట్టే సమయంలో అకస్మాత్తుగా కాల్పుల విమరణ అంటే అప్పటి వరకు ఒక ఉద్దేశంలో వున్న ప్రజలకు నమ్మశక్యం కాలేదు. గతచరిత్ర పునరావృత మవుతున్నదన్న బాధ ప్రజల్లో వ్యక్తమయింది. కానీ ప్రజల భావోద్వేగాలు వేరు. వారిమాదిరిగా ఒక పరిణిత రాజనీతిజ్ఞుడు ఎటువంటి ఉద్వేగాలకు లోనుకాడు. కేవలం లక్ష్యసాధనపైనే దృష్టిపెడతాడు తప్ప మరే ఇతర అంశాలకు ప్రాధాన్యమివ్వడు. దేశవాసుల ఉద్దేశంలో తప్పులేదు. కానీ వీరి పరిధికి, స్థాయికి రాని ఎన్నో కీలకాంశాలు ప్రధాని స్థాయి నాయకుడి దృష్టికి వస్తాయి. అన్ని కోణాల్లో అన్ని అంశాలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించు కుంటూ ముందుకు సాగాల్సి ఉంటుంది. మోదీ లాంటి నాయకుడు కాల్పుల విరమణకు అంగీక రించారంటే బలీయమైన కారణం తప్పక ఉండి వుంటుంది. దేశంలో ఎందరో ఈ అభిప్రాయానికి వచ్చిన వారూ లేకపోలేదు. మిగిలిన వారు దీని అంతరార్థం తెలుసుకోవాలి!

పాకిస్తాన్ అంటే టెర్రరిస్తాన్ అని వేరే చెప్పాల్సిన అవసరం లేదు. అభివృద్ధి మాట అట్లావుంచి అదొక ఉగ్రవాదుల ఉత్పత్తికేంద్రంగా మారిందన్న సంగతి తెలిసిందే. పెహల్గామ్ సంఘటన తర్వాత పాక్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై భారత్ నిక్కచ్చి దాడులు నిర్వహించి అనుకున్న లక్ష్యాన్ని సాధించి అందరినీ ఆశ్చర్యపరచింది. ముఖ్యంగా ఇంతటి స్థాయి ప్రతీకారాన్ని భారత్‌నుం చి ఊహించని పాక్ ఇది తమపై జరిగిన యుద్ధంగా పరిగణించి, దాడులకు తెగబడింది. ఫలితంగా నాలుగురోజుల పాటు భారత్-పాక్‌ల మధ్య జరిగిన క్షిపణులు, డ్రోన్ల దాడులు, నియంత్రణ రేఖ వెంట పరస్పర కాల్పున అనంతరం ఎట్టకేలకు మే 10వ తేదీన అకస్మాత్తుగా రెండు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించడం సాధారణ ప్రజలకు అమితాశ్చర్యాన్ని కలిగించిన మాట వాస్తవం.

కాల్పుల విరమణకు కారణాలు

ఈ నిర్ణయానికి రావడానికి అంతకుముందు

జరిగిన కొన్ని పరిణామాలు కారణమయ్యాయని చెప్పకతప్పదు. మొదటిది 10వ తేదీ సూర్యోదయ సమయానికి భారత్ బ్రహ్మోస్ క్రూయిజ్ క్షిపణులతో పాకిస్తాన్ వైమానిక స్థావరాలపై దాడిచేసింది. వీటిలో ముందుగా దెబ్బతిన్నది పాక్ ప్రధాన సైనిక కేంద్రం రావల్పిండి సమీపంలోని చక్లాలా వైమానిక స్థావరం. దీంతో పాటు పంజాబ్ ప్రావెన్స్‌లోని సర్గోధా వైమానిక స్థావరంపై కూడా భారత్ దాడిచేసింది. ఈ రెండూ పాకిస్తాన్ వైమానిక దళానికి, సైన్యానికి అత్యంత కీలకమైన ప్రదేశాలు. ఇదే సమయంలో పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లోని జకోబాబాద్, భోలారీ, స్కర్దులపై కూడా దాడులు జరిగాయి. దాడుల కారణంగా ఇవి తీవ్రంగా దెబ్బ తినడమే కాదు ప్రాణనష్టం కూడా సంభవించినట్టు వార్తలు వచ్చాయి. ఈ దాడులు జరిగిన కొద్ది సమయంలోనే పాకిస్తాన్ రక్షణ దళాల్లో హై అలర్ట్ సందేశాలు వ్యాపించాయి. ముఖ్యంగా భారత్ తన తర్వాతి దాడిని న్యూక్లియర్ కమాండ్ కంట్రోల్‌పై చేస్తుందన్న ఆందోళన వాటిల్లో స్పష్టంగా కనిపించింది. ఈ నేపథ్యంలో రావల్పిండిలోని సైనికాధికారుల వ్యూహాత్మక ప్రణాళికా డివిజన్‌తో సహా ప్రధాన కార్యాలయం చుట్టూ హై అలర్ట్ ప్రకటించి, భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఇదే సమయంలో పాక్ అధికారులు జరుగుతున్న పరిణామాలను అమెరికాకు వివరించి తక్షణ జోక్యం కోరారు. అప్పటికే యు.ఎస్. అధికారులు మన అధికారులతో సంప్రదింపులు జరుపుతూనే ఉన్నారు. ఈవిషయం తెలుసుకున్న వెంటనే యు.ఎస్. మరింత చురుగ్గా తన ప్రయత్నాలను ప్రారంభించింది. మీరు తక్షణమే ఇండియన్ ఆర్మీతో నేరుగా హాట్‌లైన్ ఏర్పాటు చేయాలని యు.ఎస్. దాదాపు పాకిస్తాన్‌ను ఆదేశించింది. మధ్యాహ్నం తర్వాత 3.35 గంటలకు సమయానికి పాకిస్తాన్ డీజీఎంఓ జనరల్ ఖసీఫ్ అబ్దుల్లా మన దేశ డీజీఎంఓ లెఫ్ట్‌నెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్‌కి హాట్‌లైన్ ద్వారా ఫోన్ చేశారు. అయితే ప్రొటొకాల్‌కు భిన్నంగా పాకిస్తాన్‌తో సైనిక లేదా దౌత్యపరమైన చర్చలు జరిపేందుకు భారత్ అంగీకరించలేదు. ఇదే సమయంలో ఎవరి మధ్య వర్తిత్వం అవసరంలేదని తెగేసి చెప్పింది. అంతేకాదు తమ తదుపరి దాడులు ఇంధన, ఆర్థికకేంద్రాలు, కమాండ్ కంట్రోల్ కేంద్రాలపై కొనసాగుతాయని స్పష్టం చేసింది. అయితే పాక్ డీజీఎంఓ అభ్యర్థన మేరకు కాల్పులు నిలపడానికి అంగీకరించింది. ఆవిధంగా మే 10 సాయంత్రం వరకు రెండు దేశాలు కాల్పులను విరమించాలని నిర్ణయించాయి. యుద్ధం జరుగుతున్న తరుణంలో ఒక దేశ డీజీఎంఓ, తన ప్రత్యర్థి దేశ డీజీఎంఓకు ఫోన్ చేశారంటే లొంగి పోయినట్టే లెక్క! మరి ఇదెట్లా జరిగిందో పరిశీలించాలి.

ఆసక్తికర పరిణామాలు

కాల్పుల విరమణకు ముందు కొన్ని ఆసక్తికర పరిణామాలు సంభవించడం గమనార్హం. ముఖ్యంగా 8వ తేదీన భారత్–పాక్‌ల మధ్య సంఘర్షణ విషయంలో యు.ఎస్. మధ్యవర్తిత్వం వహిస్తుందా? అని విలేకర్లు ప్రశ్నించినప్పుడు అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ 'దీనికి మాకు సంబంధం లేదు. మేం యుద్ధం చేయడంలేదు కదా' అని సమాధాన మిచ్చారు. మరునాడే అంటే 9వ తేదీన భారత్ రావల్పిండి వద్ద నూర్‌ఖాన్ వైమానిక స్థావరంపై దాడి జరిగిన తర్వాత జె.డి.వాన్స్, స్టేట్ సెక్రెటరీ మార్కో రుబియో మాటల్లో తేడా వచ్చింది. ఈ స్థావరం పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌కు సమీపంలో ఉండటం వీరి స్పందనకు మరో కారణం. అంతేకాదు ఇక్కడే పాక్ యుద్ధ విమానాలకు, ఇతర రవాణా వాహనాలకు ఇంధనాన్ని నింపడమే కాదు పాక్ యుద్ధ విమానాలను నిలుపుతారు కూడా. అదీకాకుండా పాకిస్తాన్‌కు చెందిన స్ట్రాటిజిక్ ప్లానింగ్ సెంటర్‌కు అతి సమీపంలో ఉంది. పాకిస్తాన్ అణ్వాయుధాల భద్రతను కూడా ఇక్కడి నుంచే పర్యవేక్షిస్తారు. అయితే భారత్ దాడిచేసిన నూర్‌ఖాన్ మాత్రమే కాదు, అట్టోక్ చమురు క్షేత్రం కూడా ఉన్నదని పాక్ టీవీల్లో జరిగిన చర్చల సందర్భంగా వెల్లడైంది. అయితే అట్టోక్ ప్రాధాన్యం ఏంటంటే ఇక్కడే అణ్వాయుధాలు మోసుకెళ్లే సామర్థ్యమున్న క్షిపణులు, మొబైల్ లాంచర్లు ఉంచుతారు. భారత్ జరిపిన దాడిలో వీటిల్లో కొన్ని ధ్వంసమయ్యాయి. నేషనల్ డిఫెన్స్ కాంప్లెక్స్ వీటిని అభివృద్ధి చేస్తుంది. ఇది ఇస్లామాబాద్‌కు పశ్చిమంగా ఉన్న కాలా చిత్తాధర్ పర్వత ప్రాంతంలో ఉంది. భారత్ డ్రోన్లు దాడి చేసిన అట్టోక్ చమురుక్షేత్రానికి, నేషనల్ డిఫెన్స్ కాంప్లెక్స్ సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉండటం గమనార్హం. ఆపరేషన్ సిందూర్‌లో మనదేశం ప్రధానంగా పాకిస్తాన్ గగనతల రక్షణ వ్యవస్థను, నేవీని, వైమానిక స్థావరాలను ధ్వంసం చేసింది. ఒకవిధంగా చెప్పాలంటే పాక్ ఆయువుపట్టును తీవ్రంగా దెబ్బ తీసినట్లయింది. మే 10వ తేదీన ఉదయం 90 నిముషాల్లో 11 విమాన ఎయిర్ బేస్‌లను ధ్వంసం చేసింది. ఈ దాడుల్లో తొలిసారి బ్రహ్మోస్‌ను ఉపయోగించడం గమనార్హం.

కిరానా పర్వతప్రాంతంపై దాడులు

భారత్ కిరానా వర్వత ప్రాంతంపై దాడిచేసిందన్న వార్తలు వచ్చాయి. ఇవి పంజాబ్‌లోని సర్గోధా జిల్లాలో ఉంటాయి. శిలలతో నిండివుండే ఈ పర్వతాలు పాక్ రక్షణశాఖ నియంత్రణలో ఉంటాయి. ఇక్కడే పాకిస్తాన్ తన అణ్వాస్త్రాలను నిల్వచేస్తుందని చెబుతారు. ముఖ్యంగా కిరానా పర్వతాల సొరంగం ముందుభాగంపై ఎప్పుడైతే భారత్ హెచ్చరిక దాడి చేసిందో అప్పుడు 4.0

తీవ్రతతో భూకంపం సంభవించిందన్నది సోషల్ మీడియాలో వస్తున్న వార్తల సారాంశం. ఈ కిరానా పర్వతాల సొరంగం ముందుభాగంలో పెద్ద విస్ఫోటానికి సంబంధించిన చిత్రాలు కూడా సోషల్ మీడియాలో వైరలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న చైనా వెంటనే అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి. వాన్స్‌కు తెలియజేయడంతో పాటు మార్కో రూబియోకు కూడా తెలిపింది. దీంతో ట్రంప్ ఇందులో కలుగజేసుకున్నారనేది ఒక కథనం.

మూడు భూకంపాలు

అణ్వస్త్ర పరీక్షలు జరిపినప్పుడు సంభవించే భూకంపాలు రిక్టర్ స్కేల్‌పై 5 వరకు తీవ్రతను నమోదు చేస్తాయి. పరీక్షలు జరిపిన 10 నుంచి 70 రోజుల్లోగా, పరీక్షలు జరిపిన ప్రదేశంనుంచి 5–15 కిలోమీటర్ల లోతులో భూకంపాలు సంభవించే అవకాశముందని అణుపరీక్షలు నిర్వహించిన (అధికంగా యు.ఎస్) డేటా చెబుతోంది. అయితే ఈ భూకంపాలు, భూమిపై 50 కిలోమీటర్ల పరిధికి ఆవల ఏర్పడబోవని ఇటీవలి చరిత్ర చెబుతోంది. ఇక పాకిస్తాన్ విషయానికి వస్తే మే 5వ తేదీనుంచి 10వ తేదీలోపున మూడు భూకంపాలు సంభవించాయి. మే 10వ తేదీ తెల్లవారుజామున 1.44 గంటలకు రిక్టర్ స్కేలుపై 4 తీవ్రతతో ఒక భూకంపం నమోదు కాగా, అదేరోజు ఉదయం 5.7 తీవ్రతతో భూకంపం సంభవించింది. దీనికి

కొద్దిరోజుల ముందు అంటే మే 5వ తేదీ సాయంత్రం 4 గంటలకు పాకిస్తాన్, అఫ్ఘానిస్తాన్ సరిహద్దు ప్రాంతాల్లో మరో భూకంపం సంభవించింది. వీటికి మూలం ఖైబర్ ఫక్తూన్‌క్వా ప్రావెన్స్‌లోని చింత్రాల్ జిల్లాలో ఉన్నట్టు గుర్తించారు. అంతేకాదు ఇది బెలూచిస్తాన్ రాజధాని క్వెట్టాకు సమీపంలో ఉండటం గమనార్హం. మరి క్వెట్టా, పాకిస్తాన్ చారిత్రక అణుపరీక్షా కేంద్రం చగాయ్ పర్వతాలకు దగ్గరగా ఉంది. ఈ జిల్లా అఫ్ఘానిస్తాన్ సరిహద్దుకు అతి సమీప ప్రాంతం. అదేరోజు మధ్యాహ్నం 12.35 గంటలకు ఆఫ్ఘనిస్తాన్‌లో ఒక భూకంపం సంభవించడం గమనార్హం. ఈ భూకంపాలు సంభవించిన ప్రదేశాలు, సమయాలను పరిశీలిస్తే అణు పరీక్షలు లేదా మరే ఇతర సంఘటనలు జరిగివుండవచ్చునన్న అనుమానాలు వ్యక్తమవడం సహజం. ఒకవేళ ఈ భూకంపాలు ప్రకృతి సిద్ధంగా సంభవిస్తే, పాకిస్తాన్ అణ్వస్త్రాలు అంత సురక్షితంగా లేవనే చెప్పాలి. ఒక మానవకల్పితంగా భూకంపాలు ఏర్పడితే, పాక్ కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థ అత్యంత బలహీనంగా ఉన్నట్టు భావించాలి.భారత్ దాడులు చేసిన ప్రదేశాలు కూడా ఈ ప్రాంతాలకు సమీపంగా ఉండటం గమనార్హం. ఏది ఏమైనా పాకిస్తాన్ అణ్వస్త్రాలు తగినంత భద్రంగా లేవన్నది మాత్రం సుస్పష్టం.

ఈజిప్ట్ విమానం ఎందుకొచ్చినట్టు?

ఇదిలావుండగా ఈజిప్ట్‌కు చెందిన ఒక సైనిక కార్గో విమానం పాకిస్తాన్‌కు చేరుకుంది. బహుశా అమెరికా అధికార్ల అభ్యర్థనమేరకు ఈ విమానం ఇక్కడకు చేరుకొని ఉండవచ్చు. ఇది ఎందుకు వచ్చిందనేదానిపై అధికారులు పెదవి విప్పకపోయినప్పటికీ, భారత్‌తో సంఘర్షణ సమయంలో ఇది ప్రత్యక్షం కావడం కొన్ని అనుమానాలకు దారి తీస్తోంది. ఇక్కడి పరిణామాలకు సంబంధం లేకపోయినా ఈజిప్ట్ విమానం ఇక్కడ ప్రత్యక్షం కావడానికి కొన్ని కారణాలను ఊహించవచ్చు. బోరాన్-10 అనేది బోరాన్ మూలకానికి ఐసోటోప్. ఇది ఈజిప్ట్‌లో ప్రపంచంలోనే అత్యధికంగా లభిస్తుంది. ఈ బోరాన్-10కి అణుధార్మికతను పీల్చుకునే శక్తి ఉందన్న సంగతి ప్రపంచ వ్యాప్తంగా తెలిసిందే. ఎక్కడైనా అణు లీకేజీలు సంభవించినప్పుడు బోరాన్-10ను ఉపయోగించి అరికట్టడం సర్వసాధారణంగా జరిగేదే. మరి పాక్ ప్రభుత్వం దీనిపై మౌనం వహించడం, అంతర్జాతీయంగా అత్యున్నత స్థాయిలో (యు.ఎస్) కలుగజేసుకోవడం అనేవి ఇక్కడ గుర్తించాల్సిన అంశాలు. కాగా యు.ఎస్.కు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ విమానం ఇస్లామాబాద్‌లో మే 10న దిగింది. ఒకవైపు ఈజిప్ట్ విమానం మరోవైపు యు.ఎస్. అధికారులు రావడం చూస్తుంటే పాక్ అణ్వస్త్రాలకు ఏదో జరిగిందని అనుకోవాల్సి వస్తోంది. యు.ఎస్. సంస్థ, అణ్వస్త్ర నిల్వలు, అణ్వస్త్ర భద్రత, రేడియేషన్‌కు సంబంధించిన అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడం వంటి కార్యకలాపాలు నిర్వహిస్తుంది. మొత్తంమీద అణుసం బంధ సమస్యలపై ఈ సంస్థకున్న విమానం అన్ని రకాల పరిశోధనలు చేస్తుంది. ఈ నేపథ్యంలో పాక్ అణ్వస్త్రాలు దాచిన ప్రదేశం నుంచి రేడియేషన్ సమస్య ఏమైనా ఉత్పన్నమైందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఆకాశ్ క్షిపణుల పనితీరు అద్భుతం

ఈ యుద్ధంలో ఆకాశ్ క్షిపణుల ఎంతో కీలకపాత్ర పోషించాయి. ఇవి ఆఫెన్స్, డిఫెన్స్‌కు పనికొస్తాయి. ఇవి నావిక్ ఉపగ్రహ వ్యవస్థ నియంత్రణలో పనిచేస్తాయి. నావిక్ వ్యవస్థ, జీపీఎస్ కంటే ఎంతో కచ్చితమైన మ్యాపింగ్‌తో పనిచేస్తుంది. ఉగ్రవాద శిబిరాలపై నిక్కచ్చిగా ఎటువంటి తేడా లేకుండా సైన్యం దాడిచేయడానికి అందుకు నావిక్ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడింది. ఆకాశ్ ఇతర వ్యవస్థల్లో మనదేశం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను విస్తృతంగా ఉపయోగించింది. ఇవి తాము ప్రయాణించే సమయంలోనే ఎప్పటికప్పుడు తగిన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం కలిగివుంటాయి. నిజంగా ఇది ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఇక పాకిస్తాన్ వ్యవస్థలు చైనా ఉపగ్రహ వ్యవస్థల నియంత్రణలో పనిచేస్తున్నాయి. ఇవి పనిచేయడానికి గ్రౌండ్ కంట్రోల్ వ్యవస్థలుండాలి. వాటిని పూర్తిగా మన వాయుసేన ధ్వంసం చేయడంతో, పాక్ వాయుసేనకు ఎటువంటి సమాచారం అందకుండా పోయింది. ఫలితంగా ఏం జరుగుతున్నదీ, ఏవిధంగా ప్రతిక్రియ చేయాలన్న విషయంలో పూర్తి అయోమయం నెలకొంది. ఒక రకంగా చెప్పాలంటే నిస్తేజం ఆవహించింది. సోషల్ మీడియాలో పాక్ ప్రజలు, 'మా ఎయిర్‌ఫోర్స్ ఎక్కడ?' 'మా సైన్యం ఎక్కడ?' అంటూ వీడియోలు పెట్టడం మనం చూశాం. వారికి అసలు విషయం తెలియదు కదా! ఈవిధమైన మన సాంకేతిక ఆధిపత్యాన్ని చూసి అమెరికా, రష్యా, చైనాలు బిత్తరపోయాయి. ఒకప్పుడు భారత్ సైన్యం చాలా పటిష్టమైంది, ధైర్యంగా యుద్ధాలు చేస్తుంది కానీ సాంకేతికంగా చాలా వెనుకబడివున్నదన్న అభిప్రాయాలుండేవి. ఇప్పుడు వాటిని మన సైన్యం పటాపంచలు చేసింది.

జమలాపురపు విఠల్‌రావు
సీనియర్ జర్నలిస్ట్

మే 12 రాత్రి 8 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీ జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. సమయం సందర్భం ఎరిగిన ప్రధానిగా మోదీ కాల్పుల విమరణ నిర్ణయం సృష్టించిన గందరగోళాన్ని దృష్టిలో ఉంచుకుని ఆ గందరగోళాన్ని తొలగించే ప్రయత్నం చేశారనిపిస్తుంది. ఉద్వేగంతో ఆయన మాట్లాడారు. ఒక యుద్ధంలో తెరవెనుక ఉండే అన్ని అంశాలను బయటపెట్టడం సాధ్యం కాదన్న ధ్వని కూడా ఆయన ఉపన్యాసంలో ఉంది. ఉగ్రవాదం-చర్చలు, ఉగ్రవాదం-వాణిజ్యం ఒకేసారి సాధ్యం కావు.. ఒకేచోట నీళ్లు, నెత్తురు ప్రవహించవు అని వాస్తవం చెప్పారు. భారత దేశాన్ని, ప్రజలను కాపాడుకోవడానికి ఎంత పెద్ద నిర్ణయానికైనా వెనుకాడబోమని తేల్చి చెప్పారు. ఉగ్రవాదాన్నే కాదు, దానికి అండనిస్తున్న శక్తులను విడిచిపెట్టేది లేదని ఆయన పాంచజన్యం పూరించారు. ఉగ్రవాదం వెనుక ఉన్నవారు ఎవరో కూడా

స్పష్టంగానే చెప్పారు. ఒకటి పాకిస్తాన్, రెండు పాక్ సైన్యం. ఇంకా ఐఎస్ఐ. పాక్ సైన్యం, అక్కడి ప్రభుత్వం ఉగ్రవాదానికి ఎలా నీళ్లు, ఎరువు వేస్తూ వస్తున్నాయో అలాగే అవి ఏదో ఒకరోజు ఆ దేశాన్ని కూడా అంతం చేస్తాయి. పాకిస్తాన్ తనను తాను కాపాడుకోవాలంటే ఉగ్రవాద వ్యవస్థల్ని ధ్వంసం చేయాల్సిందే నిర్ద్వంద్వంగా వెల్లడించారు మోదీ.

ఆపరేషన్ సిందూర్ మొదలయ్యాక జాతినుద్దేశించి ఆయన మాట్లాడటం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా భారత్ వైఖరిని స్పష్టంగా చాటి చెప్పారు. తన ప్రసంగంలో మోదీ ఉపయోగించిన భాష, అందులోని భావం క్షిపణి ధ్వనులను మరిపించాయంటే అతిశయోక్తి కాదు. నిప్పుల వానలా సాగిన ఆ 22 నిమిషాల ప్రసంగంలో అనేక కీలకాంశాలు వచ్చాయి.

భారత్ ప్రళయ భీకర దాడులను తట్టుకోలేకే



'ఆపరేషన్' ఆపలేదు! ఆగదు!

పాకిస్తాన్ కాల్పుల విరమణ పేరుతో కాళ్ల బేరానికి వచ్చిందని నరేంద్రమోదీ పేర్కొన్నారు. నవయుగ యుద్ధంలో పాక్‌ను భారత్ మట్టి కరిపించిందని, వారు సరిహద్దుల్లో యుద్ధానికి దిగితే మన సేనంతో వాళ్ల గుండెపైనే కొట్టగలిగామన్నారు. కాల్పుల విరమణ కాలమంతా ఆ దేశ ప్రవర్తనను పరిశీలిస్తామని, ముమ్మందు ఏమాత్రం తేడా వచ్చినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. దాయాది దేశం మన పాఠశాలలు, సాధారణ ప్రజల ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటే, వారి ముఖ్యమైన మౌలిక వసతులు, ఉగ్రవాద స్థావరాలను విధ్వంసం చేసి మన సత్తాను చాటగలిగామని ప్రధాని ప్రకటించారు. ఇంకా ఆయన– 21వ శతాబ్దపు సరికొత్త యుద్ధంలో భారత్ తన స్వదేశీ ఆయుధ శక్తిని ప్రపంచానికి చూపింది. పెహల్గామ్‌లో ఉగ్రవాదులు వికృత క్రూరత్వాన్ని ప్రదర్శించి కుటుంబసభ్యుల ముందే అమాయక ప్రజలను చంపినందుకు ప్రతీకారంగా పాకిస్తాన్‌లోని ఉగ్ర సౌధాలను కుప్ప కూల్చి 100 మందికి పైగా పేరుమోసిన ఉగ్రవాదులను అంతమొందించాం. ఆ దేశంతో చర్చలంటూ జరిగితే ఉగ్రవాద నిర్మూలన, పాక్ ఆక్రమిత కశ్మీర్‌పైన మాత్రమే. భారతదేశాన్ని, ప్రజలను రక్షించుకోవడానికి ఎంత పెద్ద నిర్ణయానికైనా వెనుకాడబోము. సైనిక శౌర్య పరాక్రమాలకు సెల్యూట్. అన్నింటికంటే ముందు మన సేనలు, నిఘా విభాగాలు, శాస్త్రవేత్త లకు ప్రతి భారతీయుడి తరపున సెల్యూట్ చేస్తున్నా. ఆపరేషన్ సిందూర్ లక్ష్యం సాధించడానికి మన వీర సైనికులు విశేష శౌర్య పరాక్రమాలు ప్రదర్శించారు. నేను వారి వీరత్వం, సాహసం, పరాక్రమాన్ని ఈ దేశంలోని తల్లులు, సోదరీమణులు, ఆడబిడ్డలకు అంకితం చేస్తున్నాను. సెలవుల్లో ఆనందంగా గడుపుతున్నవారిని మతం అడిగి మరీ, వారి పిల్లల ముందు పాశవికంగా చంపడం ఉగ్రవాద వికృత రూపానికి, క్రూరత్వానికి పరాకాష్ట. ఇది నాకు వ్యక్తి గతంగా అత్యంత దుఃఖం కలిగించింది. ఈ దాడి తర్వాత దేశం మొత్తం ఒక్కటైంది. ఉగ్రవాదం పట్ల కఠినంగా వ్యవహరించాలని నినదించింది. ఆ తర్వాతే మేం ఉగ్రవాదాన్ని మట్టిలో కలిపేందుకు మన సేనలకు సంపూర్ణ స్వేచ్ఛనిచ్చాం. మన సోదరీ మణులు, బిడ్డల నుదుటి సిందూరం తుడిచేయడానికి ప్రయత్నించిన ప్రతి ఉగ్రవాది, ఉగ్రవాద సంస్థకు దాని పర్యవసానం ఏమిటో తెలిసి వచ్చింది. కోట్ల మంది మనోభావనల ప్రతిబింబం ఆపరేషన్ సిందూర్, కేవలం పేరుకాదు. కోట్ల మంది ప్రజల మనోభావనల ప్రతిబింబం. భారత్ ఇంత పెద్ద నిర్ణయం తీసుకుంటుందని ఉగ్రవాదులు కలలో కూడా ఊహించలేదు. పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారతీయ క్షిపణులు, డ్రోన్లు విరుచుకు పడ్డాయి. బహవల్‌పుర్, మురీద్‌కెలు ప్రపంచ ఉగ్రవాద విశ్వవిద్యాలయాలుగా మారాయి. ప్రపంచంలో ఎక్కడ ఏ పెద్ద ఉగ్రవాద దాడి జరిగినా అందులో వీటి పాత్ర ఉంటున్నది. 9/11 సహా దేశంలో దశాబ్దాల తరబడి జరుగుతూ వచ్చిన పెద్ద పెద్ద ఉగ్రవాద దాడులన్నీ వీటితో ముడిపడి ఉన్నాయి. ఉగ్రవాదులు మన సోదరీమణుల సిందూరం తుడిచేస్తూ వచ్చారు. అందుకే ఆ ఉగ్రవాద ప్రధాన కార్యాలయాన్ని సైన్యం ధ్వంసం చేసింది. గత మూడు దశాబ్దాలుగా ఈ ఉగ్రవాదులు పాకిస్తాన్‌లో స్వేచ్ఛగా తిరుగుతూ భారత్‌కు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతూ వచ్చారు. ఒక్క దెబ్బతో వీరిని సైన్యం తుడిచిపెట్టింది.

భారత్ కార్యాచరణను చూసి పాకిస్తాన్ నిరాశ, నిస్పృహల్లో కూరుకుపోయింది. బిత్తరపోయింది. ఈ తత్తరపాటులో మరో దుస్సాహసానికి పాల్పడింది. ఉగ్రవాదంపై పోరులో భారతదేశానికి మద్దతు పలకడానికి బదులుగా భారత్‌పైనే దాడి చేయడం మొదలు పెట్టింది. మన పాఠశాలలు, కళాశాలలు, గురుద్వారాలు, ఆలయాలు, సామాన్య ప్రజల ఇళ్లను, మన సైనిక స్థావరాలనూ లక్ష్యంగా చేసుకుంది. కానీ పూర్తిగా నిర్వీర్యం అయిపోయింది. పాకిస్తాన్ డ్రోన్లు, క్షిపణులు ఎలా గడ్డిపోచల్లా గాల్లో కలసి పోయాయో ప్రపంచం చూసింది. ఆ నష్టాన్ని ఊహిం చడం కష్టం. అందుకే బయటపడే మార్గం కోసం పాక్ వెదికింది. ప్రపంచం మొత్తం తిరిగి అందరినీ ప్రాధేయ పడింది. ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం పాకిస్తాన్ సైన్యం మన డీజీఎంవోని సంప్రదించింది. ఆలోపే మనం పాకిస్తాన్‌లోని మొత్తం మౌలిక వసతులను పూర్తిగా ధ్వంసం చేశాం. ఉగ్రవాద స్థావరాలను శిథిలాలుగా మార్చేశాం. అందుకే తమవైపు నుంచి ఉగ్రవాద కార్యకలాపాలు, సైనిక దుస్సాహసాలు ఉండవని పాకిస్తాన్ చెప్పింది. భారత్ కూడా వాటిని వరిగణనలోకి తీసుకుని ఆలోచించింది. యుద్ధ మైదానంలో మనం ప్రతిసారీ పాక్‌ను మట్టి కరిపించాం. ఈ ఆపరేషన్ ద్వారా 'భారత్‌లో తయారీ' ఆయుధాల ప్రామాణికత నిరూపితమైంది. ఈ యుగం యుద్ధానిది కాదు... ఉగ్రవాదులదీ కాదు. దేశ ప్రజలారా! ఈరోజు బుద్ధ పూర్ణిమ. బుద్ధ భగవానుడు మనకు శాంతిమార్గం చూపారు. శాంతి మార్గం కూడా అత్యంత శక్తితోనే ఉంటుంది. వికసిత్ భారత్ కలలను సాకారం చేసుకోవాలంటే భారత్ శక్తిశాలి కావడం చాలా అవసరం. అవసరమైనప్పుడు ఈ శక్తిని ఉపయోగించడం కూడా అత్యవసరం. గత కొన్ని రోజుల్లో భారత్ ఇదే చేసింది అన్నారు మోదీ.

ఇంకా– మనం పాకిస్తాన్ ఉగ్రవాద, సైనిక స్థావరాలపై దాడులు నిలిపేశాం. రాబోయే రోజుల్లో ఆ దేశం ప్రతి అడుగునూ, ప్రతి ఆలోచననూ పరిశీలిస్తాం. దళాలన్నీ నిరంతరం అప్రమత్తంగా ఉన్నాయి. మెరుపుదాడులు, గగనతల దాడుల తర్వాత ఇప్పుడు ఆపరేషన్ సిందూర్ నిర్వహించాం. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా భారత్ విధానం ఇక ఇదే. ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో ఆపరేషన్ సిందూర్ సరికొత్త ప్రమాణాన్ని నిర్దేశించింది. భారతదేశం మీద ఉగ్రవాదానికి పాల్పడితే మూతి పగులగొట్టేలా గట్టి సమాధానం ఇస్తాం. మన సొంత మార్గంలో, స్వీయ నిబంధనల ప్రకారం స్పందిస్తాం. ఉగ్రవాద మూలాలు బయటపడే ప్రతిచోటా కఠిన చర్యలు తీసుకుంటాం. అణుబాంబు బెదిరింపులను భారత్ సహించదు. ఈ ముసుగులో విజృంభిస్తున్న ఉగ్రవాద స్థావరాలపై కచ్చిత మైన, నిర్ణయాత్మకమైన దాడి చేస్తుంది. ఉగ్రవాద తండాలను, వాటిని ప్రోత్సహించే ప్రభుత్వాన్ని భారత్ విడివిడిగా చూడదు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచం మొత్తం పాకిస్తాన్ వాస్తవ చిత్రాన్ని చూసింది. హతమైన ఉగ్రవాదుల అంత్యక్రియల్లో ఆ దేశం ఉన్నతా ధికారులు పాల్గొనడం, ప్రభుత్వ ప్రాయోజిత ఉగ్రవాదానికి ప్రజల సాక్ష్యం. భారత్ తన ప్రజలను కాపాడుకోవడానికి నిరంతరం భారీ నిర్ణయాలు తీసుకుంటుంది అన్నారాయన. చివరిగా 'భారత్ మాతాకీ జై' అని మూడుసార్లు మోదీ నినదించారు.

ప్రధాని ఉపన్యాసం ఇంత తీవ్ర పదజాలంతో సాగినా పాక్ సైనికుల తలకెక్కడం లేదు. ఇరు దేశాల మధ్య అంతర్జాతీయ సరిహద్దు వెంబడి జమ్ముకశ్మీర్‌లోని సాంబ సమీపంలో ఆ రాత్రే డ్రోన్ల కదలికలు కనిపించాయి. **– జాగృతి డెస్క్**

సైనిక శక్తికి

మే 7వ తేదీ అర్ధరాత్రి పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత సైనిక దళాలు చేసిన దాడుల పట్ల పలువురు విపక్ష ప్రముఖుల హర్షం వ్యక్తం చేశారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్తాన్‌లోను, ఆక్రమిత కశ్మీర్‌లోను ఉన్న తొమ్మిది ఉగ్రవాద శిబిరాలపై ఎంపిక చేసుకుని భారత సేనలు దాడులు చేశాయి. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగిన ఈ దాడులను దాదాపు అన్ని భారత రాజకీయ పక్షాలు స్వాగతించాయి. మే7 వ తేదీన ఆ పార్టీల నేతలు అభినందనల వర్షం కురిపించారు. రాజకీయ నేతలే కాకుండా పలు ప్రజా సంఘాలు, వ్యక్తులు కూడా తమ హర్షం వ్యక్తం చేశారు.

యావత్ భారతావని ఆపరేషన్ సిందూర్ పట్ల సంతోషం వ్యక్తం చేసింది. భారత సైన్యం సాహసానికి అభినందనలు తెలిపింది.

కేంద్రమంత్రి మండలి, మోదీ హర్షం

ఎంపిక చేసిన ఉగ్రవాద శిబిరాలే లక్ష్యంగా భారత సైనిక దళాలు విజయంతంగా దాడులు నిర్వహించడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ మే 7న హర్షం వ్యక్తం చేశారు. ఆపరేషన్ సిందూర్ ముగిసిన కొన్ని గంట తరువాత కేంద్ర మంత్రి మండలి సమావేశానికి ప్రధాని అధ్యక్షత వహించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆపరేషన్ సిందూర్ గురించి వివరాలు తెలియచేయగానే మంత్రి మండలి మొత్తం సంతోషం వ్యక్తం చేసింది. తమ ప్రభుత్వం ఉగ్రవాదాన్ని ఏ మాత్రం సహించదని ప్రధాని చెప్పినట్టు తెలిసింది. తరువాత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్‌తో ప్రధాని ప్రత్యేకంగా సమావేశమై పరిస్థితిని సమీక్షించారు. తరువాత మీడియా ప్రత్యేక సమావేశం జరిపి విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కర్నల్ సోఫియా ఖురేషీ, వ్యోమికా సింగ్ (మహిళా అధికారులు) లతో కలసి వివరాలు అందించారు. మొత్తం ప్రదేశాలను ఎంపిక చేసుకుని విజయ వంతంగా దాడులు చేశామని వ్యోమికా సింగ్ విలేకరు లకు తెలిపారు.

మన భద్రతా దళాలను చూసి గర్విస్తున్నానని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. కేంద్రమంత్రులు, ఎంపీలు, రాష్ట్రాల బీజేపీ నాయకులు ఆపరేషన్ సిందూర్‌ను అభినందించారు. భారత సైన్యానికి సెల్యూట్ అంటూ తెలంగాణ శాసనసభలో బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బీజేపీ మహిళా నేతల ప్రశంసలు

ఆపరేషన్ సిందూర్‌ను బీజేపీ మహిళా నేతలు స్వాగతించారు. ఉగ్రవాదాన్ని భారత్ ఏనాటికీ సహించదని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. సీతారామన్ గతంలో రక్షణ మంత్రి బాధ్యతలు నిర్వహించిన సంగతి తెలిసినదే. ఇద్దరు మహిళా అధికారుల ద్వారా ఆపరేషన్ సిందూర్ వివరాలు వెల్లడించడాన్ని బట్టి భారత్ భద్రతా బలగాలలో మహిళల బలం ఎంతో వెల్లడయిందని కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే చెప్పారు. సైనిక దళాలకు అభినందనలు అని కేంద్ర మహిళా శిశు సంక్షేమ మంత్రి అన్నాపూర్ణా దేవి అన్నారు. ఈ దాడి నిర్వహించిన సైనికులకు, వారి కుటుంబీకులకు భారత జాతి అభినందనలు తెలియచేస్తున్నదని ఆమె చెప్పారు. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా తన ఎక్స్ ఖాతా వేదికగా, 'భారతమాతాకు జై' అని ట్వీట్‌చేశారు.

చంద్రబాబు, ఏపీ మంత్రిమండలి హర్షం

ఆపరేషన్ సిందూర్ దిగ్విజయంగా నిర్వహించినందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆయన మంత్రి మండలి సభ్యులు సైనిక దళాలను అభినందించారు. ఈ చర్యకు మంత్రిమండలి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ఒక తీర్మానం కూడా చేసింది. ఈ చర్యకు ఆపరేషన్ సిందూర్ అని పేరు పెట్టడం ఎంతో సబబని కూడా మంత్రి మండలి అభిప్రాయపడింది.

భారతీయునిగా గర్విస్తున్నా: కేసీఆర్

ఆపరేష సిందూర్ ద్వారా భారత బలగాలు చూపిన సాహసానికి భారతీయునిగా గర్విస్తున్నానని బీఆర్ఎస్ నాయకుడు, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు వ్యాఖ్యానించారు. ఉగ్రవాదం ఏ దేశంలో ఉన్నా, ఏ రూపంలో ఉన్నా అది ఎవరికీ మేలు చేసేది కాదని ఆయన చెప్పారు.

భారతావని వందనం

భారత సైనిక శక్తిని 140 మంది భారతీయులు శ్లాఘిస్తున్నారని, ఆపరేషన్ సిందూర్ పెహల్గావ్ దుర్ఘటనలో పసుపు కుంకుమలు కోల్పోయిన వారికి న్యాయం చేసిందని రేఖా గుప్తా అన్నారు. భద్రతా బలగాల సాహసాన్ని స్మృతి ఇరానీ, రక్షా ఖాండ్సే, అగ్నిమిత్ర పాల్ (పశ్చిమ బెంగాల్ ఎమ్మెల్యే), మౌనిక సుంకర (తెలంగాణ) శ్లాఘించారు. జైహింద్, జైహింద్‌కీ సేన అని వారు తమ ఎక్స్ ఖాతాలలో పేర్కొన్నారు.

రేవంత్ సంఘీభావ ర్యాలీ

ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మే 8న హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు ప్రదర్శన జరిగింది. ముఖ్యమంత్రి స్వయంగా జాతీయ పతాకం ధరించి పాల్గొన్నారు. భారత సార్వభౌమాధికారం

మీద దాడి చేయాలనుకునే వారికి ఈ భూమ్మీద నూకలు చెల్లినట్టేనని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. భారతీయుల శాంతి తత్వాన్ని ఎవరైనా అసమర్థత అనుకుంటూ, దేశంలోకి వచ్చి ఆడపడుచుల కుంకుమ చెరిపివేయాలని అనుకుంటే వారికి ఆపరేషన్ సిందూర్ వంటి చర్యలే సమాధానమని అన్నారు. ఇందులో మంత్రులు, సచివాలయోద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దాడి అనివార్యం: జగన్

భారత్‌లో రక్తపాతం సృష్టిస్తున్న ఉగ్రవాదుల శిబిరాల మీద చర్య తీసుకోవడం అనివార్యమని ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్‌సీపీ నాయకుడు వైఎస్ జగన్ అన్నారు.

సైనికుల సాహసం అపూర్వం: ఖర్గే

పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోను ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేసిన భారత సేనలకు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ప్రకటించింది. దేశ భద్రతకు కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నది. సైనికులు చూపిన చొరవ, సాహసం వింటే ఎంతో గర్వంగా ఉంది అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. మన సైనిక దళాలు చూపిన ధైర్య సాహసాలను అభినందిస్తున్నాను అని ఆయన పేర్కొన్నారు.

'మన సైన్యాలను చూసి గర్విస్తున్నాను, జైహింద్' అని రాహుల్ గాంధీ ఎక్స్ కాతా వేదికగా పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ దేశ భద్రతకు పెద్ద పీట వేస్తుందని, ఏప్రిల్ 22 నుంచే భద్రతా దళాలు తీసుకుంటున్న చర్యలకు కాంగ్రెస్ మద్దతు ఇస్తూనే ఉందని పార్టీప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ అన్నారు.

వాళ్ల ఖర్మ వాళ్లు అనుభవిస్తున్నారు: ప్రియాంక చతుర్వేది

వాళ్ల మతం ఏమిటి అని అడిగారు. ఇప్పుడు వాళ్ల ఖర్మ వాళ్లు అనుభవిస్తున్నారు. ఇది భారత సైన్యం ఘనత అని ప్రియాంక చతుర్వేది (శివసేన యూబీటీ) వ్యాఖ్యానించారు.

మళ్లీ లేకుండా కొట్టాలి: ఆదిత్య ఠాక్రే

ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్న నిర్మూలించ వలసిందే. మళ్లీ ఉగ్రవాదం తలెత్తలేనంత బలంగా కొట్టండి, జైహింద్ అని ఆదిత్య ఠాక్రే వ్యాఖ్యానించారు.

ఉగ్రవాదం ఇక కనిపించ కూడదు: తేజస్వీ యాదవ్

భారత్‌కు వందనం. ఉగ్రవాదం ఉండకూడదు. వేర్పాటువాదం ఉండకూడదు. సాహస వంతులైన మన సైనికులను చూసి మనం గర్వించాలి అని ఆర్‌జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ అన్నారు.

సైన్యానికి బాసటగా ఉంటాం: ఎంకే స్టాలిన్

పాకిస్తాన్, పాక్‌ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రవాద శిబిరాల మీద దాడి చేసినందుకు భారత సేనలను తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ అభినందించారు. (పీటీఐ) ఉగ్రవాదం అణచివేత కార్యక్రమంలో తమిళనాడు సైన్యానికి బాసటగా ఉంటుందని ఎక్స్ వేదికగా ఆయన వెల్లడించారు. దేశానికి, సైన్యానికి వెన్నుదన్నుగా ఉండాలని డీఎంకే భావిస్తున్నదని అన్నారు.

సైన్యానికి స్వేచ్ఛనిచ్చిన తొలి ప్రధాని మోదీ: దేవెగౌడ

ఉగ్రవాదం అణచివేతకు ప్రధాని నరేంద్ర మోదీ స్థిరమైన నిర్ణయాలు తీసుకున్నారని మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ శ్లాఘించారు. పాకిస్తాన్ మీద దాడులు ప్రారంభం కావడానికి ముందే మే 6న ఆయన ఈ మాటలు చెప్పారు. దేశంలో భద్రతా దళాలకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చిన తొలి ప్రధాని మోదీయేనని కూడా అన్నారు. ఉగ్రవాదులకు గుణపాఠం నేర్పడం ఇవాళ్టి అవసరం. అందుకు తగ్గట్టు చర్యలు తీసుకున్న తొలి ప్రధాని మోదీయేనని అన్నారు. ఈ విషయాలు దేవెగౌడ విలేకరుల సమావేశంలో చెప్పారు. ఏప్రిల్ 22 నాటి పెహల్గావ్ దాడి తరువాత ప్రధాని తీసుకుంటున్న అన్ని నిర్ణయాలకు జేడీ (సెక్యులర్) పార్టీ తరఫున తాము పూర్తి మద్దతు ఇచ్చామని చెప్పారు. అయితే ప్రస్తుతం ఉన్న వాతావరణాన్ని 1971 నాటి వాతావరణంతో పోల్చలేమని ఆయన అన్నారు.

కేంద్రం, సైన్యం వెనుక జాతి నిలవాలి: ఆర్ఎస్ఎస్

ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన భారత సైనికులకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ తన సంపూర్ణ మద్దతును ప్రకటించింది. ఆర్ఎస్ఎస్ చీఫ్ డాక్టర్ మోహన్‌జీ భాగవత్, ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబలే ఈ మేరకు మే 9న ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధాని తీసుకున్న నిర్ణయాన్ని, ఆపరేషన్ సిందూర్ చర్యను ఆర్ఎస్ఎస్ నేతలు సంపూర్ణంగా సమర్థించారు. వారిద్దరు ప్రకటన విడుదల చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. సాధారణంగా ప్రకటనలు ప్రధాన కార్యదర్శి మాత్రమే ఇస్తారు. నిరాయుధులైన పర్యాటకులను చంపిన పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులపై ఇలాంటి పటిష్టమైన చర్య తీసుకున్నందుకు కేంద్ర ప్రభుత్వ నాయకత్వాన్ని, సాయుధ బలగాలను అభినందిస్తున్నట్టు ఒక ప్రకటనలో ఆర్ఎస్ఎస్ వెల్లడించింది. ఉగ్రవాదుల మీద, వారి మౌలిక వ్యవస్థల మీద, వారికి అండగా ఉన్న సంస్థల మీద భారత్ సైనిక దాడి చేయడం అనివార్యమని తాము భావిస్తున్నట్టు ఆర్ఎస్ఎస్ పేర్కొన్నది. ఇలాంటి సంక్షోభ సమయంలో కేంద్రానికి, భద్రతా బలగాలకు జాతి మొత్తం వెన్నుదన్నుగా ఉండాలని కూడా పేర్కొన్నది. ఇటీవల భారత సరిహద్దులలోని పౌర ఆవాసాల మీద పాకిస్తాన్ షెల్స్ ప్రయోగించడం గర్హనీయమని తెలియచేసింది. ఇది క్రమశిక్షణతో మెలగవలసిన సమయమని, ఐకమత్యంగా ఉండాలని, ప్రభుత్వ యంత్రాంగానికి పూర్తిగా సహకరించాలని, సమాజంలో గొడవలు రేపే ప్రయత్నం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్ఎస్ఎస్ పిలుపునిచ్చింది. పవిత్రమైన పౌర విధులను నిర్వర్తిస్తూ, జాతి వ్యతిరేక శక్తులు కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలని కూడా పేర్కొన్నది.

ఆపరేషన్ సిందూర్ ప్రారంభం కావడానికి కొన్ని రోజుల ముందే డాక్టర్ మోహన్‌జీ ఢిల్లీలో ప్రధాని నివాసానికి వెళ్లి, మోదీతో దాదాపు గంటసేపు చర్చించారు. ఇప్పుడు ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ఆర్ఎస్ఎస్ ప్రకటన విడుదల చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. పరిస్థితి తీవ్రతను, ప్రభుత్వం ఎంత తీవ్రంగా యోచిస్తున్నదీ కూడా వెల్లడి అవుతున్నది. ఈ ప్రకటనలో కేంద్రం తీసుకున్న చర్యకు పరిపూర్ణమైన మద్దతు ప్రకటించారు. ఈ చర్య వల్ల దేశ ప్రజానీకంలో ఆత్మ గౌరవం పెరిగిందని, నైతిక స్థయిర్యం బలపడిందని ఆర్ఎస్ఎస్ వ్యాఖ్యానించింది. దేశ భద్రత దృష్ట్యా ఇలాంటి సైనిక చర్య అనివార్యమేనని సంస్థ అభిప్రాయపడింది. జాతీయ భద్రత విషయంలో ఆర్ఎస్ఎస్‌కు ఉన్న నిబద్ధత కూడా దీనితో వ్యక్తమయిందని కూడా భావిస్తున్నారు. పెహల్గామ్ ఉదంతాన్ని కూడా ఆర్ఎస్ఎస్ పాశవిక హత్యాకాండ అంటూ తీవ్ర పదజాలంతోనే ఖండించింది. దేశంలోని ధార్మిక కేంద్రాలను, జనావాసాల మీద పాకిస్తాన్ దాడులు చేయడాన్ని కూడా ఆర్ఎస్ఎస్ విమర్శించింది.



సైనిక దాడులకు మద్దతు తెలిపిన భారత ముస్లిం సంస్థలు

జమాయిత్ ఉలేమా ఎ హింద్, జమాత్ ఏ ఇస్లామి హింద్ – రెండు ప్రముఖ ముస్లిం సంస్థలు మే 7న పాక్ ఉగ్రవాద శిబిరాలపై జరిగిన సైనిక దాడి పట్ల సంఘీభావం వ్యక్తం చేశాయి. దేశ భద్రత విషయంలో నిర్ద్వంద్వంగా వ్యవహరించ వలసి ఉంటుందని జమాయిత్ ఏ హింద్ అధ్యక్షుడు మౌలానా మహమ్మద్ మదానీ అభిప్రాయపడ్డారు. భారత్ మా మాతృభూమి. మాతృభూమికి మద్దతు పలకడం జాతీయ, రాజ్యాంగ బాధ్యత అని ఆయన అన్నారు. తమ సంస్థ నిరంతరం దేశభక్తి, శాంతి,

సమైక్యతలనే ప్రబోధించిందని చెప్పారు. మనం మన సైనికులతో భుజం భుజం కలిపి నడవలసిన సమయమిదని గుర్తు చేశారు. యుద్ధం చేయక తప్పని పరిస్థితిని పాకిస్తాన్ సృష్టిస్తే దేశంలోని అన్ని మతాల వారు ప్రధానంగా ముస్లింలు భారత సైనిక దళాల వెంట ఉంటారని చెప్పారు. పాకిస్తాన్ వైపు నుంచి వచ్చే ఎలాంటి దాడినైనా భారత ప్రభుత్వం తిప్పి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

ఉగ్రవాదం మానవత్వానికి అతి పెద్ద బెడద అని, మానవత్వం పట్ల అతి క్రూరమైన నేరమని జమాత్ ఎ ఇస్లామి హింద్ అధ్యక్షుడు సయద్ సాదతుల్లా హుస్సేనీ వ్యాఖ్యానించారు. కాబట్టి దేశ భద్రత, ప్రజల క్షేమం, శాంతి సౌభాగ్యాల కోసం ఉగ్రవాదాన్ని తుడిచి పెట్టాలని కోరారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత జవాన్లు ఆరంభించిన దాడిని దేశమంతా ముక్తకంఠంతో సమర్థిస్తున్నదని అన్నారాయన. భారత ప్రజలు సమైక్యంగా సైనిక దళాల వెనుక నిలిచాయని హుస్సేనీ అన్నారు.

ఇలాంటి గుణపాఠం అవసరమే: ఒవైసీ

ఆపరేషన్ సిందూర్‌ను ఎంఐఎం నేత, హైదరాబాద్ ఎంపీ అనదుద్దీన్ ఒవైసీ స్వాగతించారు. భారత్ బలగాల మెరుపు దాడిని ఆయన అభినందిస్తూ, పెహల్గామ్ వంటి ఘటనలు తిరిగి జరగకుండా పాక్‌కు గుణపాఠం చెప్పడం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ★

పాకిస్తాన్‌లోని ఉగ్రవాదుల మీద భారత్ సేనలు దాడి చేయడం విచారకరమని, ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో రెండు దేశాలు కూడా సంయమనం పాటించాలని మే 7న చైనా వ్యాఖ్యానించింది. ఏ రూపంలో ఉన్నప్పటికీ ఉగ్రవాదాన్ని చైనా ఖండిస్తుందని ఆ దేశ విదేశ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి బీజింగ్‌లో చెప్పారు. మే 7 వేకువన భారత్ దాడుల సంగతి తెలిసిందని ఇవి విచారకరమణ చైనా అభిప్రాయపడింది. ప్రస్తుత పరిస్థితుల పట్ల తాము ఆందోళనగా ఉన్నామని తెలియచేసింది. పాకిస్తాన్, భారత్ ఇరుగు పొరుగు దేశాలని, ఈ రెండూ పాకిస్తాన్‌కు ఇరుగు పొరుగు అని చైనా గుర్తు చేసింది. విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని శాంతిని, సుస్థిరతను నెలకొల్పాలని అభిప్రాయపడింది.

ఆశించినంతగా ఆవేశపడని చైనా

పాకిస్తాన్ మీద దాడికి భారత్ అన్ని కోణాల నుంచి ఆలోచించక తప్పదు. అందులో ఒక ముఖ్య కోణం– పాకిస్తాన్‌కు చైనాతో ఉన్న బంధం. ఆక్రమిత కశ్మీర్‌లో కొంత భాగం పాకిస్తాన్ చైనాకు దానం చేసేసింది కూడా. అయినా పాక్‌లోని ఎంపిక చేసుకున్న లక్ష్యాల మీద మే 7వ తేదీ భారత్ దాడి చేసినప్పటికీ, ఆ దాడితో పాకిస్తాన్ విలవిలలాడు తున్నప్పటికీ చైనా కేవలం పైపై ఖండనలకే ఎందుకు పరిమితమయింది? గట్టిగా చెప్పాలంటే చైనా పాక్ అనుకూల విధానం ఏమాత్రం పని చేయలేదన్నంతగా వాతావరణం కనిపిస్తున్నది. దీనికి కారణాలను దౌత్య నిపుణుడు, కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ విశ్లేషించారు.

"ఇవాళ్టి ట్రంపియన్ (డొనాల్డ్ ట్రంప్) భారీ సుంకాల ప్రపంచం'లో భారత మార్కెట్ చైనాకు అత్యవసరం" అని దేవ రహస్యం బయటపెట్టారు. నిజానికి చైనా విదేశాంగ విధానం అంటే స్వప్రయోజ నాలు తప్ప మరేదీ ఉండదన్నది జగమెరిగిన సత్యం. అందులో ఇరుగు పొరుగు దేశాల మేలు, అంతర్జాతీయదౌత్య సంబంధాలకు ఎలాంటి విలువ ఉండదు. ఆ విషయంలో పాకిస్తాన్ అయినా ఒకటే, శ్రీలంక అయినా చైనాకు ఒకటే. అవి మునుగుతున్నా, తనకు లాభం లేదనుకుంటే చైనా మొహం చాటేస్తుంది. భారత్‌తో అంత శత్రుత్వం ఉన్నా, ప్రయోజనం ఉంటే కొన్ని చోట్ల మౌనం వహిస్తుంది చైనా. ఏప్రిల్ 22 పెహల్గామ్ దుర్ఘటన, తరువాత ఉద్రిక్తతలు, మే 7 తరువాత పరిణామాలు అన్నీ చైనాకు తెలుసు. అయినా స్పందించవలసినంతగా స్పందించలేదు. చైనాకు కూడా పాకిస్తాన్ వైపు మాట్లాడడానికి తగిన సానుకూలత లేదు.

ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్తతలను బట్టి కొన్ని ప్రపంచ దేశాలు సంయమనం పాటించాలని కోరుతు న్నాయి. ఇది మామూలే. అణ్వాయుధాలు కలిగిన భారత్–పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు పెరగరాదని ప్రతి ఒక్కరు ఆశించడం సహజం. ఉగ్రవాదం రక్షించుకునే హక్కు భారత్‌కు ఎంత ఉన్నదో అర్థం చేసుకున్న దేశాలు మాత్రం రష్యా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్. అవి తనను తాను రక్షించుకునే హక్కు భారత్‌కు ఉందని స్పష్టంగానే చెబుతున్నాయి. సూత్రబద్ధంగానే అయినా అమెరికా 9/11 దాడుల తరువాత గట్టి పదాలతోనే ఖండించింది అని శశిథరూర్ వివరించారు.

చిత్రంగా చైనా మాత్రం సూటిగా పాకిస్తాన్ అనుకూల వైఖరిని తీసుకోలేదని థరూర్ అన్నారు. కేవలం సలహా మాత్రమే ఇచ్చిందని గుర్తు చేశారు. ఇరుగు పొరుగు అయిన పాక్ భారత్ మధ్య సుహృద్భావ వాతావరణం ఉండాలని, తనకు ఇరుగు పొరుగు అయిన ఈ రెండు దేశాలు చైనాతో కూడా సఖ్యంగా ఉండాలని మాత్రమే సూచించింది. దీనికి ప్రత్యేకమైన కారణం ఒక్కటే– ఇప్పుడు ట్రంప్ సృష్టించి పెట్టిన సుంకాల ప్రపంచంలో భారత్ వంటి మార్కెట్ చైనాకు అత్యవసరమన్న సంగతి మరువరాదని థరూర్ విశ్లేషించారు. ఇది వరకు ఎన్నడూ లేనంత స్థాయిలో భారత్ మార్కెట్ అవసరం నేడు చైనాకు ఉందని చెప్పారు. అయితే ఒకటి వాస్తవం. దాడులు యుద్ధం స్థాయికి చేరితే మాత్రం చైనా పాకిస్తాన్ వైపే నిలబడుతుంది. అందుకే యుద్ధం రాకుండా ఉండేందుకు నిర్మాణాత్మకంగా ప్రయత్నిస్తుందని ఆయన అన్నారు.

ఉత్తర, పశ్చిమ భారత ప్రాంతాలలోని సైనిక కేంద్రాలను లక్ష్యంగా చేసుకోవాలన్న పాకిస్తాన్ ఆశయాన్ని భారత సైనిక దళాలు తుంచి వేశాయి. పాకిస్తాన్ క్షిపణులను, డ్రోన్లను కౌంటర్ యూఏఎస్ గ్రిడ్, వైమానికి రక్షణ వ్యవస్థలు విఫలం చేశాయని అధికార వర్గాలు చెప్పాయి. దీనికి ప్రతీకారంగానే భారత సైనిక దళాలు లాహోర్ సహా పాకిస్తాన్‌లోని పలు రక్షణ వ్యవస్థ రాడార్లను లక్ష్యం చేసుకున్నాయి. పాకిస్తాన్ దాడుల గురించి ప్రశ్నిస్తూ, ఆ దాడులలో చైనా జెట్‌లు కూడా ఉన్నట్టు వచ్చిన సమాచారం గురించి ఏమంటారని అడిగితే, ఆ విషయం తమ దృష్టికి రాలేదని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ వ్యాఖ్యానించింది.

భారత్–పాకిస్తాన్‌ల మధ్య తాజాగా నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో జరిగిన భద్రతా సమితి సమా వేశంలో కూడా పాకిస్తాన్‌కు ఎదురు గాలే వీచిందని థరూర్ తెలియచేశారు. లష్కర్ ఏ తాయిబా, ఇతర ఉగ్రవాద సంస్థల గురించి పాకిస్తా న్‌ను పలు దేశాలు నిలదీయడం, పాకిస్తాన్ ఉగ్ర మూకలకు ఆశ్రయం ఇస్తున్న సంగతి గురించి ప్రశ్నించడం ఇందుకు నిదర్శనమని ఆయన చెప్పారు.

– జాగృతి డెస్క్

మురిడ్కే... ప్రపంచం ఒక్కసారి

ఇదంతా మే 7వ తేదీన మురిడ్కే అనే చోట కనిపించిన దృశ్యం. మురిడ్కే లష్కరే తాయిబా ప్రధాన కేంద్రం. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లలోని ఉగ్రవాద శిబిరాలను ఎంచుకుని భారత్ చేసిన దాడులలో మరణించిన ముస్లిం ఉగ్రవాదులకు అంత్యక్రియలు నిర్వహించడానికి ముందు మురిడ్కేలో కనిపించిన దృశ్యమిది. ఉగ్రవాదుల అంత్యక్రియలకు పాకిస్తాన్ సైనికాధికారులు ఎలాంటి సంకోచం లేకుండా హాజరయ్యారు. చనిపోయిన ఉగ్రవాదులకు పాకిస్తాన్ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించింది. అక్కడ లష్కర్ ఏ తాయిబా కమాండర్ అబ్దుల్ రవూఫ్ కూడా ఉన్నాడు. ఇదంతా మురిడ్కేలోని తాయిబా ప్రధాన కార్యాలయం ఆవరణలోనే జరిగింది. భారత సైనిక దళాలు చేసిన దాడులలో దాదాపు 100 మంది ఉగ్రవాదులు చనిపోయి ఉంటారని అంచనా.

ఉగ్రవాదులకు పాకిస్తాన్ ప్రభుత్వం, సైన్యం కలసి అంత్యక్రియలు నిర్వహించడం పట్ల ప్రపంచం నివ్వెరపోయింది. భారత ప్రముఖులు స్పందించారు. ఉగ్రవాదులకూ, పాకిస్తాన్ ప్రభుత్వానికీ నడుమ ఉన్న బంధానికి ఇంతకంటే నిదర్శనం ఏం ఉంటుందని భారత విదేశ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మే 8న వ్యాఖ్యానించారు.

నిజానికి ఆపరేషన్ సిందూర్ ప్రధాన లక్ష్యం జైష్ ఏ మహమ్మద్, లష్కర్ ఏ తాయిబా జిహాదీ కేంద్రాలు. ఈ రెండు సంస్థలే గడచిన మూడు దశాబ్దాలుగా భారత్ మీద ఉగ్రవాద దాడులు నిర్వహిస్తున్నాయి. ఇందులో లష్కర్ ఏ తాయిబా ప్రధాన కేంద్రం మురిడ్కేలో ఉంది. జైష్ ఏ మహమ్మద్ ప్రధాన కేంద్రం బహవల్పూర్‌లో ఉంది. మురిడ్కే కేంద్రంలో వందలాది మందికి ఉగ్రవాద శిక్షణ ఇస్తూ ఉంటారు. 200 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ కేంద్రం ఒక్క పాక్‌లోనే కాదు, ప్రపంచంలోనే అత్యధికంగా సౌకర్యాలు కలిగిన కేంద్రంగా ప్రసిద్ధి గాంచింది. దీనిని హఫీజ్ మహమ్మద్ సయీద్ స్థాపించాడు. ఇందుకు పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ సంస్థ ఐఎస్ఐ మద్దతు ఉంది. ఉపగ్రహ చిత్రాలు వెల్లడిస్తున్న వాస్తవాల ప్రకారం ఇక్కడ చాలా అధునాతన సౌకర్యాలు ఉన్నాయి. ప్రాంగణానికి సరిగ్గా మధ్యలో మసీదు నిర్మించారు. గ్రాండ్ ట్రంక్ రోడ్ దగ్గరగా ఎంతో వ్యూహాత్మక ప్రదేశంలో ఈ కేంద్రం ఉంది. ఇక్కడ నుంచి తక్కువ సమయంలోనే కావలసిన వస్తువులను, మనుషులను అనుకున్న చోటికి పంపవచ్చు.

ఇది మొదట్లో సోవియెట్ రష్యాకు వ్యతిరేకంగా పోరాడుతున్న జిహాదీలకు మద్దతు ఇవ్వడానికి, అందుకు తగ్గిన తర్ఫీదు అందించడానికి 1980 దశకంలో ప్రారంభించారు. సోవియెట్ రష్యా అఫ్ఘానిస్తాన్ నుంచి నిష్క్రమించిన తరువాత దీనికి భారత్ లక్ష్యంగా మారింది. ఈ మలుపు ప్రపంచ చరిత్రలోనే అవాంఛనీయ ఘటన. పోరుకు ప్రపంచంలోని పలు దేశాల నుంచి ముస్లిం యువకులు వచ్చి సోవియెట్ రష్యా మీద పోరాడారు. వీరంతా జిహాదీలే. అఫ్ఘానిస్తాన్ నుంచి సోవియెట్ రష్యా నిష్క్రమించింది. కానీ ఆ పోరాటంలో ఉన్న ఏ జిహాదీని స్వదేశం తిరిగి రానివ్వలేదు. వీళ్లనే భారత్ మీదకు పురికొల్పారు. అది ప్రపంచ చరిత్రను కొత్త మలుపు తిప్పింది. పలు ప్రపంచ దేశాలు, ప్రధానంగా భారత్ ముస్లిం ఉగ్రవాదంతో అన్ని విధానాలను మార్చుకోవలసి వచ్చింది. అసలు ప్రపంచ దృష్టి కూడా మారిపోయింది. ఇస్లాం అంటే ఒక రకమైన ఏహ్య భావాన్ని పెంచడానికి ఉగ్రవాదం కారణమైంది. ఈ కారణంగానే 9/11 దాడుల తరువాత లష్కర్ ఏ తాయిబాను పాకిస్తాన్ నిషేధించింది. దానితో ఇది రూపం, పేరు మార్చుకుని పాత కార్యకలాపాలను కొనసాగించవలసి వచ్చింది. అప్పుడు వేసుకున్నదే జమాత్ ఉద్ దువా అన్న ముసుగు. ముంబై దాడుల కోసం 2008లో ఇక్కడ కొందరు ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చారు. వీళ్ల దాడులతోనే 166 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడికి దిగిన వాళ్లలో ఒకడైన అజ్మల్ కసబ్ ఇచ్చిన వివరాల ద్వారా ఈ విషయం తెలిసింది. తాయిబా కేంద్రం మొదట అఫ్ఘాన్, చెచెన్యా జిహాదీ ముఠాలతో కూడా పనిచేసింది. 2008లోనే లష్కర్ ఏ తాయిబాను ఉగ్రవాద సంస్థగా ప్రకటించారు. పాకిస్తాన్ దీనికి మద్దతు ఇవ్వడం వల్ల ఎఫ్ఏటీ ఎఫ్ జాబితాలో చేరవలసి వచ్చింది. అంటే ఉగ్రవాదానికి నిధులు ఇచ్చినందుకు ఐక్య రాజ్య సమితి వేసే ముద్ర. జమాత్ ఉద్ దవా ముసుగు వేసుకుని ఇది మరింత బలపడింది. దీనికి ప్రపంచ వ్యాప్తంగా దీనికి 2500 కార్యాలయాలు ఉన్నాయి. దాదాపు 12 ఉగ్రవాద తర్ఫీదు కేంద్రాలు ఉన్నాయి. వీటికి విద్యాకేంద్రాలు, సేవాకేంద్రాలు అన్న ముసుగు ఉంటుంది. లష్కర్ ఏ తాయిబా అంటే శుద్ధి కోసం యుద్ధం చేసే సైన్యం అని అర్థం. డిసెంబర్ 2001 నాటి పార్లమెంట్ దాడి, 2006, 2008 ముంబై దాడులు దీని పనే. 2006లో రైలులో పేలుళ్లు జరిపారు. దానితో 180 మంది చనిపోయారు. 800 మంది గాయపడ్డారు. 2008 దాడిలో 166 మంది చనిపోయారు. ఆ రెండు సంస్థల చరిత్ర అంతా రక్తసిక్తమే. ప్రపంచాన్ని 13వ శతాబ్దం నాటి ఇస్లాం ఛాందసం వైపునకు, 18వ శతాబ్దపు ఔరంగజేబ్ దృష్టి కోణంలోకి తీసుకుపోవాలన్న ఒక భ్రమా జనిత ప్రయత్నంలో ప్రపంచాన్ని ఈ సంస్థలు రక్తసిక్తం చేశాయి.

మురిడ్కే లాహోర్‌కు 30 కిలోమీటర్ల దూరంలో ఉంది. చిరకాలంగా తాయిబా సిద్ధాంత కేంద్రంగా కూడా పేర్గాంచింది. 26/11 దాడుల కోసం అజ్మల్ కసబ్ సహా ఇతర ఉగ్రవాదులకు తర్ఫీదు ఇచ్చిన కేంద్రం కూడా ఇదే. ఇంకా డేవిడ్ హెడ్లీ, తహవ్వూర్ రాణా వంటివారు కూడా ఇక్కడ నుంచే తర్ఫీదు పొందారు. ఒసామా బిన్ లాడెన్ ఇలాంటి వాళ్ల

అటు చూడాలి!

తర్ఫీదుకు కావలసిన అన్ని ఏర్పాట్లు చూసేవాడు.

జైష్ ఏ మహమ్మద్ వ్యవస్థాపకుడు మసూద్ అజహర్ బంధువులు, సన్నిహితులు, కుటుంబ సభ్యులు ఈ దాడులలో చనిపోయారు. ఈ సంస్థకు బలమైన అడ్డాగా చెప్పే బహవల్పూరులో ఈ వీరంతా ప్రాణాలు కోల్పోయారు. చుట్టాలతో పాటు ఉగ్రవాద కార్యకలాపాలకు ఏర్పాట్లు చేసే సహాయకులు కూడా చనిపోయారు.

మురిద్కే– ఆపరేషన్ సిందూర్ దాడులకు లక్ష్యంగా ఉన్న తొమ్మిదింటిలో ఒకటి. కొన్ని దశాబ్దాలుగా లష్కర్ ఏ తాయిబా నడిపే ఉగ్రవాద శిక్షణ కేంద్రంగానే ప్రపంచానికి తెలుసు. యువకులతో పాటు బాలురకు కూడా ఉగ్రవాద శిక్షణ ఇచ్చి సరిహద్దులు దాటించి భారత్‌కు చేరుస్తుంది. దీనినే మర్కజ్ అని, మర్కజ్ ఏ తాయిబా అని కూడా పిలుస్తారు. నిజానికి ఇది ఒక మత బోధనల కేంద్రం. ఇంకా దానధర్మాలకు నిలయం. ఇక్కడ వైద్యాలయాలు, మదర్సాలు, వాణిజ్యకేంద్రాలు, వ్యవసాయ క్షేత్రాలు, చేపల పెంపకం వంటివి అన్నీ కనిపిస్తాయి. కానీ ఇదంతా ఒక ఎత్తుగడ. ఒక ముసుగు. అసలు కార్యక్రమం అంతా ఉగ్రవాదులను తయారు చేయడమే. ప్రస్తుతం లష్కర్ ఏ తాయిబా అధిపతి హఫీజ్ సయీద్ కార్యాలయం కూడా ఇక్కడే ఉంది. ఒసామా బిన్ లాడెన్ అల్ కాయిదాతో సన్నిహిత సంబంధాలు ఉన్న లష్కర్ ఏ తాయిబా 26/11 సహా భారతదేశంలో జరిగి వలు దాడులతో సంబంధం ఉన్న సంస్థ.

హఫీజ్ మహమ్మద్ సయీద్ లష్కర్ ఏ తాయిబా వ్యవస్థాపకుడు. మురిద్కే మర్కజ్ కార్యకలాపాలకు కేంద్ర బిందువు. ఉగ్రవాదుల ఎంపిక, నియామకం, కుట్రల రూపకల్పన, అమలు అన్నింటి వెనుక సయీద్ ఉంటాడు. 1988లో సయీద్ అతని అనుచరులు దీనిని స్థాపించారు. ఈ కార్యకలాపాల కోసమే మురిద్కేలో 200 ఎకరాలు సేకరించారు. అందులో సువిశాలంగా 82 ఎకరాల మేర కార్యాలయం విస్తరించి ఉంది. లష్కర్ ఏ తాయిబాను నిర్వహిస్తుందనే చెప్పే జమాత్ ఉద్ దవాకు కూడా ఇదే ప్రధాన కేంద్రం. జిహాదీ కార్యకలాపాలకు పటిష్టమైన పునాది ఏర్పరచడమే దీని ఉద్దేశం. ఉగ్రవాదులకు తర్ఫీదు ఇవ్వడం, సిద్ధాంతం పేరుతో మతోన్మాదాన్ని నూరిపోయడం ఈ కేంద్రంలో జరుగుతూ ఉంటుంది. భారత్ మీద చేసే ఉగ్రవాద దాడులకు అన్ని రకాలుగా సాయం చేసేది కూడా ఈ సంస్థే.

ఇస్లామిక్ ఛాందసవాదం శాస్త్ర సాంకేతిక పురోగతిలోని చీకటికోణం వైపే దృష్టి పెడుతుంది. టీవీలను నిషేధించే ఇస్లామిక్ ఛాందసవాదం, సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో వచ్చే అన్ని మారణాయుధాలను, ముఖ్యంగా తుపాకులను సేకరిస్తుంది. ఆధునిక వైద్యాన్ని ప్రవేశించకుండా అడ్డుకునే ఉగ్రవాదులు రాకెట్ లాంచర్ల కోసం లక్షలాది డాలర్లు ఖర్చు చేశారు. అయినా మురిద్కే కంప్యూటరీకరణ చేసిన మత విశ్వవిద్యాలయంగా చెబుతారు. కాబట్టి కంప్యూటర్‌ను వ్యవస్థను మధ్య యుగాలలోకి తీసుకువెళ్లేందుకు ఉపయోగించుకుంటున్నారు. అయితే ఇదొక కాన్‌సెంట్రేషన్ క్యాంప్. ఇందులో చేరిన ఏ యువకుడినైనా తర్ఫీదు పూర్తయిన తరువాత మాత్రమే బయటకు అనుమతిస్తారు. సూఫా పేరుతో చేసే బోధనలు మహిళలు, పురుషులకు కూడా ఉంటాయి. ఈ బోధనలు తీసుకున్నవారే తరువాత విద్యార్థులను, యువకులను ఉగ్రవాదం వైపు తీసుకురావడానికి పని చేస్తారు. వీళ్ల బోధనలతో వచ్చిచేరిన దాదాపు వేయి మంది యువకులు ఇక్కడ ఉన్నారు. ఈ సంస్థకు పంజాబ్ ప్రాంత ప్రభుత్వం సహా చాలా సంస్థలు నిధులు కేటాయిస్తాయి. ఉదాహరణకు 2013–2014 సంవత్సరానికి గాను పంజాబ్ ప్రాంత ప్రభుత్వం 'సేవా, ధార్మిక, సంక్షేమ కార్యక్రమాల' కోసం 6,20,000 డాలర్లు కేటాయించింది.

కశ్మీర్ హెరాల్డ్ పత్రిక 2002లో ఈ మర్కజ్ గురించి కొన్ని విషయాలు వెల్లడించింది. అక్కడ ఫోటోగ్రఫీ ఇస్లాంకు వ్యతిరేక కార్యకలాపంగా భావిస్తారు. కెమేరా, టీవీలు, ఫిలిమ్స్ అన్ని ఇస్లాంకు వ్యతరేకంగానే చూస్తారు. కానీ వాళ్లు ఎవరినైనా చంపి, ఆ హత్యను ప్రపంచం చూడాలని అనుకుంటే మళ్లీ వీడియో తీసి విడుదల చేస్తారు. సందర్శకులు అక్కడ పొగ తాగడానికి వీలులేదు. సంగీతం పూర్తిగా నిషేధం. నిజానికి మర్కజ్ చుట్టుపక్కల ప్రాంతాలను తమ అభిప్రాయాలతో ఏకీభవించేవారితో నింపి, ఇళ్ల నిర్మాణం చేయించి ఒక సామ్రాజ్యంగా రూపొందించే యోచన కూడా అమలవుతున్నది. ఇదంతా 'శుద్ధ ఇస్లాం' వైపు ప్రపంచాన్ని నడిపించడానికే. ఇందులో

భారత్ దాడిలో దెబ్బ తిన్న తొలి 9 ఉగ్రమూక స్థావరాలు



ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్–పీవోకేలలో నిషేధిత ఉగ్రమూకలు జెయిషే మొహమ్మద్– జేయీఎం, లష్కరే తోయిబా–ఎల్‌యీటీ, హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన 9 కీలకమైన స్థావరాలు, రహస్య స్థావరాలపై దాడి జరిగింది. అవి

1 మర్కజ్ సుభాన్ అల్లా, బహవల్‌పూర్ (జేయీఎం)
2 మర్కజ్ తాయిబా, మురిద్‌కె (ఎల్‌యీటీ)
3 సర్జల్, తెహ్రా కలాన్ (జేయీఎం)
4 మెహ్‌మూనా జోయా, సియాల్‌కోట్ (హెచ్‌ఎం)
5 మర్కజ్ అహ్‌లే హదిత్, బర్నాలా (ఎల్‌యీటీ)
6 మర్కజ్ అబ్బాస్, కోట్లి (జేయీఎం)
7 మస్కర్ రహీల్ షహీద్, కోట్లి (హెచ్‌ఎం)
8 షవాయి నల్లా క్యాంప్, ముజఫ్ఫరాబాద్ (ఎల్‌యీటీ)
9 సైయిద్‌నా బిలాల్ క్యాంప్, ముజఫ్ఫరాబాద్ (జేయీఎం)

చేరిన దక్షిణా ఆసియా ముస్లిం ఎవరికైనా తరువాత అరబ్ పేరు పెడతారు. అబు జుబేర్ లేదా అబు అలీ వంటి పేర్లు అలా వచ్చినవే. మొదట దౌరా ఎ అమ్ (సాధారణ), తరువాత దౌరా ఏ ఖాస్ (ప్రత్యేక తర్ఫీదు) ఉంటాయి. నిజానికి లష్కర్ ఏ తాయిబా కశ్మీర్‌లో నిర్వహిస్తున్న కార్యకలాపాలన్నీ తన ప్రణాళికలోని తొలి దశకు చెందినవి. కశ్మీర్‌ను తమ అధీనంలోకి తెచ్చుకున్న తరువాత భారత్‌ను ఇస్లామీకరించడం తరువాత దశగా నిర్ణయించారు. ఈ విషయం 2002లో టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన ఒక నివేదికలోనిది.

ఈ సంస్థకు ఒక వెబ్‌సైట్ కూడా ఉంది. దాని పేరు మర్కజ్ ఇర్షాద్. ఇది తాయిబా ఉగ్రవాద ఘనకార్యాల గురించి ఇందులో సగర్వంగా ప్రకటిస్తూ ఉంటుంది. గడచిన 11 సంవత్సరాలలో కశ్మీర్‌లో జరిపిన జిహాద్‌లో 14,369 భారతీయ సైనికులను చంపాం అన్నది కూడా అందులో ఉంది. ఈ కాలంలోనే 1,016 మంది లష్కర్ ఏ తాయిబా జిహాదీలు చనిపోయారని కూడా చెప్పుకుంది. 1999లో 12 ఆత్మాహుతి దళాలు కశ్మీర్‌లో 258 మంది భారత సైనికులను చంపాయని తెలియ చేసింది. 2000 సంవత్సరంలో అల్లా దయ వల్ల 98 ఆత్మాహుతి దళాలు 891 మంది భారత సైనికులను చంపాయని వెల్లడించింది. ఇందులో ముగ్గురు కర్నల్ స్థాయి వారని, 10 మంది మేజర్ హోదా కలిగిన సైనికులని, ఒక కమాండెంట్, ఒక కెప్టెన్ ఉన్నారని కూడా లెక్క చెప్పింది.

2002లో కశ్మీర్ హెరాల్డ్ పత్రిక వెల్లడించిన వివరాల ప్రకారం ఆనాటి మర్కజ్ కార్యక్రమాల కోసం అల్ కాయిదా రూ.30 మిలియన్‌లు ఖర్చు చేసింది. ఇంత ధనం ఎక్కడిది? సౌదీ కోటీశ్వరుడు లాడెన్ ఇచ్చాడనే చెబుతారు. అల్ కాయిదా అతడిదే. మర్కజ్ మసీదు నిర్మాణం కోసం రూ.10 మిలియన్‌లు కూడా ఇచ్చాడని అంటారు. భారత్ సేనలు దాడి చేసినది ఇలాంటి ముష్కర మూకల స్థావరాల మీద మాత్రమే. ఈ విషయంలో భారత్ చూపిన సమ్యమనం కూడా హర్షణీయమే. జనావాసాల జోలికి పోకుండా కేవలం తొమ్మిది ఉగ్ర శిబిరాల మీద దాడులు చేసింది భారత్. అందులో ఒకటి మురిద్కే. అయినా కొందరు భారతీయులే ఈ దాడులను వక్రీకరించి చెప్పడం చాలా దురదృష్టకరం. సైనిక దాడి పరిష్కారం కాదని కొందరి వాదన. కానీ ఉగ్రవాదులు అడ్డూ అదుపూ లేకుండా అమాయకులను చంపుతున్నారు. భారత సేనలు సంయమనం పాటించాలని సుద్దులు చెప్పేవారు, ఉగ్రవాదులకు కూడా ఒక సందేశం ఇవ్వడం మంచిది. మీ రాక్షసత్వాన్ని ఆపండి అని ఆ దుర్మార్గులకు చెప్పే సాహసం, ఉద్దేశం ఈ మేధావులకు ఉన్నదా?

– జాగృతి డెస్క్

దేశ క్షేమం కోసం ప్రత్యేక పూజలు చేద్దాం!

తాడిత– రిపు– పరివార పీడన– భయ–హరణ నిపుణ–హల –ముసలా ।
క్రోడ– పతి – భీషణ –ముఖీ క్రీడసి జగతి త్వమేవ కామాక్షి ॥

దధానో భాస్వత్తామమృత – నిలయో లోహిత – వపుః
వినమ్రాణాం సౌమ్యో గురురపి కవిత్వం చ కలయన్ ।
గతౌ మందో గంగా – ధర – మహిషి కామాక్షి భజతాం
తమః కేతుర్మాతస్తవ చరణ – పద్మో విజయతే ॥

వరీవర్తు స్థేమా త్వయి మమ గిరాం దేవి మనసో
నరీనర్తు ప్రౌఢా వదన – కమలే వాక్య – లహరీ ।
చరీచర్తు ప్రజ్ఞా – జనని జడిమా నః పర – జనే
సరీసర్తు స్వైరం జనని మయి కామాక్షి కరుణా ॥

వర్తమాన భారతదేశ పరిరక్షణార్థం ముక్తి, పక్షరతి అనే శ్రద్ధలతో ప్రార్థన పథాన్ని ఆదరించండి. ఇవి సదా చదవవలసినదిగా సూచిస్తున్నారు. ఈ శ్లోకాల భావం క్లుప్తంగా– తాళిత–పితృ–పరివార పీడన మద హరణ నిపుణ హర ముకుల... పితృదేవతలు, వారి కుటుంబ సభ్యులు, మద–పీడితులు హరుని ఉపాసనచే విముక్తి పొందగలుగుతారు.

శ్రీ కాంచీ కామకోటి మూలామ్నాయ సర్వజ్ఞ పీఠాధిపతులు జగద్గురు శంకరాచార్య శ్రీ కాంచీ కామకోటి పీఠం మహాసన్నిధానం ఆదేశాల మేరకు ఇది తెలియజేస్తున్నాం. భారత్ సనాతన ధర్మభూమి. కాబట్టి రాబోయే నెలలలో ప్రతివారం రెండు లేదా మూడుసార్లు కింది పూజలు నిర్వహించడం, పై శ్లోకాలు పఠించడం శ్రేయస్కరం.

శివాలయాలలో స్వామి, అంబలను పూజించటం, నవగ్రహ స్తోత్ర పఠనం, ప్రదక్షిణలు చేయాలి. శ్రీ మహావిష్ణు దేవాలయాలలోను, ముఖ్యంగా శ్రీ సుదర్శన సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయాలి. నవగ్రహ సన్నిధుల్లో ప్రత్యేక పూజలు, ప్రదక్షిణలు చేయాలి. ప్రతి గ్రహానికి క్రింద పేర్కొన్న నైవేద్యాలను సమర్పించి ప్రసాద వినియోగం చేయవచ్చు: సూర్యుడు–గోధుమ పాయసం/హల్వా, చంద్రుడు–వరిఅన్నం, అంగారకుడు–కందిపప్పు పాయసం, బుధుడు– వేయించిన పెసరపప్పు, నూనెలో వేయించినది, బృహస్పతి– వేయించిన శనగలు, శుక్ర– వేయించిన తెలుపు రాజ్మా, శని–నూనెలో బియ్యంతో కలిపిన నువ్వులు, రాహువు–నూనెలో వేయించిన మినుములు, కేతు–ఉలవల అన్నం. ★

ఆపరేషన్ సిందూర్‌లో కీలకం స్వదేశీ నాగాస్త్రం

ఆపరేషన్ సిందూర్‌తో స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన నాగాస్త్ర-1 అనే ఆత్మాహుతి డ్రోన్ తొలిసారిగా రణరంగంలోకి అడుగుపెట్టింది. ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేసింది. దీనికి కొన్నేళ్ల ముందు ప్రధాని నరేంద్ర మోదీ మేకిన్ ఇండియా మాటను తెరమీదకు తీసుకొనివస్తే లోక్‌సభలో విపక్ష నేతతో పాటుగా ఇతర విపక్ష నేతలందరూ ఆ ఆలోచనను వెక్కిరించారు. అది ఎంతకాలం ఉంటుంది? ఏ మాత్రం ప్రభావం చూపిస్తుంది? అని ప్రశ్నించారు. ఆ వెక్కిరింతలు, ప్రశ్నల మధ్యనే నేడు మేకిన్ ఇండియా కాస్త మేడిన్ ఇండియాగా మారి ఉగ్ర మూకల ముంగిట తన విశ్వరూపాన్ని ప్రదర్శించింది. అంతటితో ఆగక స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన అస్త్రశస్త్రాలను ప్రయోగించడం ద్వారా మేకిన్ ఇండియా రక్షణ రంగంలో భారత్ సత్తాను ప్రపంచానికి చాటి చెప్పింది. కార్గిల్ యుద్ధంలో కథానాయక పాత్ర పోషించిన బోఫోర్స్ హోవిట్జర్ ఆపరేషన్ సిందూర్‌లో మరోసారి తన పనితనాన్ని ప్రదర్శించింది.

స్వదేశీ నాగాస్త్ర-1 శత్రువుల పాలిట ఆత్మాహుతి డ్రోన్

ఆత్మాహుతి డ్రోన్ లేదా ఫ్లయింగ్ బాంబర్ అని పిలుచుకునే నాగాస్త్ర-1ను నాగపూర్‌కు చెందిన సోలార్ ఇండస్ట్రీస్ తయారు చేసి భారత సైన్యానికి సరఫరా చేసింది. ఇది భారత సైనికులను ఎలాంటి ముప్పు రానివిధంగా టెర్రరిస్టు రహస్య స్థావరాలు, లాంచ్ ప్యాండ్లు, చొరబాటు శక్తులను నామరూపాల్లేకుండా చేస్తుంది. భారత సైన్యం దగ్గర ఇలాంటివి 120 దాకా ఉన్నాయి. ఈ సంఖ్య సాయుధ బలగాల అమ్ములపొదిలోకి స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన అస్త్రాలను చేర్చడంలో ప్రధాని నరేంద్ర మోదీ సర్కారు నిబద్ధతను తెలియజేస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా తొమ్మిది లక్ష్యాలను సూది బెజ్జంలో దారాన్ని చేర్చినంత కచ్చితంగా దెబ్బ తీయడంలో నాగాస్త్ర-1 ప్రధాన భూమికను పోషించింది. ఇలా మనదేశంలో తయారైన ఆయుధాలతో ఇంత పెద్ద ఆపరేషన్ చేపట్టడం ఇదే తొలిసారి. జీపీఎస్‌ను సంతరించుకున్న ఈ డ్రోను 30 కి.మీ.ల రేంజ్‌ను కలిగి ఉంటుంది. రెండు మీటర్ల లోపు కచ్చితత్వంతో లక్ష్యాలపై దాడి చేస్తుంది. ఈ కచ్చితత్వం అనవసరపు నష్టాన్ని లేకుండా చేస్తుంది. అదే సమయంలో పక్కాగా పని కానిచ్చేస్తుంది. ఇది గంట సేపు తిరుగుతుంది. అంటే శత్రువును లేదా శత్రు స్థావరాన్ని గుర్తించి నామరూపాల్లేకుండా చేయడానికి బోలెడంత సమయం ఉంటుంది. ఇది 15 కి.మీ.ల రేంజ్‌లో నరమానవులు చొరబడలేని చోట్లకు కూడా చేరుకొని లక్ష్యాన్ని ఛేదిస్తుంది. ముందుగా నిర్దేశించిన మిషన్లకు అయితే 30 కి.మీ.ల రేంజ్ వరకు వీరవిహారం చేస్తుంది. నాగాస్త్ర-1 ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ సిస్టమ్‌ను వినియోగించుకుంటుంది. ఇద్దరు వ్యక్తులు గుసగుసలాడుకున్నంత చిన్నపాటి శబ్దంతో వనిలోకి దిగుతుంది. రాడార్ల కంటిలో పడటానికి అవకాశం లేని విధంగా అత్యంత తక్కువ ఎత్తులో అంటే హీనపక్షం 200 మీటర్ల ఎత్తులో ఎగురుతుంది. ఇన్ని మంచి లక్షణాలు ఉన్నాయి కాబట్టేఈ డ్రోన్‌ను పక్కా విజయం కోనమని కోవర్టు ఆపరేషన్లలో వాడుతుంటారు. ఇది ఒక కేజీ బరువుండి అత్యంత పేలుడు స్వభావాన్ని సంతరించుకున్న అస్త్రాన్ని మోసుకొని వెళ్లగలుగుతుంది. అందుకని టెర్రరిస్టులను, చిన్నపాటి భవనాలను ధ్వంసం చేయడంలో ఇది ముందుంటుంది. ఇది రాత్రి, పగలు అనే తేడా లేకుండా పనిచేస్తుంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ తనకు అప్పగించిన పనిని చేసిపెడుతుంది. శీతల వాతావరణంలోనూ, సముద్రమట్టానికి 4,500 మీటర్ల ఎత్తులోనూ పనికివస్తుంది.

నాగాస్త్ర-1ను తిరిగి ఉపయోగించుకోవచ్చు. ఒక వేళ అది లక్ష్యాన్ని చేధించలేకపోయిన పక్షంలో ఈ డ్రోను తనకు ఉన్న ప్యారాచూట్ సాయంతో ఎక్కడి నుంచైతే ప్రయోగించారో తిరిగి అక్కడికే చేరుకుంటుంది.

ఈ ఫ్లయింగ్ బాంబర్ తయారీలో 75 శాతం మన దేశంలో తయారైన వస్తువులనే వాడారు. ఇది రక్షణ రంగంలో పెరుగుతున్న భారత్ ఉత్పాదక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్తోంది. ఇజ్రాయెల్ లేదా పోలాండ్ లాంటి దేశాలలో తయారైన ఆత్మాహుతి డ్రోన్లతో పోలిస్తే నాగాస్త్ర-1 దాదాపు 40 శాతం చవగ్గా దొరుకుతుంది. ఇది పురుడు పోసుకునేటప్పుడు అనేక కఠిన పరీక్షలను ఎదుర్కొంది. జనారణ్యంలో ప్రతిభావంతంగా పనిచేసేందుకని దీన్ని సవాల్‌తో కూడుకున్న వాతావరణ పరిస్థితులను సంతరించుకున్న లద్దాఖ్‌లోని నుబ్రా లోయలో పరీక్షించారు. ఇలాంటి పరీక్షలను తట్టుకున్న తర్వాత సమస్యాత్మకమైన సరిహద్దు ప్రాంతాల్లో పనిచేయగలిగే సామర్థాన్ని ఈ ఆత్మాహుతి డ్రోన్ సంతరించుకుంది.

స్వదేశీ అస్త్రశస్త్రాల్లో మరికొన్ని..

ఆపరేషన్ సిందూర్‌లో నాగాస్త్ర-1 అత్యంత ప్రతిభావంతంగా పనిచేసిన వైనం యావత్ ప్రపంచం

దృష్టిని ఆకర్షించింది. భారత్ రక్షణ రంగంలో స్వదేశీ పరిజ్ఞానంతో అస్త్రశస్త్రాల ఉత్పాదనలో శరవేగంతో దూసుకుపోతుండటం ఆసక్తికరంగా మారింది. నాగాస్త్ర-1తో పాటుగా మనదేశంలో తయారైనవి మరికొన్ని ఉన్నాయి. అవి.

తేజస్ లైట్ కాంబట్ ఎయిర్‌క్రాఫ్ట్ - ఎల్‌సీఏ:

ఈ విమానానికి హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) రూపకల్పన చేసి తయారు చేసింది. బహుముఖ పాత్రలు పోషించే తేజస్ ఫైటర్ జెట్ ఉత్పాదనలో స్వావలంబన దిశగా ఓ కీలకమైన అడుగు అవుతుంది.

ఐఎన్ఎస్ విక్రాంత్ విమాన వాహక యుద్ధనౌక:

ఐఎన్ఎస్ విక్రాంత్ భారతదేశంలో రూపకల్పన దశ నుంచి నిర్మాణం దాకా స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన మొట్టమొదటి విమాన వాహక యుద్ధనౌక. ఇది నావికా బలాన్ని ప్రదర్శించడంలో నౌకా నిర్మాణంలో భారత్ శక్తిసామర్థ్యాలను, ఆ విషయం జాతి నిబద్ధతను ప్రతిబింబిస్తోంది.

అడ్వాన్స్‌డ్ టోవ్‌డ్ ఆర్టిలరీ గన్ సిస్టమ్ - ఏటీఏజీఎస్:

రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ – డీఆర్‌డీవో, ప్రైవేట్ రంగ భాగస్వాములు అభివృద్ధి చేసిన ఏటీఏజీఎస్ దేశీయంగా తయారైన హోవిట్జర్‌గా పేరు తెచ్చుకుంది.

పినాక మల్టీ-బారెల్ రాకెట్ లాంచర్ సిస్టమ్:

ఇది స్వదేశీయ పరిజ్ఞానంతో అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ పనిచేసేట్టుగా తయారైంది. ఈ సిస్టమ్ సైన్యానికి ఎక్కువ విస్తీర్ణం ఉన్న ప్రాంతాల్లో శత్రువులను, శత్రు స్థావరాలను సమూలంగా నాశనం చేసే సామర్థ్యాన్ని ఇస్తుంది.

యాంటి-శాటిలైట్ (ఏఎస్ఏటీ) మిస్సైల్:

భారత్ ఇటీవల ఏఎస్ఏటీ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. తద్వారా రోదసీలో సొంత ఆస్తులను కాపాడుకోవడంలో తన సామర్థ్యాన్ని ప్రదర్శించింది. ఇది వ్యూహాత్మక రక్షణలో భారత్ సాధించిన ఓ కీలకమైన ఘనత.

వీటితో పాటుగా అనేక దేశీయ కంపెనీలు, డీఆర్‌డీవో ల్యాబరేటరీలు సాయుధ బలగాల కోసమని అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సూట్లు, రాడార్ సిస్టమ్‌లు, భద్రమైన కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లను తయారుచేయడంలో తలమునకలై ఉన్నాయి. ఇలా దేశంలో తయారైన రక్షణ సామాగ్రి సాయుధ బలగాలకు క్రమక్రమంగా చేరుకుంటూ ఉండటం భారత సైన్యం కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా వాటి కోసమని విదేశీ సరఫరాదారులపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. దేశీయ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. స్వదేశీ సాంకేతిక పరిశోధనలకు ఊతమిస్తుంది.

– జాగృతి డెస్క్

మోదీ మా
మళ్లీ దెబ్బ

ప్రధాని నరేంద్ర మోదీ పాకిస్తాన్‌కు ఒక చేత్తో ఆకాశం వైపు చూపించి మరో చేత్తో వీపు విమానం మోత మోగించడంలో దిట్ట. అది 2019లో బాలాకోట్ దాడులు కావొచ్చు. మే7న అర్ధరాత్రి దాటాక ఒంటిగంటా నలభై నాలుగు నిమిషాలకు ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్తాన్‌లో, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లో తొమ్మిది ఉగ్రమూకల స్థావరాలపై దాడి కావొచ్చు. ఇలా రెండు సందర్భాల్లోనూ మోదీ చేసిన పర్యటనలు, ప్రసంగాల మాయా వలలో పడి పాకిస్తాన్ దారుణంగా దెబ్బతింది. ఏ మాత్రం ఊహకందని భారత్ ప్రధాని వ్యూహంతో వ్రూన్పడిపోయింది. గేలానికి చిక్కిన చేపలా గిలగిలలాడిపోయింది.

ఒక అడుగు(బాలాకోట్) పడితే అది భంగిమ, రెండు అంతకు మించి అడుగులు పడితే (ఆపరేషన్ సిందూర్) అది సమరానికి మోదీ చేసే నృత్యమవుతుంది. ఇంకా చెప్పాలంటే అది ఎలాంటి సంకేతాల్లేకుండా అంతర్జాతీయ వేదికపై విస్ఫోటనం సృష్టించే భావగర్భితమైన తాండవం ఔతుంది. ఈ రెండు దాడులు జరగడానికి ముందు చోటు చేసుకున్న ఘటనల మధ్య సారూప్యత అత్యంత అసాధారణమైంది. పాకిస్తాన్ బాలాకోట్ దాడులకు ముందు ప్రధాని మోదీ ఎలా ప్రవర్తించి చూసింది. ఆపరేషన్ సిందూర్‌కు ముందు ఆయన చేష్టలను, మాటలనూ చూసింది. బాలాకోట్ దాడుల నుంచి నేర్చుకున్న పాఠంతోనైనా ఆపరేషన్ సిందూర్‌ను ముందుగా కనిపెట్టడంలో తన అనమర్థతకు, తెలివి తక్కువతనానికి అది తన చెప్పుతో తనను తానే చెడామడా కొట్టుకోవాలి.

బాలాకోట్ దాడులకు 48 గంటల ముందు

భారత్ ఫిబ్రవరి 26, 2019న తెల్లవారక ముందే బాలాకోట్ దాడులకు పాల్పడింది. అయితే ప్రధాని మోదీ దాడులు జరగడానికి 48 గంటల ముందు యధావిధిగా తన రోజువారి కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్నారు. ఆయన ఫిబ్రవరి 25న న్యూఢిల్లీలో జాతీయ యుద్ధ స్మారకాన్ని జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన భారత సాయుధ బలగాల ధైర్య సాహసాల గురించి మాట్లాడారు. అయితే ప్రధాని పాకిస్తాన్‌లోని ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రావిన్సులో ఉగ్రమూకల స్థావరాలపై జరుప తలపెట్టిన దాడుల గురించి నామమాత్రంగానైనా ప్రస్తావించలేదు సరికదా ఎలాంటి సంకేతాలనూ ఇవ్వలేదు.

ఫిబ్రవరి 25 రాత్రి 9 గంటలకు భారత యుద్ధ విమానాలు టేకాఫ్‌కు సిద్ధంగా ఉన్నాయి. మోదీ సరిగ్గా

యాజాలం.. తిన్న శత్రుదేశం..!

అదే సమయానికి న్యూఢిల్లీలో ఒక మీడియా సంస్థ ఏర్పాటు చేసిన సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తున్నారు. ఆయన భారత్ ఆకాంక్షలు, అభివృద్ధి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జాతి సంకల్పం గురించి మాట్లాడారు. ప్రధాని ప్రసంగిస్తున్నప్పుడు నేపథ్యంలో గడియారం టిక్కు టిక్కు మంటున్నప్పటికీ ఆయన హావభావాల్లో ఎలాంటి మార్పు కనిపించలేదు. మోదీ నుదురు ముడతపడలేదు. ముఖంపై ఆందోళన లేదా అనుమానం రేఖామాత్రంగానైనా కనిపించలేదు.

మనస్తత్వవేత్తలు చెప్పిన దాన్ని బట్టి ఒక గొప్ప నేత ఎప్పుడూ కూడా పెను ఉత్పాతం విరుచుకు పడుతున్నప్పటికీ ప్రశాంతతను, అగ్ని కీలలు ముంచుకొస్తున్నప్పటికీ గుండె ధైర్యాన్ని కలిగి ఉంటారు. దీనికి ప్రధాని మోదీ నాయకత్వాన్ని ఒక తార్కాణంగా చూసి వారు ఆనందపడి ఉంటారు. ఇదే విషయాన్ని మున్ముందు ప్రచురితమయ్యే వ్యక్తిత్వ వికాస పుస్తకాల్లో ఒక అధ్యాయంగా మనం చూడవచ్చు.

ఆపరేషన్ సిందూర్‌కు కొద్ది గంటల ముందు

ప్రధాని నరేంద్ర మోదీ ఆపరేషన్ సిందూర్ కార్యరూపం దాల్చడానికి కొద్ది గంటల ముందు అంటే మే 6వ తేదీ రాత్రి న్యూఢిల్లీలో ఒక మీడియా సంస్థ నిర్వహించిన సదస్సును ఉద్దేశించి ప్రసంగించారు. 2047 నాటికి ఒక ఆర్థిక శక్తిగా అవతరించడంలో భారత్ ఆకాంక్షలు, కలలు గురించి ఆయన మాట్లాడారు. ఆరేళ్ల క్రితం బాలాకోట్ దాడులు జరగడానికి ముందు రోజు రాత్రి కూడా మోదీ ఒక సదస్సులో పాల్గొనడం గమనార్హం. మే 6వ తేదీ రాత్రి సదస్సు విషయానికి వస్తే ప్రధాని 30 నిమిషాలు మాట్లాడినప్పటికీ నిండుకుండలా తొణక్కుండా ఉన్నారు. ఎలాంటి ఒత్తిడి, తొట్రుపాటు లేకుండా ప్రశాంతంగా ప్రసంగించారు. మధ్య మధ్యలో జోకులు కూడా వేశారు. ప్రధాని ఆ మాట ఎప్పుడెప్పుడు అంటారా? అని సభికులు ఆత్రంగా ఎదురు చూసినప్పటికీ పాకిస్తాన్ గురించి మోదీ పల్లెత్తు మాట కూడా అనలేదు. ఫిబ్రవరి 25 రాత్రి, 2019లో ఎలాగైతే ఓ ధీమా కలిగి స్థితప్రజ్ఞతను సంతరించుకున్న నేతలా వ్యవహరించారో మే 6 రాత్రి, 2025లో కూడా అదే వైఖరిని ప్రధాని మోదీ ప్రదర్శించారు.

మరీ లోతుగా పరిశీలిస్తే తప్ప ఆపరేషన్ సిందూర్ గురించి తన ప్రసంగంలో ఆయన ఇచ్చిన సంకేతం బోధపడదు. ప్రధాని "జనం ఏమంటారో" అనే భయంతో కీలకమైన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాల చేతకానితనం గురించి మాట్లాడారు. అన్నిటికన్నా కూడా దేశానికి మరీ ముఖ్యంగా జాతి ప్రయోజనాలకు తొలి ప్రాధాన్యత (నేషన్ ఫస్ట్) ఇవ్వాలని అన్నారు. కానీ ఆ సందర్భంలో అక్కడ ఉన్న మైండ్ రీడర్లు మాత్రమే ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి మోదీ ఆలోచనల నుంచి మాటల రూపంలో వెలువడిన సంకేతాలను డీకోడ్ చేయగలరు.

పాకిస్తాన్ ఆపరేషన్ సిందూర్ ఉండదులే అన్న భ్రమల్లో ఉండిపోవడానికి ప్రధానమైన కారణాల్లో ఒకటిగా భారత్ అంతటా మాక్ డ్రిల్ నిర్వహించాలంటూ ప్రభుత్వం చేసిన ప్రకటనను చెప్పుకోవచ్చు. మోదీ ఆ ప్రకటనతో యావత్ దేశాన్ని సైనిక చర్య, దాని విపరిణామాలకు సిద్ధం చేస్తూ ఉండిపోయారనే భావనలో మతోన్మాద దేశం ఉండిపోయింది. కానీ ఇదంతా కూడా తనను మహేంద్ర జాలంలో ఉంచడానికి భారత ప్రధాని పన్నిన వ్యూహం అని తెలుసుకునేసరికి పాకిస్తాన్‌కు జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

అందుకే యుద్ధ వ్యూహాలను, తంత్రాలను ఔపోసన పట్టినవారు అంటుంటారు.. "నువ్వు కనుక నీ శత్రువును గురించి పూర్తిగా తెలుసుకోగలిగితే చాలు యుద్ధంలో విజయలక్ష్మి నిన్నే వరిస్తుంది" అని. పాకిస్తాన్ ఇకనుంచి ప్రధాని మోదీని చదివే పని మొదలుపెడుతుంది. ఆయన మాటల వెనుక మర్మాన్ని డీకోడ్ చేయడానికి ప్రయత్నిస్తుంది. మోదీ చేతల్లో దాగి ఉన్న చాణక్యాన్ని కనుక్కోవడానికి ప్రయాస పడుతుంది. ఆయన ముఖంలో మచ్చుకైనా కనిపించని ఒత్తిడి, ఆత్రుత తాలూకు సంకేతాలను ఒడిసిపట్టడానికి వేగిరపడుతుంది. అయినా ఆ మందమతికి అవి అంత తేలిగ్గా అంతుపట్టవు.

అసాధ్యం అనే మాట ఎవరికైనా వర్తిస్తుందేమో కానీ అది మోదీకి మాత్రం ముమ్మాటికి వర్తించదు. భారత ప్రధాని అంటే శత్రువులకు ఎంతకూ విడువని ఓ పీటముడి... అంతుపట్టని ఓ చిక్కు ప్రశ్న. ఒక చేత్తో ఆకాశం వైపు చూపించి మరో చేత్తో వీపు విమానం మోత మోగించే దిట్ట.



– జాగృతి డెస్క్

బెలూచిస్తాన్‌లో రాలు

భారత్ ప్రారంభించిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో బెలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) నాయకుడు సర్దార్ అఖ్తర్ చేసిన వ్యాఖ్యలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. 1971లో 90 వేల మంది పాక్ సైన్యం భారత్‌కు లొంగిపోవడంతో బాంగ్లాదేశ్ ఏర్పడిందని, ఇప్పుడు పాకిస్తాన్‌లో మళ్లీ అలాంటి పరిణామాలే ఏర్పడుతున్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్తాన్‌పై దాడుల మొదలుకావడంతో కొన్ని దశాబ్దాలుగా ప్రత్యేక దేశం ఏర్పాటు కోసం ఉద్యమిస్తున్న బీఎల్ఏ ఆశలు ద్విగుణీకృతమైనాయి. భారత్, బీఎల్ఏ బలగాలు పాకిస్తాన్ బలగాలపై ఏకకాలంలో విరుచుకుపడడంతో పెద్ద ఎత్తున పాక్ సైనికులు మృతి చెందుతున్నారు. బలూచిస్తాన్ వేర్పాటువాదుల దాడులతో పాక్ సైనికులు చాలా ప్రాంతాల నుండి తోకముడవడంతో వేర్పాటువాదులు పాకిస్తాన్ పతాకాలను తొలగించి తమ జెండాలను రెపరెపలాడిస్తూ ఆ దేశ సార్వభౌమత్వానికి గట్టి సవాలు విసురుతున్నారు.

పెహల్గామ్‌లో పర్యాటకులపై అమానుష దాడికి మూల్యం చెల్లిస్తున్న పాకిస్తాన్ భారత్‌తో పాటు బలూచిస్తాన్‌తో కూడా ఉక్కిరిబిక్కిరవుతోంది. కశ్మీర్‌లో వేర్పాటువాద కుట్రలు సాగిస్తున్న పాకిస్తాన్ ఇప్పుడు తన అస్తిత్వాన్ని కోల్పోయే దుస్థితిలో పడింది. ఆపరేషన్ సిందూర్‌తో దిక్కుతోచని స్థితిలో కొట్టు మిట్టాడుతున్న పాకిస్తాన్‌కు పక్కలో బలింలా తయారైన బలూచిస్తాన్‌తో ఆందోళన రెట్టింపయ్యింది. భారత్‌తో ఎదురయ్యే పరాజయాల కంటే భవిష్యత్‌లో దేశం ముక్కలు కానున్న పరిస్థితులే పాకిస్తాన్‌ను నిద్రలేకుండా చేస్తున్నాయి. దీర్ఘకాలికంగా ప్రత్యేక బలూచిస్తాన్‌లో పాకిస్తాన్ జాతీయ పతాకాలను తొలగించి బలూచిస్తాన్ జెండాలు ఎగరేస్తుండడంతో పాక్ పాలకులు అక్కడ చేతులెత్తేసినట్లు కనిపిస్తోంది. సొంత దేశంలో పరిస్థితులు చక్కదిద్దుకోలేని పాకిస్తాన్ భారత్‌పై కాలుదువ్వి ఇంటా, బయటా అభాసుపాలవుతున్నది.

నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత్ తీసుకుంటున్న దృఢమైన నిర్ణయాలు పాకిస్తాన్‌కు అంకుశాలుగా మారుతున్నాయి. 2016లో ఉరిలో, 2019లో బాలాకోట్‌లో ఉగ్రదాడులను ఉసిగొల్పడంతో భారత్ చేసిన సర్జికల్ స్ట్రైక్స్‌తో భంగపడినా పాకిస్తాన్ గుణపాఠం నేర్వలేదు. గత ఏప్రిల్ 22వ తేదీన పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు కిరాతకంగా కశ్మీర్‌లోని పెహల్గామ్‌లో మతం పేరిట పర్యాటకులను హత మార్చడంతో యావత్ భారతదేశం రగిలిపోయింది. దేశ రక్షణను పటిష్టపరుచుకోవడంతోపాటు, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలనే లక్ష్యంతో భారత్ ఐక్యరాజ్య సమితి యాక్ట్ 51 ప్రకారం ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భీకర దాడి చేసి వంద మందికిపైగా ఉగ్రవాదులను మట్టుబెట్టారు. దీనిపై అంతర్జాతీయ స్థాయిలో నానాయాగీ చేయాలని చూసిన పాకిస్తాన్‌కు సానుకూలత రాలేదు. భారత్ దాడులపై ఇతర దేశాల మద్దతు కూడగట్టడంలో విఫలమైన పాకిస్తాన్ ఇదే సమయంలో పుండు మీద కారంలా బలూచిస్తాన్ రూపంలో అంతర్గతంగా కూడా పోరాడాల్సి వచ్చింది.

బలూచిస్తాన్ నిరసనలు, ఉగ్రవాదుల దాడుల వెనుక విదేశీ హస్తం, ప్రధానంగా భారత్ ప్రోత్సాహం ఉందని పాకిస్తాన్ చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు లేవు. బీఎల్ఏ ఉద్యమం భారత్ సృష్టి కాదు. 19వ శతాబ్దంలో ఈ ప్రాంతం స్వతంత్రంగా ఉండేది. గిరిజన పాలన ఉండేది. స్వాతంత్ర్యం అనంతరం దేశ విభజనలో భాగంగా బలూచిస్తాన్ పాకిస్తాన్‌లో భాగం అయింది. ఈ నిర్ణయంపై అప్పుడే బెలూచి స్తాన్‌లో వ్యతిరేకత వచ్చి తమను ప్రత్యేక ప్రాంతంగా గుర్తించాలని డిమాండ్ చేసినా వారి ఆవేదనను ఎవరూ పట్టించుకోలేదు. పాకిస్తాన్ పాలనలో బలూచిస్తాన్ వివక్షకు గురికావడంతో అక్కడి ప్రజల్లో అసంతృప్తి రోజురోజుకు పెరిగి ఇప్పుడు ప్రత్యేక దేశంగా ఏర్పడాలనే కోరిక బలపడింది. ఇందులో భాగంగా అక్కడ నిరసనలు, ఉద్యమాలు, హింసాత్మక ఘటనలు నిత్యకృత్యమయ్యాయి. బలూచీలను ద్వితీయశ్రేణి పౌరులుగా పరిగణిస్తూ పాక్ పరిపాలకులు సాగించిన దమననీతి ఇప్పుడు ఆ దేశానికి గుదిబండగా మారింది.

ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలు కలిగిన బలూచిస్తాన్ పాకిస్తాన్‌తో కలిసి ఉండేందుకు ఎప్పుడూ ఇష్టపడలేదు. ఇక్కడ బలూచీ తెగదే ఆధిపత్యం. నైరుతిలో పాకిస్తాన్, ఆగ్నేయంగా ఇరాన్, దక్షిణాదిన అఫ్ఘానిస్తాన్ ఉన్నాయి. బలూచీ వాసుల్లో 50 శాతం మంది పాక్‌లోని బలూచీ ప్రావిన్స్‌లో, 40 శాతం మంది సింధ్‌లో, కొంత మంది పాక్‌లోని పంజాబ్ ప్రాంతంలో ఉంటారు. పాకిస్తాన్ జనాభాలో వీరు 3.6 శాతం. పాకిస్తాన్ అవతల ఇరాన్, అఫ్ఘానిస్తాన్‌లో 2 శాతం ఉన్నారు. పాకిస్తాన్‌లో విస్తీర్ణంలో అతిపెద్దదైన బలూచిస్తాన్ జనాభాలో మాత్రం తక్కువ ప్రజలున్న రాష్ట్రం. బలూచిస్తాన్ పాకిస్తాన్ భూభాగంలో 44 శాతం ఉన్నా, వ్యవసాయ యోగ్య భూమిలో ఆ రాష్ట్ర వాటా కేవలం 5 శాతం. పాకిస్తాన్ ప్రభుత్వం వ్యవసాయ అభివృద్ధికి సరైన చర్యలు తీసుకోకపోవడంతో భూమి నిరుపయోగంగా ఉంది.

తున్న పాక్ పతాకాలు

స్థానికులు పాకిస్తాన్ ప్రభుత్వ వివక్షపై అసంతృప్తిగా ఉన్నారు.

ఖనిజ సంపద, సహజ వాయువు నిక్షేపాలు పుష్కలంగా ఉన్న బలూచిస్తాన్ పాకిస్తాన్‌కు వ్యూహాత్మకంగా, ఆర్థికంగా కీలకమైన ప్రాంతం. బలూచిస్తాన్‌లో బంగారం, వజ్రాలు, వెండి, రాగి వంటి విలువైన వనరులున్నా ఇక్కడి ప్రజలు మాత్రం నిరుపేదలుగానే మిగిలిపోయారు. పాకిస్తాన్‌తో అంటకాగే చైనా ఇక్కడ వనరులను దోచుకోవాలనే దుర్బుద్ధితో పాగా వేయగా స్థానికులు అనేకమార్లు అడ్డుకున్నారు. చైనా పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్‌లో బలూచిస్తాన్ కీలకమైంది. పాకిస్తాన్ అండతో అభివృద్ధి పేరుతో తమ ప్రాంతాన్ని చైనా దోచుకుంటుందనే ఆగ్రహంతో బలూచిస్తాన్‌లో పలుమార్లు చైనా అధికారులు, కార్మికులపై దాడికి పాల్పడిన ఘటనలున్నాయి. చైనా చేపట్టిన గ్వాదర్ నౌకాశ్రయం బలూచీల ఉద్యమానికి కొత్త ఊపు తెచ్చింది. దీనిని స్థానికుల అభిమతానికి విరుద్ధంగా చైనా నిర్మించింది. అభివృద్ధి పరంగా తమ ప్రాంతంపై పక్షపాతం చూపిస్తున్న పాకిస్తాన్ ప్రభుత్వం ఇక్కడి సహజ సంపదను ప్రణాళికబద్ధంగా చైనాకు అప్పగిస్తుండడంతో స్థానికుల్లో పాక్ పాలకులపై ఆక్రోశం రెట్టింపయ్యింది. బలూచిస్తాన్ తిరుగుబాటుకు పాకిస్తాన్ పాలకులు కారణమైతే, అందులో కొంత చైనా వ్యవహార తీరు ఉంది.

1947లో బ్రిటిష్ పాలకులు స్థానికుల ఆశయానికి విరుద్ధంగా తమను పాకిస్తాన్‌లో విలీనం చేసినప్పుడే బలూచిస్తాన్‌లో వేర్పాటువాదానికి బీజం పడింది. ఇందుకు ప్రధానంగా రెండు కారణాలు. ఒక్కటి చారిత్రకం. రెండు దేశంలో ఆర్థికంగా బలంగా ఉన్న పంజాబీల రాజకీయ ఆధిపత్యం. పాకిస్తాన్ ఏర్పాటు నుండి అసంతృప్తిగా ఉన్న బలుచిస్తాన్‌లో వేర్పాటువాద బృందంగా ప్రత్యేక గుర్తింపు పొందిన బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) 2000 సంవత్సరం నుండి పాకిస్తాన్ సైన్యం, పోలీసులు, చైనా దేశస్తులపై దాడులు చేస్తుండడంతో ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. లష్కరే బలూచిస్తాన్, బలూచిస్తాన్ లిబరేషన్ యునైటెడ్ ఫ్రంట్ వంటి సంస్థలు కూడా బీఎల్ఏకు తోడయ్యాయి. బలూచిస్తాన్‌కు ప్రత్యేక స్వయంప్రతిపత్తి, స్వాతంత్ర్యం, సార్వభౌమాధికారాన్ని ఈ వేర్పాటు వాదులు కోరుతున్నారు.

బలూచిస్తాన్‌లో అశాంతికి, అల్లర్లకు పాకిస్తాన్ ప్రభుత్వం దమనకాండతో పాటు ఆ దేశ సైనికులు, ఐఎస్ఐ కూడా కారణం. ఉద్యమిస్తున్న విద్యార్థులను, మేధావులను నిర్బంధిస్తూ వారి గొంతు నొక్కుతున్నారు. బీఎల్ఏను పాకిస్తాన్ ప్రభుత్వం దోషిగా నిలబెట్టడంతో అమెరికా, చైనా దేశాలు ఆ సంస్థను నిషేధించాయి. తమపై పాకిస్తాన్ అరాచకాలకు వ్యతిరేకంగా బలూచిస్తాన్ మద్దతుదారులు ఐక్యరాజ్య సమితి కార్యాలయం వద్ద నిరసనలు చేపట్టి పాకిస్తాన్ ప్రభుత్వం వైఫల్యాలతో పాటు చైనా ఆక్రమణలను కూడా ప్రపంచానికి చాటి చెప్పారు. అమ్నెస్టీ ఇంటర్నేషనల్ లెక్కల ప్రకారం 2011 నుండి దాదాపు పది వేల మంది బలూచిస్తాన్ ప్రజలు అదృశ్యమయ్యారు.

బలూచిస్తాన్‌లో తిరుగుబాటును అరికట్టలేని పాకిస్తాన్ తన చేతగానితనాన్ని భారత్, అఫ్ఘనిస్తాన్ దేశాలపై నెట్టుతుంది. ఆ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోకుండా అక్కడ జరుగుతున్న హింసాత్మక ఘటనలపై భారత్‌ను విమర్శిస్తుంది. ముఖ్యంగా 2016 నుండి ఇండియా హస్తం ఉందని కొత్త పల్లవి అందుకుంది. ఇందుకు కారణం నరేంద్ర మోదీ ప్రభుత్వం ముందు బలూచిస్తాన్‌పై భారత్ ఆచితూచి వ్యవహరించేది. ఇప్పుడు భారత్ వైఖరి మారింది. బలూచిస్తానీయుల దార్శనికత, ఆకాంక్ష, అవసరాలను గుర్తించాలనే భావనతో మోదీ 2016 ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం రోజున మాట్లాడుతూ నాకు బలూచిస్తాన్, గిల్గిత్, పీఓకే ప్రజలు కృతజ్ఞతలు చెబుతున్నారంటూ చేసిన వ్యాఖ్యలు చేశారు.

భారత ప్రభుత్వం తమ ఉద్యమానికి తోడ్పాటు అందిస్తుందని బలూచిస్తాన్ ఎంతో కాలంగా ఆశలు పెట్టుకుంది. వారు చేపట్టే నిరసన కార్యక్రమాల్లో భారత్ పేరున్న ప్లకార్డులను ప్రదర్శిస్తుండడంతో పాకిస్తాన్‌కు కంటగింపుగా మారింది. అయితే భారత్ దేశం మాత్రం ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడంపై ఆసక్తి చూపడం లేదు. మరోవైపు ఎక్కడైనా ఏ రూపంలోనైనా హింసాత్మక ఘటనలను భారత్ ఎప్పుడూ సమర్థించదు. 'శత్రువుకు శత్రువుకు మనకు మిత్రుడు' అంటూ బలూచిస్తాన్‌కు భారత్ ప్రత్యక్షంగా మద్దతివ్వాలని డిమాండ్లు వస్తున్నా మన దేశం ఏ మాత్రం తొందరపడడం లేదు.

పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా బలూచిస్తాన్‌లో 2000 సంవత్సరం నుండి ప్రారంభమైన హింసాత్మక ఘటనలతో మృతుల సంఖ్య భారీగానే ఉంది. అక్కడి హింసాత్మక ఉద్యమంపై యావత్ ప్రపంచ దేశాల నుండి పాకిస్తాన్‌పై ఒత్తిడి రావడంతో ఆ దేశ పాలకులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దీనికి తోడు ఇప్పుడు భారత్ నుండి ఎదురవుతున్న చావుదెబ్బతో పాక్ చేతులెత్తేయడంతో బలూచిస్తానీయులు దీన్ని ఒక అవకాశంగా మల్చుకుంటూ పాకిస్తాన్ సైనికులపై పెద్ద ఎత్తున దాడులు చేస్తున్నారు. బలూచిస్తాన్‌లో జాతీయ రహదారులు, రైల్వే లైన్లు, పోలీస్ స్టేషన్లను ధ్వంసం చేయడమే కాకుండా పాకిస్తాన్ సైనిక బలగాలపై దాడులు చేస్తున్నారు. ఈ ఘటనలతో బలూచిస్తాన్ ప్రావిన్స్ అంతటా భయం, అనిశ్చితితో ప్రజలకు రక్షణే లేకుండా పోయింది. బలూచిస్తాన్‌లో మూడింట ఒక వంతు బీఎల్ఏ స్వాధీనం చేసుకుంది. పలు పట్టణాలు, గ్రామాలు వారి అధీనంలోకి వచ్చాయి.

జమ్ము కశ్మీర్‌లో ఒకలా, బలూచిస్తాన్‌లో మరోలా ద్వంద్వనీతితో వ్యవహరిస్తున్న పాకిస్తాన్ అంతర్జాతీయంగా విమర్శలు ఎదుర్కొంటుంది. ప్రస్తుతం ఆపరేషన్ సిందూర్‌తో అతలాకుతలమవుతున్న పాకిస్తాన్ ప్రభుత్వాన్ని సమయం చూసి దెబ్బకొట్టేలా కాచుకొని కూర్చున్న బలూచిస్తాన్ తిరుగుబాటుదారులు వ్యూహాత్మకంగా సాగుతూ దెబ్బతీస్తున్నారు. ప్రత్యేక బలూచిస్తాన్ కోసం దీర్ఘకాలికంగా శాయాశక్తులా పోరాడుతున్న బలూచిస్తానీయులు తమ ఆకాంక్ష త్వరలో నెరవేరుతుందని ఆశిస్తున్న నేపథ్యంలో పాకిస్తాన్ మరోసారి ముక్కలయ్యే అవకాశాలున్నాయి. 1971 యుద్ధంతో బంగ్లాదేశ్‌ను జారవిడుచుకున్న పాకిస్తాన్ 2025లో ఆపరేషన్ సిందూర్‌తో బలూచిస్తాన్‌ను కూడా కోల్పోతుందో లేదో వేచి చూడాలి.

– శ్రీపాద

సుదర్శన చక్రానికి తిరుగులేదు!

పెహల్గామ్ సంఘటన తర్వాత భారత్ ఆరంభించిన ఆపరేషన్ సిందూర్‌లో, పాక్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్, వైమానిక దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టిన రష్యా తయారీ ఎస్-400, 'సుదర్శనచక్ర' గురించి ఎంత చెపుకున్నా తక్కువే. మే 7-8 రాత్రివేళల్లో పాకిస్తాన్ మనదేశం పై కనీసం 15 క్షిపణులను, వందలాది డ్రోన్‌లను ప్రయోగించింది. ముఖ్యంగా జమ్ము-కశ్మీర్, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాలోని 15 నగరాల సైనిక స్థావరాలు లక్ష్యంగా ఈ దాడులు చేసింది. పరిస్థితిని గుర్తించిన మన భద్రతా బలగాలు వేగంగా ఎస్-400 'సుదర్శనచక్ర'ను తక్షణమే క్రియాశీలకం చేశాయి. దీంతో పాక్ ప్రయోగించిన ఏ ఒక్క క్షిపణి, లేదా డ్రోన్ భారత భూభాగంలోకి ప్రవేశించలేకపోయాయి. అన్నింటిని మధ్యలోనే ఈ ఎస్-400 వ్యవస్థ నిర్వీర్యం చేయడంతో ఒక్కసారిగా అవాక్కవడం పాక్ సైన్యం వంతైంది. ఎస్-400 సమర్థవంతమైన పనితీరు సర్వత్రా ప్రశంసలందుకుంది. కాగా ఈ రక్షణ వ్యవస్థ నిర్వీర్యం చేసిన క్షిపణులు, డ్రోన్‌ల శకలాలను అధికార్లు సమీకరించి ఫోరెన్సిక్ పరీక్షలకు పంపడం తర్వాతి పరిణామం.

తర్వాత పాకిస్తాన్ తన దాడులను ముమ్మరం చేస్తూ, ఎఫ్-16 వంటి అమెరికా అత్యాధునిక యుద్ధవిమానాన్ని రంగంలోకి దించింది. విచిత్ర మేమంటే అమెరికా ఎంతో గొప్పగా చెప్పుకుంటూ ప్రపంచ దేశాలకు అమ్మకాలు సాగించే ఈ 'అత్యాధునిక' యుద్ధ విమానాన్ని కూడా మన 'సుదర్శన చక్రం' తుత్తునియలు చేసింది. అంటే ఎఫ్-16లో ఉపయోగించే సాఫ్ట్‌వేర్ కూడా ఎస్-400 ముందు దిగదుడుపన్నది సత్యం. ఇక చైనాకు చెందిన జె.ఎఫ్-17 యుద్ధవిమానాల పరిస్థితి చెప్పాల్సిన అవసరమేలేదు. అవి అట్టపెట్టెల్లా కూలిపోయాయి. ఇంతటి సామర్థ్యాన్ని ప్రదర్శించిన ఎస్-400 రక్షణ వ్యవస్థను రష్యాకు చెందిన అల్‌మాజ్ అనటే సంస్థ అభివృద్ధి చేసింది. వీటిని కొనుగోలు చేసిన మనదేశం "సుదర్శనచక్ర" పేరుతో పాక్ సరిహద్దుల్లో మోహరించింది. భూమి ఉపరితలంనుంచి- ఆకాశంలోకి సుదూర లక్ష్యాలను ఛేదించే క్షిపణులను ప్రయోగించే సామర్థ్యమున్న ప్రపంచంలోని ఏకైక రక్షణ వ్యవస్థ ఎస్-400. ఇందులో ప్రతి స్క్వాడ్రన్‌కు 'ఫేస్‌డ్ ఎర్రే రాడార్లు', కమాండ్ సెంటర్లు, బహుళ రకాల క్షిపణులను అమరుస్తారు. 600 కిలోమీటర్ల దూరంలోని ప్రత్యర్థి వైమానిక, క్షిపణులను గుర్తించి 400 కిలోమీటర్ల లోపున వాటిని ధ్వంసం చేయడం ఈ 'సుదర్శనచక్ర' విశిష్టత. డ్రోన్లు, క్రూ యాజ్ క్షిపణులు, ఖండాంతర క్షిపణులు, స్టెల్త్ యుద్ధ విమానాల నుంచి ఇది చక్కటి రక్షణ కల్పిస్తుంది. ఇవేవీ కూడా 'సుదర్శనచక్ర' దేగకన్ను నుంచి తప్పించుకోలేవు. పాక్ ఘర్షణలో సరిగ్గా ఇదే జరిగింది.

ప్రస్తుతం భారత్ ఈ ఎస్-400 వ్యవస్థలను జమ్ముకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో తేలిగ్గా దాడులకు గురయ్యే సరిహద్దు ప్రాంతాల్లో మనదేశం మోహరించింది. వేగంగా కదలడం, ఇతర రక్షణ వ్యవస్థలతో తేలిగ్గా అనుసంధానమవడం దీని ప్రత్యేకత. పాకిస్తాన్‌కు చెందిన ఎయిర్ డిఫెన్స్ రాడార్లను ధ్వంసం చేసిన ఇజ్రాయిల్‌కు చెందిన 'హార్పీ' డ్రోన్లతో కూడా ఎస్-400 వ్యవస్థ తేలిగ్గా అనుసంధానం కావడం విశేషం. దీనివల్ల ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలో భారత్ తిరుగులేని ఆధిపత్యాన్ని సాధించింది. ముఖ్యంగా అతి క్లిష్టమైన, బహుళ ప్రవేశమార్గాల ద్వారా ఏకకాలంలో నిర్వహించిన దాడులను సమర్థవంతంగా నిరోధించ గలిగింది.

ఈ విధంగా ఎస్-400 మన గగతలాన్ని శత్రు దుర్భేద్యం చేయడమే కాదు, ప్రత్యర్థులు ముఖ్యంగా పాకిస్తాన్ మనోధైర్యాన్ని బలీయంగా దెబ్బతీసింది. గుర్తించడం, వెంటాడటం, ధ్వంసం చేయడం అనే దీనికున్న మూడు ప్రధాన లక్షణాల కారణంగా, పాకిస్తాన్ చేసిన ఎదురుదాడులన్నీ విఫలం కావడమే కాదు, భారత్ ఆధిపత్యం మరింత విస్పష్టంగా ప్రదర్శితమైంది. దీని ఫలితంగా యుద్ధ పరిణామం మొత్తం ఒకేసారి భారత్‌కు అనుకూలంగా మారింది. ఎస్-400 కారణంగా దక్షిణాసియాలో భారత్ మరింత పటిష్టమైన, శత్రు దుర్భేద్య దేశంగా రూపొందిందనే చెప్పాలి. ఈ యుద్ధం చైనాకు కూడా భారత్ సత్తా ఏంటో, తాను పాక్‌కు సరఫరా చేసిన రక్షణ వ్యవస్థలు ఎంత పనికిమాలినవో కూడా బాగా అర్థమైపుంటుంది. దీంతో రక్షణరంగంలో చైనా మార్కెట్లు కుప్పకూలే పరిస్థితి నెలకొంది. అంతేకాదు అమెరికా ఎఫ్-16 యుద్ధవిమానాన్ని కూడా మనదేశం కూల్చి వేయడంతో, మనవద్ద తయారవుతున్న రక్షణ పరికరాలు అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో పాటు, అత్యంత కచ్చితత్వంగా పనిచేస్తాయన్న సత్యం ప్రపంచానికి వెల్లడైంది. బహుశా రాబోయే కాలంలో మన రక్షణరంగ ఉత్పత్తుల మార్కెట్ మరింత విస్తరించే అవకాశాలూ లేకపోలేదు. ఒకరకంగా చెప్పాలంటే పాకిస్తాన్ మన నెత్తిన పాలు పోసింది.

– విఠల్

మే 22 హనుమజ్జయంతి సందర్భంగా

జీవనవేదం శ్రీమద్రామాయణ మహాకావ్యంలో భక్తుడిగా, భగవత్ స్వరూపుడిగా నిలిచిన అనర్ఘరత్నం హనుమ. రుద్ర, వాయు అంశలతో జన్మించడం వల్ల దైవశక్తి, మానవావతారుడు, ధర్మమూర్తి శ్రీరాముని సేవించడం వల్ల ధార్మిక నరశక్తి, జన్మతః వానరం కనుక జంతుశక్తితో మహా పరాక్రమశాలిగా ఎదిగిన సర్వ సమర్థుడు. సూర్య భగవానుడి శిష్యుడిగా చదువు నుంచి రావణ సంహారం, శ్రీసీతారామ పట్టాభిషేకం వరకు ఆయన పాత్ర అనన్య సామాన్యం. ఆరు కాండలతో విరాజిల్లే రామాయణంలో అయిదవది సుందరకాండలో మనసును రంజింప చేసే గుణసుందరుడు హనుమ. సీతాన్వేషణకు సముద్ర లంఘనం నుంచి లంకాపురి దహనం వరకు ఆయన వీరవిహారానికి ఇది నెలవులా కనిపిస్తుంది.

సర్వ సలక్షణ శోభితుడు హనుమ

శ్రీరామ కార్యసాధన కోసమే ఆంజనేయుడు రుద్రాంశతో వైశాఖ బహుళ దశమి నాడు అవతరించాడని శౌనక, పరాశర సంహితలు పేర్కొంటున్నాయి. త్రిపురాసుర సంహారంలో విష్ణువు అందించిన సహకారానికి కృతజ్ఞతగా శివుడే హనుమగా అవతరించాడని వానరగీత చెబుతోంది. ఆంజనేయుడు దాస్యభక్తికి ప్రథమోదాహరణ. రోమరోమంలో రామనామాన్ని లిఖించుకున్న భక్తితత్పరుడు. సీతారాములను హృదయ కవాటంలో నిలుపుకున్న స్వామిభక్తి పరాయణుడు. రామనామం వినిపించినచోట వినయాంజలితో నిలుచుండిపోతాడట. స్వయంగా హనుమద్రామాయణం రాశారు. 'రాముడికి చేటు కలిగిస్తే దేవాసురులను ఎవరిని వదలిపెట్టను' లంకలో హెచ్చరించడం స్వామిభక్తికి నిదర్శనం. ధర్మరక్షణకు, శరణార్థులను ఆదుకునేందుకు అవసరమైతే తన దైవాన్నే ఎదిరించగల ధీరుడు. అది ధర్మాగ్రహమే తప్ప ధిక్కారణ ధోరణి కాదని పెద్దలు చెబుతారు. అనితర కార్యసాధకుడు, పట్టుదలకు మారుపేరు. 'దేనికీ నిరాశ చెందరాదు. చేపట్టిన పని సఫలం కావడానికి ఆద్యంతమూ శక్తి మేరకు పాటుపడాలి. అవకాశాలు మూసుకుపోయినప్పుడు మరింత అప్రమత్తతో ప్రత్యామ్నాయం అన్వేషించాలి' అన్నది హనుమత్ సందేశం.

'హనుమ సంభాషణ తీరునుబట్టి ఆతను రుగ్వేద, యజుర్వేద, సామవేదాల్లో విద్వాంసుడని, నవవ్యాకరణాలను శ్రద్ధగా అధ్యయనం చేశాడని అనిపిస్తోంది. తన సుదీర్ఘ సంభాషణలో ఒక అపశబ్దం కూడా దొర్లలేదు. కంఠస్వరం శ్రావ్యం. మాట తీరు సంస్కారవంతం. ఇలాంటి మంత్రి లభించినప్పుడు రాచకార్యం సఫలం కాకుండా ఎలా ఉంటుంది?' హనుమను మొదటిసారి చూచిన రాముడు తమ్ముడు లక్ష్మణుడితో అన్నాడు. 'హనుమ గురించి వింటే శత్రువులు సయితం మెత్తబడకతప్పదు' అన్న రాముడి ప్రశంస లాంటిదే రావణుడి నోటి నుంచీ వెలువడింది. 'ఓ వానరా! వీరత్వంలో కొనియాడదగిన శత్రుడవు' అని ప్రశంసించాడు లంకేశ్వరుడు.

చిన్నపాటి సమస్యలకే ఆత్మహత్యలు/బలిదానాలకు పాల్పడే వారికి ఆంజనేయుడి ధీరత్వం స్ఫూర్తి దాయకం కావాలి. 'సీతమ్మ జాడ తీయలేని నేను బతికి ఉండి ఏం ప్రయోజనం' అని అనుకొని, అంతలోనే 'క్షణికావేశంలో తీసుకొనే నిర్ణయాలు విపరీత పరిణామాలకు దారితీస్తాయి. అందరి నమ్మకాలను వమ్ము చేసిన వాడిని అవుతాను' అనే ఆత్మపరిశీలనతో చేపట్టిన కార్యం విజయవంతంగా ముగించాడు. పతీవియోగం దుఃఖంతో ఆత్మాహుతికి సిద్ధపడిన సీతమ్మకు స్వానుభూతితో ధైర్యం చెబుతాడు.

హనుమ అమిత పరాక్రమశాలి అయినా ఏలిక కాదలచలేదు. సుగ్రీవునికి సచివుడిగా, రామబంటుగా ఉండేందుకే ఇష్టపడ్డాడు. అలా అత్యుత్తమంగా సేవలు అందించాడు. బాధ్యత గల వ్యక్తిగా అభిప్రాయాలు వ్యక్తం చేయడంలో, నిక్కచ్చిగా వ్యవహరించడంలో వెనుకాడలేదు. వాలి వధానంతరం పట్టాభిషిక్తుడైన సుగ్రీవుడు, సీతాన్వేషణ మాట మరచినప్పుడు 'ప్రభూ! రాముడి వల్ల మీకు రాజ్యం వచ్చింది. మిత్రుడికి సహకరించడంలో (మిత్రద్రోహం) జాప్యం తగదు. రాజు ధనాగారాన్ని కాపాడుకున్నట్లుగా మిత్ర సంపదను కాపాడుకుంటూ, ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. రాముడి నుంచి వర్తమానం, హెచ్చరికలు రాకముందే సీతాన్వేషణకు ఉపక్రమించండి' అని హితవు పలికాడు.

సర్వ విద్యా కోవిదుడు, భవిష్యద్బ్రహ్మత్వాన్ని సంపాదించిన మహా తవస్వి అయినప్పటికీ నిగర్వి. ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండడం ఆయన గొప్ప లక్షణం. 'వానరులలో నీవు తప్ప ఎవరు సముద్రాన్ని దాటి ఇలా లంకకు రాగలరు?' అని ప్రశ్నించిన జానకితో 'అమ్మా! నాతో సమానశక్తిగలవారే కాదు... నన్ను మించిన అమిత బలశాలారు వానర సమూహంలో ఉన్నారు. అందరి కంటే చిన్నవాడినైనా నన్ను నీ జాడ కోసం పంపారు' అని విన్నవించారు.

'హనుమను ఉత్తమ దూతకు నిదర్శనంగా చెబుతారు. దూతలను మూడు రకాలుగా విగడించుకుంటే..యజమాని అప్పగించిన పనిని నెరవేర్చకపోగా చెడగొట్టేవాడు మూడవ (అధమ) కోవకు చెందిన వారు కాగా, అప్పగించిన పనిని నెరవేర్చేవారు రెండవ (మధ్యమ) శ్రేణికి చెందినవారు. స్వీకరించిన బాధ్యతలను పరిపూర్ణంగా నిర్వర్తిస్తూనే, మెరుగైన ఫలితాలు సాధించేందుకు సందర్భానుగుణంగా నిర్ణయాలు తీసుకొనేవారు ప్రథమ (ఉత్తమ) శ్రేణికి చెందిన వారుగా చెబుతారు. సీతమ్మ జాడ నెపంతో లంకలోని అనుపానులు తెలుసుకొని మరీ వచ్చాడు.

తులసీదాస్ రచించిన 'హనుమాన్ చాలీసా' హిందూ బంధువులకు నిత్య పారాయణ స్తోత్రం. 'జ్ఞానగుణాలకు సాగరంలాంటి హనుమకు జయం. ముల్లోకాలను ఉజ్జ్వలింప చేసే కపిరాజుకు జయం' అంటూ 'చాలీసా' ప్రారంభించాడు. సర్వసలక్షణ సమన్వితుడైన పావనిని 'అన్నిటా నేరువరి హనుమంతుడు/పిన్ననాడె రవినంటె పెద్ద హనుమంతుడు','ఒక్కడే ఏకాంగ వీరుడుర్వికి దైవమౌనా/ యెక్కడా హనుమంతుని కెదురు లోకము'అని పదకవితా పితామహుడు అన్నమాచార్య అర్చించారు.

డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి
వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

సిందూర్ ప్ర

ఆపరేషన్ సిందూర్ పాక్ ఉగ్రవాద గుండెల్లో ప్రచండ యుద్ధభేరి. కల్నల్ సోఫియా, వింగ్ కమాండర్ వ్యోమిక, భారత నరనారీ హృదయ మందిరాల్లో కొలువు దీరిన ధీరనారీమణులు. వీర శూరత్వాల్లో ఇద్దరూ ఇద్దరే! సమర చరిత్రలో ప్రత్యక్ష నాయికలు. ఆడపిల్ల నుదుటి సిందూరాన్ని పరమ కర్కశంగా తుడిచేసిన హింసోన్మాదాన్ని అంతే భీకరంగా అంతం చేస్తామని నిరూపిస్తున్న అత్యంత సాహసోపేత సంగ్రామ శక్తి వీరిద్దరిదీ. అందుకే – భరతమాత ముద్దు బిడ్డలనీ, తుపాకిస్థాన్ పాలిటి యమదూతలనీ ఒక్క భారత్ మాత్రమే కాదు..నిఖిల ప్రపంచమూ అక్షరాభిషేకం చేస్తోంది. మనసా వాచా కర్మణా శాంతిని కోరుకునే ప్రతి దేశమూ ఈ ఇద్దరినీ ఒక్కరిగానే పరిగణిస్తోంది. 'ధైర్యసాహసాలు'గా నామకరణం చేసేసింది. నాటికీ, నేటికీ అనుసంధాన ధీరత.ముష్కర మూక పని పట్టాల్సి వస్తే – అతివలది సూర్యప్రతాపం. చూపు అగ్నిజ్వాల. నరకాసుర వధ ఘట్టంలో... వాడి సేనమీద విరుచుకు పడింది దివ్య అస్త్రం. పేరు 'శతఘ్ని! సుదర్శన చక్ర ఆయుధ ప్రయోగమూ అప్పుడే. సంధానిస్తే – ఈ ఇద్దరు అతివల్లో (సోఫియా, వ్యోమిక) ఒకరు శతఘ్ని. మరొకరు సుదర్శన చక్ర విశేషం.

'సిందూరం తుడిచేసిన దురాగత వాదాన్ని ఉక్కుపాదంతో తొక్కిపెట్టాం. మన సాయుధ సేన గర్జన పాక్ సైనిక ప్రధాన కార్యాలయం ఉన్న రావల్పిండినే వణికించింది. ఎంతో కచ్చితత్వంతో లక్ష్య సాధన పూర్తిచేసింది మన వాయుసేన. శత్రు యుద్ధ విమానాల కూల్చివేత, స్థావరాల పేల్చివేత తిరుగులేని విధంగా సాగింది' అని ప్రకటించింది భారత ప్రభుత్వం. 'ఉగ్రవాదం మీద భారీ పోరులో తొలి నుంచీ వ్యూహాత్మక రీతినే అనుసరించాం. ఉగ్రవాదులతోపాటు భారత వ్యతిరేక శక్తుల అంతు చూసేదాకా ఇదే ఏకైక విధానం' అనడంలో మహా సంకల్ప దీక్ష. పాకిస్థాన్, దాని ఆక్రమిత కశ్మీరులోని ఉగ్రవాద 'శిక్షణ' శిబిరాల జాబితాను భారత ప్రభుత్వం, సాయుధ దళ బృంద నాయకత్వం బయట పెట్టింది. మనం మెరుపు వేగంతో దాడులు చేపట్టిన స్థావరాల వివరాలనూ వెల్లడిచేసింది. కేవలం పాతిక నిమిషాల్లో అంతా సంపూర్తి చేశామంది.

ఆ సమాచార వెల్లడింపు కర్త సోఫియా!

'పాకిస్తాన్‌లోని సైనిక స్థావరాలు, అక్కడి పౌరుల మౌలిక సదుపాయాల మీద చర్యలు కాదు మా ఉద్దేశం. ఉగ్రవాదాన్ని నిర్మూలించడమే మా ఏకైక లక్ష్యం' అని వ్యోమిక విస్పష్టంగా ప్రకటించారు.

పాకిస్తాన్ తన పౌరవిమానాలను రక్షణ కవచాలుగా వాడుకుంటోందని భారత విదేశాంగ శాఖ కార్యదర్శి వెల్లడించారు. మన పర్యాటక ప్రదేశాలు, ప్రార్థనా మందిరాలపైన కన్నేసిందని అందరి దృష్టికీ తెచ్చారు. ఇదంతా జరుగుతున్నపుడు ఆ సూపర్ సీనియర్ ఉన్నతాధికారి విక్రమ్ ఇరు వైపుల ఉండి సమాచార, ప్రచార, ప్రసార సాధనాల ముందు మెరుపులు మెరిపించారు మహిళా సైనిక మహోన్నత అధికారిణులు.

కల్నల్ సోఫియా ఖురేషి స్వస్థలం ఉత్తరప్రదేశ్ రాజధాని లఖ్‌నవూ (లక్నో). తండ్రి సివిల్ ఇంజినీరు, తల్లి విశ్వవిద్యాలయ అధ్యాపకురాలు. సోఫియా పాఠశాల చదువు సొంత ఊర్లోనే. కాన్పూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో పట్టభద్రత. మిలిటరీ కమ్యూనికేషన్స్‌లో నిపుణత, సైబర్ వార్ ఫేర్‌కి సంబంధించి ఎంతో ప్రావీణ్యత గడించారు.

సైన్యం పరంగా సాంకేతిక సామర్థ్యాల వినియోగంలో సోఫియాకు పూర్తి పట్టు ఉంది. ఆధునికీకరణ ప్రక్రియను ఏ మేర ప్రయోజనకరంగా మలచుకోవాలో సంపూర్ణ అవగాహనా ఉంది. నేషనల్ డిఫెన్స్ కాలేజీలో అతిథి అధ్యాపకురాలిగా మరెంతో అనుభవం. ఐక్యరాజ్యసమితి శాంతిపరిరక్షణ వ్యవస్థలో సమస్త భారతీయ బృందానికీ నాయకత్వం వహించారు. సోఫియా మెట్టినిల్లు కర్ణాటకలోని కొన్నూరు. భర్త తాజుద్దీన్ కల్నల్. ఆ కుటుంబానికి గుజరాత్‌లోని వడోదరతో బాంధవ్యముంది. జమ్మూప్రాంతంలో విధులు నిర్వర్తించే భాగంగా ఝాన్సీ పరిసరాల్లో తాజుద్దీన్‌తో పరిచయమై, పరిణయంగా మారింది. ఆ జంట జమ్ము కశ్మీర్‌తోపాటు పంజాబ్,

సోఫియా

తమిళనాడు ప్రాంతాల్లోనూ సేవలు అందించింది.

నిజానికి సోఫియా విజయపరంపర ఐదేళ్ల క్రితమే అభివ్యక్తమైంది. అప్పట్లోనూ ఆమె పేరు ఆ సందర్భాన్ని అనుసరించి మారుమ్రోగింది. సైనిక రంగానికి సంబంధించి, వనితలకు కూడా శాశ్వత కమిషన్ సదవకాశం కలిగించాలన్నది ఆమె విజ్ఞాపన. అది మహిళా సైనికాధికారులు పరమోన్నత న్యాయస్థానం తలుపులు తట్టేలా చేసింది. ఆమె సేవలను, ఆమె విన్నపాలను పరిశీలించిన న్యాయస్థానం... అతివలూ ఆర్మీలో పర్మినెంట్ కమిషన్‌కు అర్హులని తేల్చి చెప్పింది. అంతకుముందు వరకు ఉండిన పరిస్థితి వేరు. మార్పు తెచ్చింది ఆమే!

సేవాదళంలో అధికారిణుల సేవలను ఎక్కువగా షార్ట్ సర్వీస్ కమిషన్‌కే పరిమితం చేస్తుండేవారు. అదేమంటే – వారి శారీరక స్వభావరీతులను, సామాజిక

యోగంలో ధీరవనితలు

జీవన వాతావరణ స్థితిగతులను కారణంగా చెప్తుండేవారు. ఆ వాదనలు సరికాదని 'సుప్రీం' ప్రస్ఫుటం చేసింది. గతంలో ఏర్పాటైన మల్టినేషనల్ మిలిటరీ ఎక్సర్‌సైజ్‌లోని భారతదళానికి అప్పటి లెఫ్టినెంట్ (ఆర్మీ సిగ్నల్ కోల్)గా సోఫియా నాయకత్వం వహించడాన్ని ప్రస్తావించింది. అంటే – నాడు భారతీయ ముదితగా అంతటి బాధ్యతను స్వీకరించిన మొదటి వ్యక్తి ఆమే నన్న మాట.

ఐక్యరాజ్య సమితి (ఐరాస)శాంతి సంఘంలో విధులను సర్వసమర్థంగా నిర్వహించిన నాయకురాలు కూడా సోఫియానే! ప్రధానంగా కాంగోలో ఆమె పని తీరు ఎందరి ప్రశంసలనో అందుకుంది.

విమానదళం ఫ్లయింగ్ బ్రాంచ్ హెలికాప్టర్ పైలట్‌గా విశిష్ట అనుభవశీలి వ్యోమికా సింగ్. పాఠశాల, కళాశాల స్థాయుల్లో ఎన్‌సీసీ కేడెట్‌గా అనేకానేక ప్రయోగాలకు ఆద్యురాలు. భాగ్యనగరం దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ – అకాడమీలో సమగ్ర శిక్షణ అందుకుంది. ఇరవై ఏళ్ల నాడే పైలట్‌గా నియామకం. చేతక్, చీతా తరహా హెలికాప్టర్లను దీటుగా నడిపి కీర్తిని ఆర్జించారు. వేల గంటలు విమానాలు నడిపారు. ఏ మారుమూల వైమానిక సదుపాయం అవసరమైనా 'నేనున్నా' అంటూ ముందు నిలిచారామె. దరిదాపు ఐదేళ్ల కిందట అరుణాచలప్రదేశ్‌లో ప్రత్యేక బాధ్యత చేపట్టి 'భళీ' అనిపించుకున్నారు.

ఆజాదీకా అమృత్ మహోత్సవాలు నిత్యస్మరణీయాలు. హిమాచలప్రదేశ్‌లోని కీలక పర్వతం మౌంట్ మణిరంగ యాత్రలో ముఖ్యభూమిక వ్యోమికాదే! ఇరవై వేలకు పైగా అడుగుల ఎత్తు గల పర్వతంపైకి నాలుగేళ్ల క్రితం త్రివిధ దళాల మహిళా పర్వతారోహకుల యాత్రా ప్రక్రియ ప్రారంభమైంది. అది పలు సవాళ్లతో నిండిన సాహసపర్వం. అది చీఫ్ ఆఫ్ ఎయిర్‌స్టాఫ్ గుర్తించి ప్రశంసించిన సందర్భం.

వ్యోమికా కుటుంబీకుల్లో ఎవరికీ సాయుధ దళ నిర్వహణ అనుభవం లేదు. ఉత్సాహం, దీక్ష, పట్టుదల – ఈ త్రివిధ ఆయుధాలతోనే ముందుకు చొచ్చుకొచ్చిన సాహసికురాలు ఆమె. పాఠశాల చదువు మొత్తం దేశ రాజధానిలోని విద్యాలయంలో సాగింది. అనంతర కాలంలో పరిశోధన, ప్రయోగాలతో కొనసాగిందామె విద్యాభ్యాసం.ఇద్దరు సోదరీమణులున్నారు ఆమెకు. వారిలో ఒకరు భారత విమానదళంలోని అధికారిని ఏరికోరి వివాహం చేసుకున్నారు. దేశభక్త భావన అణువణువునా ఉండటమన్నది వ్యోమికా సహజసిద్ధ లక్షణం.

పైలట్ కావాలన్నది వ్యోమికా తీరిన కల. 2019లో ఫ్లయింగ్ బ్యాచ్ పరంగా శాశ్వత కమిషన్ హోదా ఆమె వశమైంది. ఆధునిక ఆయుధ వ్యవస్థను రూపొందించి పరిరక్షించడంలో తనకు తానే సాటి.

నవ వధువు పండంటి జీవితాన్ని కుప్పకూల్చిన పాక్ ఉగ్రవాదం భరతం పట్టే పని గురించి... నిత్య నవీన సమధికోత్సాహ ప్రతీకలైన ఇద్దరు నారీమణులు మాటల తూటాలు పేల్చారు. వారిలోని వింగ్ కమాండర్ వ్యోమికా ప్రతీ అక్షరం ధాటిని ప్రతిఫలించింది. బాల్యం నుంచే తనది ఢీకొనే తత్వం!

ఆమె తల్లిదండ్రుల మాటల్లో .... 'చదువులు, ఆటలు, పాటలు, పోటీలు అన్నిట్లోనూ ముందున నిలిచేది వ్యోమికా. పోటీ తత్వంతో ముందడుగు వేస్తూ ఎప్పటికప్పుడు సవాల్ విసురుతుండేది. ఆత్మవిశ్వాసానికి అర్థం ఆమె నుంచే తెలుసుకోవాలి ఎవరైనా!'

ఆ అన్నీ ఇప్పటికీ వ్యోమికాకు వర్తిస్తాయి. ఎప్పుడూ ముందే ఉండటం, పోరాడి గెలవాలన్న ఉక్కు సంకల్పం, ఎటువంటి స్థితి ఎదురైనా అదరని బెదరని నైజం. ఇన్ని విలక్షణతలు ఉన్న అతివ– సాటి వనితాలోకానికి ప్రేరణ కాక ఇంకేమవుతుంది?

ధీరవనితా! సాహస అతివా!
మీ గాథలే స్ఫూర్తి చరితలు.
సోఫియా! వ్యోమికా!
భారత విక్రమత్వానికి ప్రతీకలు మీరే
ముష్కర సంహారకాండకు సమర ధ్యానం మీదే!
జాతికి మీతో ఘనత
జయజయహో భారతమాతా!

జంధ్యాల శరత్‌బాబు
సీనియర్ జర్నలిస్ట్

ముఖ్యమంత్రి అంటే రాష్ట్రానికి దశ, దిశ. పాలనా పగ్గాలు చేపట్టడం అంటే కత్తి మీద సాము. రాష్ట్ర ప్రగతి, రాష్ట్ర ప్రజల సంక్షేమం ముఖ్యమంత్రి బాధ్యత. వ్యక్తిగత జీవితం, వ్యక్తిగత ఆలోచనలు, వ్యక్తిగత స్వభావం వేరు. కానీ, ముఖ్యమంత్రిగా ఒక నాయకుడి హావభావాల మొదలు వ్యాఖ్యలు, వ్యవహారశైలి... రాష్ట్రంపై ప్రభావం చూపుతాయి.రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడుపుతూనే... ప్రజల యోగక్షేమాలు చూడాలి. లేనిపోని భయాలు సృష్టించకుండా.. అవసరమైతే సమాజంలో ధైర్యాన్ని, భరోసాను నింపే ప్రయత్నం చేయాలి.

రేవంత్ 'ఆర్థిక' ప్రకటన

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటలను రాజకీయ, ఉద్యోగవర్గాల్లో దుమారం రేపాయి. ఆయనకు రాజనీతిజ్ఞత కొరవడినట్లు కనిపిస్తోందని విమర్శలు వస్తున్నాయి. 'అత్తమీద కోపం దుత్తమీద' అన్నట్లుగా ఆయన వ్యవహారం ఉందని విశ్లేషణలు సాగుతున్నాయి. ప్రధానంగా గత ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కే ప్రయత్నం ప్రజాపాలనను అయోమయంలో పడేసేలా మారుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రేవంత్ రెడ్డి గత కొంత కాలంగా బహిరంగ సభల్లో, అధికారిక సమావేశాల్లో చేస్తున్న వ్యాఖ్యలు, ప్రకటిస్తున్న అభిప్రాయాలు వివాదాలకు కేంద్రబిందువులుగా మారుతున్నాయి.అవి అటు అధికారవర్గాల్లో అసంతృప్తికి కారణమవుతుండగా.. ఇటు.. ప్రజల్లోనూ భయం రేకెత్తించేలా ఉన్నాయని ఆరోపణలు వస్తున్నాయి..

ముఖ్యమంత్రి ఇంతకు మునుపు ఐఏఎస్ అధికారులపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. అధికారులెవరూ ప్రభుత్వ పెద్దలకు సహకరించడం లేదని, ముఖ్యమంత్రిని అయిన తనకు, మంత్రిమర్గ సహచరులకు కూడా సహాయ నిరాకరణ చేస్తున్నారన్న ధోరణిలో ఆయన బహిరంగంగానే వ్యాఖ్యానించారు. ప్రభుత్వాన్ని, అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేసుకొంటూ పాలన సాగించాల్సిన ముఖ్యమంత్రి అధికారుల సమావేశాల్లో కూడా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం అప్పట్లో తీవ్ర కలకలం సృష్టించింది. అవి అధికార వర్గాలను విస్తుపోయేలా చేయడంతో పాటు.. ప్రజల్లోనూ సందిగ్ధం లేవనెత్తింది.

ఇక, ఇటీవల రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగంగా చేసిన వ్యాఖ్యలు మరింత ప్రకంపనలు సృష్టించాయి. ప్రభుత్వ ఉద్యోగుల్లో ఆగ్రహావేశాలకు కారణమయ్యాయి. అన్ని రాజకీయ పార్టీలూ ముప్పేట దాడి చేసేందుకు దారితీశాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దివాళా తీసిందన్న స్థాయిలో ఆయన అన్ని వర్గాల నుంచి ఆగ్రహానికి ఊతమిచ్చాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వెల్లడించే క్రమంలో ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ పార్టీలు చెరోవైపు ముఖ్యమంత్రి లక్ష్యంగా చేసుకొని దాడికి దిగాయి.

రాష్ట్రంలో ఉద్యోగ సంఘాలు రోడ్డెక్కాయి. జీతాలు ఆలస్యం అవుతుండటం, కరవు భత్యాల చెల్లింపులో జాప్యం, పింఛన్ బకాయిలు పేరుకు పోవడంతో /ఆ సంఘాలు పోరుబాటను ఎంచుకున్నాయి. ఇక సమరమే.. అని ప్రకటనలు చేశాయి. దీంతో, ముఖ్యమంత్రి ఘాటుగా స్పందించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని, ఉద్యోగుల అవిధేయతను ప్రస్తావిస్తూ.. ఈ సమరం ప్రభుత్వంపై కాదని, ప్రజలపై చేస్తున్నదిగా భావించాల్సి వస్తుందన్నారు. "నన్ను కోసినా ఈ రాష్ట్రానికి రూ. 18,500 కోట్లకంటే ఎక్కువ ఆదాయం లేదు. కానీ ఖర్చులకు మాత్రం రూ. 22,500 కోట్లు కావాలి. ఇప్పుడు చెప్పండి. ఏ పథకం ఆపాలి? బోనస్ తీసుకుందామా? విద్యుత్ సబ్సిడీ తీసివేయాలా? వంద రూపాయల పెట్రోల్ రెండు వందలుగా మారిందంటే ఊహించగలరా? ఏం చేద్దాం చెప్పండి..." అంటూ ఆవేశంగా స్పందించారు. 'ఈ స్థితిలో ధర్నాలు, దీక్షలు చేస్తే ఉన్న ప్రభుత్వ వ్యవస్థ కుప్పకూలిపోతుంది. రాష్ట్రం దివాలా తీస్తుంది. అప్పు కూడా పుట్టట్లేదు. ఢిల్లీలో అపాయింట్‌మెంట్ కోరితే కూడా ఇవ్వట్లేదు. దేశం ముందు తెలంగాణ పరిస్థితి

'కార్టూన్ పోటీ-2025'లో సాధారణ ప్రచురణకు ఎంపికైనది

పై దుమారం

"నన్ను కోసినా ఈ రాష్ట్రానికి రూ. 18,500 కోట్లకంటే ఎక్కువ ఆదాయం లేదు. కానీ ఖర్చులకు మాత్రం రూ. 22,500 కోట్లు కావాలి. ఇప్పుడు చెప్పండి. ఏ పథకం ఆపాలి? బోనస్ తీసుకుందామా? విద్యుత్ సబ్సిడీ తీసివేయాలా? వంద రూపాయల పెట్రోల్ రెండు వందలుగా మారిందంటే ఊహించగలరా? ఏం చేద్దాం చెప్పండి..."

హీనంగా తయారైంది' అని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం దివాళా తీసిందన్న వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఆ వ్యాఖ్యలపై ప్రభుత్వ ఉద్యోగులకు తోడు.. బీఆర్ఎస్, బీజేపీలు స్పందించాయి. దీంతో రాష్ట్రంలో 'పొలిటికల్ వార్' మొదలయ్యింది. రేవంత్ రెడ్డికి పాలన చేతకాకపోతే సీఎం పదవికి రేవంత్ రాజీనామా చేయాలని మూకుమ్మడిగా డిమాండ్ చేశాయి.

బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల పాలనను విమర్శిస్తూ అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు తమకు అదే పరిస్థితి ఎదురుకావడంతో ఉద్యోగులను, ప్రజలను తప్పుబట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఉద్యోగుల జీతాలు ఆలస్యం అవుతున్నాయని, పెన్షన్ బకాయిలు చెల్లించాలంటూ చేసే పోరాటాన్ని 'ప్రజలపై యుద్ధం'గా చిత్రించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

సీఎం చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు తీవ్ర స్థాయిలో విమర్శలు ఎక్కుపెట్టారు. 'కుటుంబ పెద్ద చేతులెత్తేస్తే కుటుంబం పరిస్థితేంటి? ప్రజలకు ధైర్యం చెప్పాల్సింది పోయి అధైర్యం నింపుతారా? రూ. 7 లక్షల కోట్లు అప్పు ఉందని ఎన్నికలకు ముందే తెలుసు కదా?"అని కేంద్ర మంత్రి బండి సంజయ్ నిలదీశారు. రేవంత్ వ్యాఖ్యలతో రాష్ట్రం పరువు పోయిందని, ఆయన ముఖ్యమంత్రి పదవికి అనర్హుడని వ్యాఖ్యానించారు.

దివాళా తీసింది తెలంగాణ కాదని, కాంగ్రెస్ పార్టీ అని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నెలకు దాదాపు రూ. 20 వేల కోట్ల ఆదాయం వస్తుంటే.. దివాళా తీసిందని ఎలా అంటారని మండిపడ్డారు. తెలంగాణ ఎన్నడూ పేద రాష్ట్రం కాదని, ఇప్పటికీ దేశంలోనే రాష్ట్రమని ఆయన అన్నారు. హామీలు ఇచ్చినప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియదా? అంటూ ప్రశ్నించారు.

బీజేపీ మరో ఎంపీ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ,'గద్దెనెక్కిన తర్వాత సమ్మెలు వద్దు, ఆందోళనలు చేయొద్దు అనడం ఎలా?' అన్నారు. హామీలు ఇచ్చేముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియదా? అని ప్రశ్నించారు. ఆచరణ సాధ్యం కానీ హామీలతో ప్రజలను మోసగించారని, అధికారంలోకి వచ్చాక ఆర్థిక పరిస్థితిని సాకుగా చూపుతున్నారని, బాధ్యతారాహిత్యానికి నిదర్శని మండిపడ్డారు.

అటు బీఆర్ఎస్... ఈ పరిస్థితులను ప్రధానంగా తనకు అనుకూలంగా మలచుకోవడానికి సిద్ధమవుతోంది. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటినుంచీ అబద్ధాలు చెబుతున్నారని, ప్రజల ముందు ఉద్యోగులను విలన్లుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆ పార్టీ విమర్శించింది. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన వాటినే ఉద్యోగులు అడుగుతున్నారని బీఆర్ఎస్ నేత కె.తారక రామారావు అన్నారు. ఎన్జీఓల త్యాగాలతోనే తెలంగాణ వచ్చిందని, ఆ సంగతి రేవంత్‌రెడ్డికి తెలియదని అన్నారు. వేల మంది త్యాగాలతో ఏర్పడిన తెలంగాణను అవమానించే విధంగా రేవంత్ మాట్లాడుతున్నారని, పరిపాలన చేతకాక కాడి పడేశాడని విమర్శించారు. రాష్ట్రానికి తండ్రిలాంటి ముఖ్యమంత్రే సొంత రాష్ట్రానికి శాపాలు పెట్టడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఉద్యోగులకు 73 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీలో నాయకత్వ లోపం తెలంగాణకు శాపమన్నారు. 'ఎక్కడైనా దొంగను దొంగే అంటారు. దొంగ అని తెలిసినా కూడా పార్టీలోకి తీసుకొని సీఎం చేసిన దిక్కుమాలిన పార్టీ కాంగ్రెస్' వ్యక్తిగతం విమర్శలకు దిగారు. రేవంత్‌కు ఒక్క క్షణం కూడా ముఖ్యమంత్రిగా ఉండే అర్హత లేదని, ఆయన రాజీనామా చేసి రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి ఎటువంటి ఢోకా లేదని, ఆయనకే పాలన చేతకావట్లేదనేది ఆయన మాటలు స్పష్టం చేస్తున్నాయని విమర్శలు చేశారు. విపక్షాల విమర్శలకు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రంగా స్పందిస్తూ, రాష్ట్ర ప్రజలకు వాస్తవాలు తెలియాలన్నదే తమ ఆలోచన అని స్పష్టం చేశారు. అప్పుల విషయంలో నిజాలను ప్రజలకు కాకపోతే ఇంకెవరికి చెప్పాలని ప్రశ్నించారు. అప్పులపై వాస్తవాలను అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క లెక్కలతో సహా చెబితే.. గుండాగిరీ చేస్తూ తప్పును ఒప్పు చేయాలని బీఆర్ఎస్ ప్రయత్నించింది వాస్తవం కాదా? అని అడిగారు.

తాము అధికారంలోకి రాక ముందు రాష్ట్రానికి రూ. 3 లక్షల కోట్లు అప్పు ఉందని అనుకున్నామని, తీరా చూస్తే అది రూ. 8 లక్షల కోట్లు అని తేలిందని చెప్పారు. అయినప్పటికీ 15 నెలల పాలనలో సంక్షేమ పథకాలను ఆపలేదని అన్నారు. 'అప్పుల కింద ప్రతి నెలా దాదాపు రూ. 6,500 కోట్లు చెల్లిస్తున్నాం. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదలకు సన్న బియ్యం ఇస్తున్నాం. నిరుపేదలకు ఇళ్లు, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నాం. షో పాలిటిక్స్ చేయడం ఇందిరమ్మ ప్రభుత్వానికి తెలియదన్నారు.

అయితే, ఈ మొత్తం ఎపిసోడ్‌లో ఒక్క విషయం మాత్రం తేలింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇలా తయారు కావడానికి కారణం బీఆర్ఎస్ అని ఎస్టాబ్లిష్ చేసే ప్రయత్నంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే బూమరాంగ్ అయ్యిందన్న వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. ఈ అంశంలో మాత్రం ప్లానింగ్ కరువై సీఎం రేవంత్ క్లీన్‌బౌల్డ్ అయ్యారంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

సుజాత గోపగోని,
సీనియర్ జర్నలిస్ట్, 6302164068

ప్రధానమంత్రి జనౌషధి కేంద్రాల గురించి సరైన ప్రచారం లేకపోవడం, ఈ కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో సాధారణ, పేద ప్రజలు ఉపయోగించుకోలేకపోతున్నారు. ఫలితంగా మందులను అధిక ధరలకు కొనుగోలు చేయవలసి వస్తోంది. జనరిక్ మందులు ప్రైవేటు దుకాణాల్లో లభిస్తున్నా వాటిపై ముద్రించే ధరలకు, విక్రయ ధరల్లో వ్యత్యాసంతో ప్రజలు ఈ మందుల నాణ్యతను విశ్వసించడం లేదు. ఇలాంటి సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసినవే పీఎం జనౌషధి కేంద్రాలు.

పీఎం జనౌ కేంద్రాలకు

కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు నాణ్యమైన జనరిక్ మందులను తయారుచేసి వీలైనంత తక్కువ ధరకు పీఎం జనౌషధ కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఔషధ విక్రయ కేంద్రాలను 2015లోనే ప్రారంభించింది. వాటిలో ప్రస్తుతం 2 వేల రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. అయినా రాష్ట్ర ప్రభుత్వాలు వాటి గురించి సరిగా ప్రచారం చేయకపోవడంతో ఫలితం చేకూర లేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాగానే అన్ని ప్రభుత్వాసుపత్రుల్లోనూ పీఎం జనౌషధి దుకాణాలు అందుబాటులోకి తేవాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశాలిచ్చారు.

జనరిక్ మందులు అంటే?

ఒక కొత్త మందును కనుగొనడానికి ఫార్మా కంపెనీలు చాలా పరిశోధనలు చేస్తాయి. కొన్నేళ్ల పాటూ క్లినికల్ ట్రయల్స్ నిర్వహిస్తాయి. అన్ని పరీక్షలు పూర్తయ్యాక వాటిని మార్కెట్లోకి ప్రవేశపెడతాయి. అవే బ్రాండెడ్ మందులు. ఆ మందు తయారీపై, ఆ ఫార్మా కంపెనీకి ఇరవైఏళ్ల పాటూ పేటెంట్ హక్కులు ఉంటాయి. ఆ సమయంలో వేరే వాళ్లు ఆ మందును అదే ఫార్ములాతో తయారుచేయకూడదు. ఆ మందు తయారీలో చాలా ఖర్చు పెట్టామని సదరు కంపెనీ వాదిస్తుంది. ఆ సొమ్మును రాబట్టుకోవాలంటే ఆ మందును తాము మాత్రమే అమ్మాలని భావిస్తుంది. అందుకే ప్రభుత్వాలు కూడా పేటెంట్ పేరుతో ఆ హక్కును సదరు కంపెనీకే ఇస్తాయి. ఇరవై ఏళ్ల తరువాత అదే ఫార్ములాతో ఎవరైనా ఆ మందును తయారు చేయవచ్చు. వాటిని జనరిక్ మందుల షాపుల్లో తక్కువ ధరకే అమ్ముతారు. కాకపోతే దీనిపై ఎలాంటి బ్రాండ్ నేమ్ ఉండదు. ఇలా వేరే ఫార్మా సంస్థల ఫార్ములాతో మందును తయారు చేసి పేదలకు తక్కువ ధరకు అమ్మే వాటిని జనరిక్ మందులు అంటారు. సిప్లా, ఎస్ఆర్, రెడ్డీస్... ఇవన్నీ బ్రాండెడ్ మందుల సంస్థలు. మనదేశంలో అమ్మేవి 80 శాతం బ్రాండెడ్ జనరిక్ మందులే. చాలా మంది వీటినే నమ్ముతారు. ఫార్మా సంస్థలు తమ సేల్స్‌మెన్లను వైద్యులు, ఆసుపత్రుల వద్దకు పంపించి బాగా ప్రమోషన్లు చేయిస్తారు. దాంతో వైద్యులు బ్రాండెడ్ మందులనే రోగులకు రాసిస్తారు.

జనరిక్, బ్రాండెడ్ మందుల ఫార్ములాలు ఒకటే కాబట్టి నిజానికి జనరిక్ మందులు కూడా చక్కగా పనిచేస్తాయి. డోలో 650 ఎంజీ ఇప్పుడు బాగా అమ్ముడవుతోన్న ఔషధం. దీని ధర పది మాత్రలు రూ.30 అనుకుందాం. అదే జనరిక్ మెడికల్ షాపుల్లో ఈ పారాసెటమాల్ ధర రూ.15. కానీ దీన్ని కొనేవారు ఎంతమంది? జనరిక్ మందులు కూడా బ్రాండెడ్ మందులతో సమానంగా పనిచేస్తాయి.

విశ్వసనీయత ఏది?

అయిదారేళ్లుగా కొన్ని ప్రైవేటు దుకాణాల్లో జనరిక్ మందులు అమ్ముతున్నారు. వాటిపైగల గరిష్ట అమ్మకం ధరకు, వారు అమ్మేధరల మధ్య వ్యత్యాసం వినియోగదారులకు విశ్వసనీయతను కలిగించడం లేదు. ఉదాహరణకు 10 మాత్రలు గల షీట్ ధర రూ.100 ఎంఆర్‌పీ ముద్రించి ఉంటుంది. అదే మందు ఒక జనరిక్ దుకాణంలో రూ.50, మరో జనరిక్ దుకాణంలో రూ.60 అమ్ముతారు. గ్రామీణ ప్రాంతాలు, మురికివాడల్లోని ఆర్ఎంపీలు (గరిష్ట చిల్లర ధర) వీటిని మరికాస్త ఎక్కువ ధరకే అమ్ముతారు. వాస్తవ ధర దానిపై ఉండదు. పైగా ఎప్పుడూ వినని పేర్లతో ఈ మందులను తయారు చేసే సంస్థల పేర్లు కనిపిస్తాయి. అందువల్ల వీటిపై ప్రజలకు విశ్వసనీయత కొరవడింది. వీటి పనితనంపై చాలా మంది అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లోనూ అధిక ధరలు

ప్రస్తుతం రాష్ట్రంలో 16 ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో 23 జనరిక్ దుకాణాలను స్వయం సహాయక బృందాలు, ఇతర సంఘాలు, ప్రైవేట్ వ్యక్తులు నడుపుతున్నారు. వీరు జనరిక్ ఔషధాల ధరల నిర్ణాయక విధానంలోని లొసుగులను ఉపయోగించుకుంటూ రోగులను దోపిడీ చేస్తున్నారు. ఈ వ్యవస్థపై తగిన నియంత్రణ లేకపోవటం వారికి అనుకూలంగా మారింది. జనరిక్ ఔషధాల తయారీదారులు తమ ఉత్పత్తులపై అధిక ఎంఆర్పీని ముద్రించి సరఫరా చేయడాన్ని అమ్మకందారులు సొంత ప్రయోజనాలకు వాడుకుంటున్నారు. దీంతో రిటైలర్లు వివిధ మందులపై ఇష్టానుసారం డిస్కౌంట్లను అందిస్తున్నారు. ఈ ప్రక్రియలో వారు 50 శాతం నుండి 60 శాతం వరకు లాభాలను ఆర్జిస్తున్నారు. అంతేకాక వారు అవసరమైన జనరిక్ ఔషధాలలో కేవలం 30 శాతం నుండి 40 శాతం వరకు మాత్రమే అందుబాటులో ఉంచుతున్నారు. అధిక లాభార్జనను నిరోధించడంతో పాటు ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల అమ్మకాలను నిరోధించే తప్పనిసరి బిల్లింగ్ వ్యవస్థ అమలులో లేదు. అటువంటి జనరిక్ ఔషధాల నాణ్యత విషయంలో నియంత్రణ లేకపో

ప్రభుత్వ ఆస్పత్రులకొచ్చే రోగుల ప్రయోజనార్థం నాణ్యమైన జనరిక్ మందులను అతి తక్కువ ధరలకే అందించడానికి అన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రుల్లో జన ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణ యించింది. ఈమేరకు వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వాస్పత్రుల్లో జనరిక్ మందులు షాపుల్ని నిర్వహించడానికి లాభాపేక్షలేని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు.

ఔషధి ప్రోత్సాహం

వటం కూడా ఆందోళన కలిగించే మరో అంశం.

జనౌషధి కేంద్రాల ఏర్పాటు నిర్ణయం

ప్రభుత్వ ఆస్పత్రులకొచ్చే రోగుల ప్రయోజనార్థం నాణ్యమైన జనరిక్ మందులను అతి తక్కువ ధరలకే అందించడానికి అన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రుల్లో జన ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వాస్పత్రుల్లో జనరిక్ మందులు షాపుల్ని నిర్వహించడానికి లాభాపేక్షలేని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. ఈ జనఔషధి కేంద్రాలకు సంబంధించి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తగు అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా స్థాయి శాఖలకు కలెక్టర్లు చైర్మన్లుగా ఉంటారు. సెకండరీ ఆస్పత్రుల్లో కూడా జనౌషధి కేంద్రాల్ని ప్రవేశపెట్టాలని మంత్రి ఆదేశించారు. 17 ప్రభుత్వ జనరల్ ఆస్పత్రులలో జనౌషధి కేంద్రాల్ని ప్రవేశపెట్టాలనే ప్రతిపాదనను ఆమోదించిన మంత్రి సత్యకుమార్ యాదవ్, రోగులకు కలిగే ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ఏరియా, జిల్లా ఆస్పత్రులలో కూడా వాటిని నిర్వహించే అవకాశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

పీఎం జనౌషధి ప్రయోజనాలు ఇవీ

ప్రస్తుత వ్యవస్థలోని లోపాలను పరిష్కరించి, దేశవ్యాప్తంగా రోగులకు సరసమైన ధరలకు నాణ్యమైన జనరిక్ ఔషధాలను సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి– భారతీయ జనౌషధి పరియోజన (పీఎం– బీజేపీ)ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద, భారత ప్రభుత్వ ఔషధాల శాఖ జనౌషధి దుకాణాలకు సరఫరా చేయడానికి ముద్రించిన ప్రామాణిక గరిష్ట విక్రయ ధరతో జనరిక్ ఔషధాలను కొనుగోలు చేస్తుంది. వీటిని 15 శాతం లాభంతో మాత్రమే జనౌషధి కేంద్రాలు విక్రయిస్తాయి. ఇది రోగులకు భారీగా ప్రయోజనం చేకూరుస్తుంది.

ప్రతి అమ్మకాన్ని కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేసిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్ నమోదు చేయాలి. తద్వారా రిటైలర్లు జనరిక్ ఔషధాల అమ్మకపు ధరలను మార్చటానికి వీలుండదు. ఉదాహరణకు ఒక ప్రైవేటు జనరిక్ దుకాణంలో అమ్మే మందు దాని బాక్స్‌పై రూ.100 ఎంఆర్‌పి ఉంటే, దానిని దుకాణదారు రూ.50లకు అమ్ముతాడు. ఇదే జనౌషధి దుకాణంలో మాత్రం రూ.30 మాత్రమే ధర ఉంటుంది. ఆ రేటుకే అమ్ముతారు. పైగా తయారీ, అమ్మకాల్లో కేంద్ర ప్రభుత్వ అజమాయిషీ ఉంటుంది. చాలా అరుదైన నందర్భాలలో తప్ప జనౌషధి దుకాణదారులు ఖరీదైన బ్రాండెడ్ మందులను విక్రయించరు. సంబంధిత అధికారుల ఆమోదంతో కొన్ని వ్యాధులకు జనరిక్ మందులు అందుబాటులో లేనప్పుడు మాత్రమే బ్రాండెడ్ మందులను విక్రయిస్తారు.

బీసీ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్ సహకారం

నిరుద్యోగ డీ, బీ–ఫార్మసీ అభ్యర్థులు బీసీ సంక్షేమ కార్పొరేషన్ ద్వారా 8 లక్షల విలువైన జనరిక్ మందుల దుకాణాన్ని 50 శాతం సబ్సిడీతో ఏర్పాటు చేసుకునేందుకు రాష్ట్ర కూటమి ప్రభుత్వం సంకల్పించింది. వివిధ సామాజికవర్గాల కోసం కార్పొరేషన్ల ద్వారా వారికి ఆర్థికంగా చేయూత అందించి స్వయం ఉపాధి కల్పించే ప్రయత్నం చేస్తోంది. అందులో భాగంగానే వెనుకబడిన తరగతులకు చెందిన వారికి, అగ్రవర్ణాల పేదలకు (ఈడబ్ల్యూఎస్ వర్గాలు) బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి కల్పించనున్నారు. ఇందుకోసం బీసీ వెల్ఫేర్ కార్పొరేషన్ ద్వారా రూ.25.6 కోట్లు కేటాయించారు. అభ్యర్థులు డీ–ఫార్మసీ, బీ– ఫార్మసీ వంటి కోర్సులు పాసైఉండాలి. ఒక్కో జనరిక్ మందుల యూనిట్ ఏర్పాటుకు రూ.8 లక్షల వరకూ ఖర్చుకానుండగా.. అందులో 50 శాతం అంటే రూ.4 లక్షలు రాయితీ ఇస్తారు. మిగతా రూ.4 లక్షలు బ్యాంకు రుణంగా ఇవ్వనున్నారు. అలాగే అగ్రవర్ణ పేదలకు (ఈబీసీలు) అంటే కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, క్షత్రియ, ఆర్యవైశ్య సంఘాలకు కూడా స్వయం ఉపాధి పథకాలు అందిస్తున్నారు. ఇందులోనూ 50 శాతం ప్రభుత్వం రాయితీ అందిస్తోంది. ఈ పథకాలకు అర్హత వయస్సును 21 నుంచి 60 ఏళ్లుగా ప్రభుత్వం నిర్ణయించింది. రేషన్ కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే అవకాశం కల్పించింది. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న తర్వాత స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలి.

తురగా నాగభూషణం
సీనియర్ జర్నలిస్ట్

'కార్టూన్ పోటీ-2025'లో ప్రోత్సాహక బహుమతి పొందినది



తెలుగు, తమిళం తోబుట్టువులు. అందువల్ల భాషా సాహిత్యాల మధ్య దగ్గరి చుట్టరికంలో ఆశ్చర్యం లేదు. 'నిన్న మొన్నటి చుట్టరికం కాదిది. ఎన్నో యేండ్లుగా పెనవేసుకున్నదిది' తమిళ కవి సుబ్రహ్మణ్య భారతి 'కన్నయ' గీతంలో ప్రేయసి కన్నమ్మను గురించి చెప్పిన పై పాదం తెలుగు తమిళ సాహిత్యాల మధ్య ఉన్న సంబంధానికి అక్షరాల వర్తిస్తుంది. ఈ భాషల మధ్య సాహిత్యపరంగా నెలకొన్న బంధం ప్రశస్తమైనది, ప్రాచీనమైనదీను.

తెలుగు సాహిత్యానికి శ్రీకారం చుట్టిన నన్నయ్య పేరు తమిళంలో నన్నై, నన్నూర్. తమిళ సాహిత్యంలో అతి ప్రాచీనయుగంగా భావించే సంగమ యుగంలో నన్నన్ అనే ఓ సామంతరాజు ఉన్నట్లు తెలుస్తుంది. నన్నయ్య అంటే మంచివాడని అర్థం. తమిళ్ అనే మాటకు నిఘంటువులో కనిపించే అర్థం 'మాధుర్యం'.

తమిళ పండితులు కొందరు తమి+ఇళ్ = ప్రత్యేకము+స్వతంత్రము అయిన భాష అని, తేను రైతమిళ్ (తేనె వలె తీయని తమిళం)అని పేర్కొన్నారు. తమిళ నిఘంటుకర్త పింగళ ముని ఇలా పేర్కొన్నాడు ఇనిమైయుం (మాధుర్యం) నీరిమైయుం (సంస్కరించబడింది). తమిళ శబ్దానికి మాధుర్యం అనే అర్థం రాగా, తెలుగు వలె తమిళం కూడా తీయని భాషని స్పష్టమవుతున్నది.

ప్రాచీన తమిళులు సముద్రాల మార్గంలో విదేశాలతో వర్తక వాణిజ్యాలు సాగించారు. ఆ రోజుల్లో కోర్కై, ముసిరిన్, (క్రాంగనూరు) పుహార్ (కావేరి పూంపట్టణం) మొదలైనవి ప్రసిద్ధ రేవు పట్టణాలు. ఈ పట్టణాలను తమిళంలో తురైముగములు అంటారు. తురై ముగములు గల దేశం గనుక ద్రావిడ మనే వ్యవహారం ఏర్పడి ఉండవచ్చును. తురైవీడు అనే అరవ మాటను సంస్కరించగా ద్రావిడ శబ్దం ఏర్పడినట్లు భావించారు. తమిళం నుండి ఏర్పడిన భాషలకు ద్రావిడ భాషలు అనే పేరు కలిగింది.

తమిళం ప్రాచీన భాష. తెలుగు, కన్నడ భాషలలో సంస్కృత వాణి విహరించినంత స్వేచ్ఛగా తమిళంలో విహరించలేదు. "మహా భారతం" తెలుగు, కన్నడ సాహిత్యంలో వెలసిన ప్రాచీన కావ్యం. రామ చరితం మలయాళ సారస్వతంలో వెలసిన ప్రాచీన కావ్యం. కాని తమిళ సాహిత్యంలోని తొలి రచనలు స్వతంత్రాలు.

ఒకానొకప్పుడు తమిళం భారతదేశంలోనే కాక అసీరియా, బాబిలోనియా, మొదలైన దేశాలలో ప్రచారంలో ఉండేదనీ, ఇటలీలోని టాస్కనీలో వాడే భాష తమిళ మాండలికమని చెప్పవచ్చును. సుమారు 20 వేల సంవత్సరాలకు పూర్వం భారతదేశంలో వాడుకలోనున్న భాషలు చాలావరకు తమిళానికి సన్నిహితంగా ఉండేవనీ, ఈనాడు ఉత్తర భారతదేశంలో ఉన్న భాషలు ఆర్యభాషా కుటుంబానికి చెందినవని చెప్పినప్పటికి, ఒకప్పుడవి తమిళానికి సన్నిహితంగా ఉండేవని పి.టి.శ్రీనివాస అయ్యంగార్ అభిప్రాయం.

తమిళ సాహిత్య చరిత్రను కొందరు ఇలా యుగ విభజన చేశారు. 1.సంగ కాలం 2.సంగమునకు తరువాతి కాలం 3. పల్లవుల కాలం, 4. చోళుల కాలం, 5. నాయకరాజుల కాలం 6. ఐరూపా వారి కాలం, 7. ఆధునిక కాలం. వీటిలో సంగమ సాహిత్య కాలం ప్రధానమైనది. ఇఱైనార్ అనే కవి అందించిన 'అగప్పొరుల్' గ్రంథానికి రాసిన వ్యాఖ్యానంలో సంగం ప్రశంన మొదటిసారి కన్పిస్తుంది. ఇఱైనార్ అంటే భగవంతుడు. కనుక ఈ గ్రంథాన్ని శివుడే రాశాడని నమ్ముతారు.

దక్షిణా పథంలో పల్లవ భూపతులు రాజ్యాధికారం చేసేవారు, శైవ వైష్ణవ మతాలు బహుళ ప్రచారంలో ఉండేవి. కాని సంగమ వాఙ్మయంలో జైన బౌద్ధ మత ప్రశంస, తమిళ రాజ్యానికి చెందిన చేర, చోళ, పాండ్య మహీపతుల ప్రశంస కన్పిస్తాయి.

సింహళ ద్వీప చారిత్రక గ్రంథం 'మహా వంశం' ప్రకారం ఆ దేశ మన్నీడు గజ బాహు చక్రవర్తి (క్రీ॥శ 17-93) వంజి పట్టణంలో కణ్ణకీ దేవికి ఆలయం నిర్మించిన సెంగుట్టువాన్ సమకాలికుడు. ఇతని తమ్ముడైన ఇళంగో కణ్ణకి కథను అభివర్ణించే సిలప్పదికార కావ్యం రాశాడు. దీనిని బట్టి సంగమ యుగం మొదటి శతాబ్దికి మునుపే ప్రారంభమైందని భావించవచ్చు.

కవి సమూహాలను సంగం అనవచ్చును. ఇట్టివి మూడు సంగాలు వర్ధిల్లినాయి. అవి తలైచ్చంగం (తొలి సంగం) ఇడైచ్చంగం (మధ్య సంగం) కడైచ్చంగం (కడ సంగం). కావ్యాలలోని బాగోగులను నిర్ణయించి సత్కావ్య నిర్ణయం చేయడమే సంగం కవులు పని. ఆ విధంగా సంగం కవుల ఆమోదముద్ర పొందిన రచనలే ప్రచారం లోకి వచ్చేవి.

తొలి సంగం మధురా నగరంలో జరిగింది. ఇందులో 549 మంది కవులు ఉండేవారనీ శివుడు, మురుగన్ (సుబ్రహ్మణ్య స్వామి) అగత్తియన్ (అగస్త్యుడు) మున్నగువారు సభ్యులని నమ్ముతారు. ఈ సంగం 4,440 సంవత్సరాలు వర్ధిల్లినదట. ఆ తరువాత మధురానగరం సముద్రంలో కలిసి పోయినట్లు చెబుతారు. పరిపాడల్, ముదువారై, మురుకురుకు మొదలైన కృతులు ఈ కాలంలో వెలుగులోనికి వచ్చినట్లు చెబుతారు. వీటిలో అగస్త్యుడి 'అగత్తియం' ముఖ్యంగా పేర్కొనదగినది. దీనిని ఆధారంగా చేసుకొని తొలి కప్పియర్ 'తొలి కప్పియం' అనే వ్యాకరణ గ్రంథం రాశారని తెలుస్తున్నది. కాని అగత్తియంలో12000 సూత్రాలు ఉండేవనీ, కాని కొన్నే లభిస్తున్నాయని అంటారు. దొరికిన వాటితో భవానంద పిళ్ళై ఒక పుస్తకం ప్రకటించారు.

మహేశ్వరుడు పాణినికి సంస్కృత వ్యాకరణం, అగస్త్యునికి తమిళ వ్యాకరణం ప్రసాదించినట్లు ఓ ఐతిహ్యం. శివజ్ఞానముని అనే ప్రాచీనుడు తన 'కాంచిప్పాయరం' గ్రంథంలో ఇలా పేర్కొన్నాడు, "సంస్కృత భాషను పాణినికి ప్రసాదించి, దానికి తుల్యమైన ద్రావిడభాషను కుడ మునికి నేర్పారు. కుడ ముని అంటే అగస్త్యుడు. కనుక పాణిని కాలానికి చెందినవాడు, పొదియల్ పర్వతం మీద నివసించినవాడు అయిన అగస్త్యుడే తమిళ మహర్షి అనీ అతడే తమిళ వ్యాకరణం ప్రసాదించాడనీ పండితుల నమ్మకం. ఈ కారణంతోనే అగస్త్యుడు తమిళ భాషా జనకుడని కీర్తి గడించాడు. తమిళ భాషను అగస్త్యం అని కూడా వ్యవహరిస్తారు (అగత్తియన్ వయన చెఞ్జొల్ అరణంగు). ఆ మహానీయుని ప్రతిభా విశేషం వలనే తమిళనాడులో కావేరి ప్రవహించసాగిందని ఐతిహ్యం. ఈ విధంగా నాడు-నేడు అగస్త్యుడు తమిళులకు ఆరాధ్యుడైనాడు. ఇండోనేషియా, కంబోడియా మొదలైన ప్రదేశాల్లో కూడా ప్రసిద్ధి చెందాడు. ఆయనకు అలయాలు సైతం నిర్మించారు.

మధ్య సంగం కపాడపురంలో వర్ధిల్లింది. అగస్త్యుడు, తొల్కాప్పియనార్ ఈ సంగంలో విలసిల్లిన



ఊహచిత్రం : అగస్త్య

సంగం సాహిత్యం

పండితులు. ఇందులో మొత్తం 59 మంది కవులు ఉండేవారని తొల్కాప్పియం మా (మహా) పురాణంగా విలసిల్లింది. తొల్కాప్పియం కర్త తొల్కాప్పియార్ మధురా నగరానికి దక్షిణంగా ఉన్న తొల్కాప్పియ క్కుడిలో జన్మించినట్లు కొందరి తలంపు. ఇతడు జైన మతావలంబీకుడు. అగస్త్యుని 12 మంది శిష్యుల్లో ప్రముఖుడు. తొల్కాప్పియనార్‌పై సంస్కృత వాఙ్మయ ప్రభావమున్నట్లు కన్పిస్తున్నది. పాణినీయమునే గాకుండా పతంజలి మహాభాష్యం, మనుస్మృతి, భరతశాస్త్రం మొదలైన గ్రంథాలను కూడా ఆయన సంవ్రదించినాడని ఎన్.వైయాపురి పిళ్ళై నిర్ధారించారు.

తొల్కాప్పియం కామం, తత్సంబంధమైన విషయాలు, యుద్ధ తంత్రాలు, రహస్య సాంసారిక ఛందస్సు, కావ్య వస్తువు, లోకోక్తులూ ప్రయోగాలు అనే భాగాలున్నాయి. వీటిలో తమిళుల సామాజిక జీవన విధానం వర్ణితం. తొల్కాప్పియానికి నచ్చినార్, కినియార్ వంటివారు వ్యాఖ్యానాలు రాశారు. కాని ఏ సందర్భంలోనూ తమిళ-సంస్కృతములకు జన్య జనక సంబంధం చెప్పలేదు.

కడ సంగమం 1850 సంవత్సరాలు వర్ధిల్లినది. ఇందులో 49 మంది కవులు ఉండేవారనీ, 449 గ్రంథాలు పరిశీలించారని చెపుతారు. ఈ సంగానికి అధ్యక్షుడు నక్కీరుడు. తిరుక్కురళ్ రాసిన తిరువళ్లువార్ ఈ కాలంలోని వాడు. పత్తుప్పాట్టు, ఎట్టుతొగై, పదినెఙ్ కీళ్ కణక్కు మొదలైన గ్రంథాలు ఈ కాలంలోనివే.

ఒక ప్రాచీన తమిళ పండితుడు తిరుక్కురల్‌ను ప్రశంసిస్తూ, 'ఆవగింజను తొలిచి తిరువళ్లువార్ అందులో సప్త సముద్రాలను చొప్పించాడు' అన్నారు. తిరువళ్లువార్‌కు చిరకీర్తిని తెచ్చి పెట్టిందీ గ్రంథం. సర్వ జనీనమూ, సర్వకాల సమ్మతమూ అయిన ఈ నీతి గ్రంథంలోని సూక్తులు సహజ సుందరాలు. అందువల్ల ఈ గ్రంథాన్ని ఇంగ్లీషు, ఫ్రెంచ్, జర్మన్ భాషల్లోనికి అనువదించుకున్నారు. కూరల్‌ను తెలుగులోనికి అనువదించినవారు కనువర్తి వెంకటరామ విద్యానంద నాథులు, చొక్కం నరసింహులు నాయుడు, పూతపట్టు శ్రీరాములు, మరింగంటి జగ్గన్నశాస్త్రి, శొంఠి శ్రీపతిశాస్త్రి ప్రభృతులు. దీనిలో రాజ్యాంగ విధానం, కోశ పద్ధతి, పాలకులు-పాలితులు వంటి అంశాల గురించి, మరోవైపు ప్రేయసీ- ప్రియుల గురించి, రహస్య ప్రణయం, వియోగం వంటి అంశాలు ఇందులో ఉన్నాయి. దీనినే తమిళ వేదమని కూడా పిలుస్తారు. ఉదాహరణకు:

"జనకుండు మున్ను నోచిన నోము పంట
తనయుడై కర్మకున్ దగి పుట్టునింట"
"పూని ద్రాక్షాసవం బానగా తీపి
కాని ప్రేమ రసమ్ము కనినంత తీపి"

తిరువాళ్లువార్ తరువాత పేర్కొనదగిన వారు కవయిత్రి అవైయారుని. ఈమె ఆల్తి చూడి, కొండ్రై వేందన్ సల్వళి మొదలైన లఘు రచనలు చేసినట్లు చెబుతారు. నన్ని మఱవేల్ (చేసిన మేలు మరువకు), అన్నైయుం పితావుం మున్నందయ్‌వం (తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవములు), ఐమిట్టు యుణ్ (ఒకరికి పెట్టి ఆపై తిను) ఆమె రచనలు. నేటికి తమిళుల జిహ్వాగ్రాన నిలిచి ఉన్నాయి.

ఈ కాలం నాటి సంకలన కృతులలో ప్రశస్త ములనదగినవి, "అగనానూఱు" "పుఱనానూఱు", అగనానూఱు. 'అగం' అంటే ప్రేమ, అది నిష్కల్మషమైనది, ఏక మనస్కులైన నాయికా నాయకులు ఆనంద పరవశులై వ్యక్తీకరించే మధురానుభూతిని అగం అనవచ్చు. పాండ్య భూపతి ఉగ్ర పెరువళది సమాదరణమున రుద్ర శర్మన్ అనే పండితుడు ఈ కృతిని సంకలనం చేశాడు.

పుఱనానూఱు, ఇది చారిత్రక కావ్యం. తమిళ రాజత్రయం అని పిలిచే చేర, చోళ, పాండ్య వంశీయుల గురించి, వారి సామంతులను గురించీ ఆనాటి వీరయోధులను గురించీ ఎన్నో విషయాలు కళ్లకు కట్టనట్లుగా వివరించారు. భారతం సంతరించిన పెరుం దేవనార్ అనే కవి చేసిన దైవస్తుతి గీతంతో పుఱనానూఱు ప్రారంభమవుతుంది.

కరికాల చోళుని చేతిలో చేరరాజు పరాజితుడై సమర భూమిలోనే ప్రాణ త్యాగం చేశాడు. దీనిపై ఓ కవి చేర దేశీయుల దుస్థితిని ఎంతో దయనీయంగా వర్ణించాడు.

నినదించవు విజయ బేరు లింక
వినిపించవు తుర్యారవములు
కలకలలాడవు పాలకుండలు
కమ్మని తేనెను ఎవ్వరు గ్రోలరు
కర్షక స్వాములు పట్టరు హలములు
బయళ్లలో గుమికూడరు ప్రజలు
కొండలచాటున క్రుంకిన సూర్యునివలె
పరాజితుడైన మా రాజసింహుడకటా!
ఆనాడు యుద్ధ భూమిలో అసువులు కోల్పోవడమే కీర్తి హేతువు.

సంగమ కవులు చాలావరకు పద రచనలు చేశారు. వైద్య గ్రంథాలు కూడా కొన్ని వెలుగులోనికి వచ్చాయి. ఆ కవులలో పలువురు బ్రాహ్మణేతరులు. కవి పండితులకు రాజాశ్రయం లభించేది. కవయిత్రులు కూడా కొందరు వర్ధిల్లారు. సంగమయుగం నాటి గ్రంథాలలో నీతి బోధకాలే ఎక్కువ.

మూలం:

- తమిళ విందు బై చల్లా రాధాకృష్ణ శర్మ పేజీ 1 టు 3
- తమిళ సాహిత్య చరిత్ర బై చల్లా రాధా కృష్ణ శర్మ పేజి.1 టు 26.

డా. కొశింశెట్టి సీత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు

50 ముస్లిం దేశాలు, పాక్ వెనుక నిలిచినవి రెండే

ఉగ్రవాద శిబిరాలే లక్ష్యంగా జరిగిన ఆపరేషన్ సిందూర్ తరువాత భారత్ –పాకిస్తాన్‌ల మధ్య మరింత ఉద్రిక్తత పెరిగిన సంగతి తెలిసిందే. చిత్రంగా పాకిస్తాన్ రోజు రోజుకీ ఏకాకి కావడం ఈ క్రమంలో కనిపించే వింత పరిణామం. ఆఖరికి ముస్లిం దేశాలు చాలావరకు బాహాటంగా పాకిస్తాన్‌కు మద్దతు ఇవ్వడానికి ముందుకు రావడం లేదు.

ఐక్యరాజ్య సమితి చార్టర్‌లోని 51వ అధికరణాన్ని భారత్ ఉల్లంఘించిందని ఆపరేషన్ సిందూర్ తరువాత పాకిస్తాన్ గోల మొదలుపెట్టింది. నిజానికి ప్రపంచంలోని ముస్లిం దేశాల నుంచి తనకు ఇబ్బడి ముబ్బడిగా మద్దతు దక్కుతుందని పాకిస్తాన్ ఆశించింది. అయితే ఈ ఆశ దారుణంగా విఫలమైంది. ప్రపంచంలో 50కి పైగా ముస్లిం దేశాలు ఉన్నాయి. కానీ టర్కీ, అజర్‌బైజాన్ మాత్రమే బహిరంగంగా పాకిస్తాన్‌కు మద్దతు పలికాయి. మిగిలిన అన్ని ముస్లిం దేశాలు కూడా తమకు సంబంధం లేదన్నట్టే వ్యవహరిస్తున్నాయి. ఇది పాకిస్తాన్‌కు అతి పెద్ద శరాఘాతం. తనకు పటిష్ట సైనిక పాటవం ఉందని, ఆసియా ప్రాంతంలో ముస్లిం దేశాలకు ముందు నుంచి తానే నాయకత్వం వహిస్తున్నానని పాకిస్తాన్ ప్రపంచాన్ని నమ్మించే ప్రయత్నం చాలా గట్టిగా చేసింది. వాస్తవానికి ఆసియాలో అత్యధిక ముస్లిం జనాభా ఉన్న దేశం పాకిస్తాన్ కాదు. దానిది రెండో స్థానమే. పాకిస్తాన్‌లో కంటే భారత్‌లో ముస్లిం జనాభా ఎక్కువ. అంటే మొదటి స్థానం భారతదేశానిదే.

కనీవినీ ఎరుగని రీతిలో పీకల్లోతు కష్టాల్లో ఉన్నప్పటికీ దాదాపు 48 దేశాలు పాకిస్తాన్ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఎందుకు? మతాన్ని ఉగ్రవాదం కోసం ఉపయోగించుకుంటున్న దేశంగానే పాకిస్తాన్‌ను చాలావరకు ముస్లిం దేశాలు భావిస్తున్నాయని విశ్లేషకులు చెబుతారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ దానిని ఇరుగు పొరుగు దేశాల మీద పరోక్షంగా ప్రయోగిస్తున్నదన్న సంగతి కూడా వాటి దృష్టిలో ఉంది. భారత్,పాక్ ఉద్రిక్తతలను ఆ దేశాలు మత కోణం నుంచి చూడడం లేదు. దౌత్య, ఆర్థిక కోణం నుంచి మాత్రమే అంచనా వేస్తున్నాయి. కాబట్టే తమవీ ముస్లిం దేశాలే అయినా పాకిస్తాన్ గొడవను పట్టించుకోవడం లేదు.

నిజానికి సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కొద్దికాలం క్రితం వరకు కూడా పాకిస్తాన్‌కు విస్తారంగా నిధులు సమకూర్చిన దేశాలే. అయితే చాలా కారణాలతో పాకిస్తాన్‌తో సత్సంబంధాలను నిలిపివేయడం మంచిదని ఆ రెండు గల్ఫ్ ప్రముఖ రాజ్యాలు నిశ్చయానికి రావడం ఒక పరిణామం. ఆ కారణాలలో ప్రముఖమైనది– ఆ రెండు దేశాలు భారత్‌కు సన్నిహితమయ్యాయి. పాకిస్తాన్‌ను దూరంగా పెట్టాయి.

కశ్మీర్ వివాదాన్ని ఇంతగా రాజేస్తున్నా, ఈ సమస్యను ద్వైపాక్షిక చర్చల ద్వారా పరిష్కరించుకునే

మోదీ ప్రకటనకు సమాధానం కూడా ఇవ్వలేని పిరికి ప్రధాని షెహబాజ్

భారత్–పాకిస్తాన్ మధ్య కనీ వినీ ఎరుగని రీతిలో నెలకొన్న ఉద్రిక్తతలు, బెలూచిస్తాన్ నుంచి ఎదురవుతున్న తీవ్ర ప్రతిఘటనలకు తోడు పాకిస్తాన్‌లో అంతర్గతంగా రాజకీయ వైరుధ్యాలు కూడా మరింత వేడెక్కుతున్నాయి. మే 9వ తేదీ శుక్రవారం నేషనల్ అసెంబ్లీ దీనినే ప్రతిబింబించింది. నరేంద్ర మోదీ ఇచ్చిన ప్రకటనకు బదులు కూడా ఇవ్వలేని పిరికి ప్రధాని షెహబాజ్ షరీష్ అని జాతీయ అసెంబ్లీలో ఎంపీ, తెహ్రీక్ ఎ ఇన్సాఫ్ సభ్యుడు షాహిద్ ఖట్టక్ విమర్శించారు. మోదీ పేరు ఎత్తడానికి కూడా భయపడుతున్నాడని దుయ్యబట్టాడు. భారత్‌కు వ్యతిరేకంగా ఒక్క ప్రకటన కూడా వెలువడలేదు. పాకిస్తాన్ సైనికులు సరిహద్దులలో ప్రభుత్వం ధైర్యసాహసాలు ప్రదర్శిస్తుందని ఎదురుచూస్తున్నారు. మీ నాయకుడు (ప్రధాని) ఒట్టి పిరికిపంద, కనీసం మోదీ పేరు ఎత్తడానికి కూడా వణికిపోతుంటే ఇదంతా సరిహద్దులలోని సైనికులకు ఎలాంటి సందేశం పంపుతుంది అంటూ ఖట్టక్ నిలదీశాడు.

జైష్ ఏ మహమ్మద్, లష్కర్ ఏ తాయిబాల మీద సైనిక దాడి అనివార్యం: తస్లీమా నస్రీన్!

మే 7న భారత ప్రభుత్వం చేసిన దాడులు సమర్థనీయమని, అనివార్యమేనని బాంగ్లాదేశ్ రచయిత్రి తస్లీమా నస్రీన్ అన్నారు. ఇది తరుచు సరిహద్దులలో జరుగుతున్న ఉగ్ర కార్యకలాపాలకు భారత్ ఇచ్చిన సమాధానమని ఆమె వ్యాఖ్యానించారు. తొమ్మిది ప్రదేశాలలో భారత్ చేసిన దాడులను ఆమె సమర్థించారు. ఇది యుద్ధం అనుకోలేం. కేవలం ఉగ్రవాద శిబిరాల ధ్వంసం మాత్రమే అన్నారామె. ఎక్కడ ఉగ్రవాద శిబిరాలు ఉన్నా వాటిని నిర్మూలించవలసిందేనని తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. అంతకు ముందు కూడా ఆమె, ఎక్కడ ముస్లిం ఛాందసత్వం ఉంటుందో అక్కడ ఉగ్రవాదం ఉండి తీరుతుందని మండిపడ్డారు.

షెహబాజ్ షరీఫ్ రెసిప్ తయ్యాపి ఎర్డాగన్ అజర్‌బైజాన్

ఉద్దేశం పాక్‌కు లేదని కూడా ముస్లిం దేశాలు నిర్ధారణకు వచ్చాయి. ఉగ్రవాదం ద్వారా, పెహల్గామ్ వంటి ఘటనల ద్వారా కశ్మీర్ రావణ కాష్టాన్ని అలా మండనిస్తూ, స్వదేశంలో పబ్బం గడుపుకోవాలన్న, సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించాలన్న ఉద్దేశమే పాకిస్తాన్ నేతలలో పాతుకుపోయిందన్నది కూడా ముస్లిం దేశాలు ఏనాడో గ్రహించాయి. పాకిస్తాన్ పెంచి పోషించిన లష్కర్ ఏ తాయిబా, జైష్ ఏ మహమ్మద్ ఆ దేశ ప్రతిష్టను ఏనాటికీ కోలుకోలేనంతగా పతనం చేశాయి. ఇక చైనా లేదా టర్కీ పాకిస్తాన్‌కు మద్దతుగా ఉన్నాయంటే అందుకు కారణం స్వప్రయోజనాలేనని కూడా విశ్లేషకులు చెబుతారు.

టర్కీ ఎందుకు పాకిస్తాన్‌ను అంటకాగుతున్నదో తెలుసుకోవడం ఆసక్తికరంగా ఉంటుంది. ఆ దేశానికి రెసిప్ తయ్యాపి ఎర్డాగన్ అధ్యక్షుడు. ఒటోమాన్ సామ్రాజ్యాన్ని పునరుద్ధరించడం వంటి చర్యల ద్వారా టర్కీకి పూర్వపు వైభవం తేవాలన్నది ఇతడి ఆశ. తద్వారా మొత్తం ఇస్లామిక్ దేశాలకు నాయకత్వం వహించాలన్నది అతడి కోరిక. ఈ కోరిక ఎందుకో పాకిస్తాన్ సైనిక పెద్దలకీ, చాలామంది పౌరులకీ నచ్చింది. పాకిస్తాన్‌లో తన పలుకుబడి ఇంకా చిక్కబడాలంటే, ఆ దేశానికి దాయాది దేశం భారత్‌తో వైరం పెట్టుకుంటే పని అవుతుందని ఎర్డాగన్ నమ్మకం. అందుకే తనకి ఏమీ సంబంధం లేకున్నా టర్కీ అప్పుడప్పుడు కశ్మీర్ పేరు ఎత్తుతూ ఉంటుంది.

అయితే అజర్‌బైజాన్ విషయం అచ్చంగా ఇలాంటిది కాదు. దీనికీ పాకిస్తాన్‌కీ నేరుగా బంధాలు ఏమీ లేవు. కానీ అజర్‌బైజాన్‌కు టర్కీతో ఆర్థిక, దౌత్య సంబంధాలు పెద్ద స్థాయిలోనే ఉన్నాయి. కాబట్టి టర్కీని మెప్పించడానికి పాకిస్తాన్‌కు జై కొడుతూ ఉంటుంది. అందుకే అజర్‌బైజాన్‌ను టర్కీకి ఉపగ్రహమని కూడా కొందరు ముద్దుగా పిలుస్తారు. అజర్‌బైజాన్‌తో పాక్ బంధం బలపడక తప్పని పరిస్థితి ఒకసారి 2020లో వచ్చింది. అర్మేనియాతో యుద్ధం చేసినప్పుడు పాకిస్తాన్ అజర్‌బైజాన్‌కు మద్దతు ప్రకటించింది. సైనిక సాయం కూడా చేస్తానని చెప్పింది.

అమ్మా నాన్నలతో నాయక్

సిందూర్ అమరుడు మురళీ నాయక్

ఆపరేషన్ సిందూర్ చర్యలో పాలు పంచుకున్న తెలుగు వీరుడు మురళీనాయక్. ఆంధ్రప్రదేశ్‌లోని నాగినాయుని చెరువుకు చెందిన మురళీ జమ్ముకశ్మీర్‌లో మే 8 రాత్రి పాకిస్తాన్‌తో జరిగిన ఎదురు కాల్పులలో వీరమరణం పొందారు. 2022లో ఆయన అగ్నివీర్‌గా ఎంపికై సేవలకు వెళ్లారు. ఆయన మృతి పట్ల తెలుగు రాష్ట్రాలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశాయి. గవర్నర్‌లు, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు కూడా ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

కళ్లు తెరిచిన న్యూయార్క్ టైమ్స్

The New York Times

The Latest | What to Know | Timeline: Kashmir Dispute | The Terrorist Attack | View From I

India Strikes Pakistan Two Weeks After Terrorist Attack

The strikes escalated a conflict between the two nuclear powers and came after a deadly terrorist attack in the Indian side of the disputed Kashmir region. Pakistan said India's attack on Wednesday killed at least eight people.

మొత్తానికి న్యూయార్క్ టైమ్స్ గొంతు కాస్త మార్చింది. మిలిటెంట్ వంటి స్థానంలో ఉగ్రవాదులు అన్న మాటను ప్రయోగించింది. ఏప్రిల్ 22 నాటి పెహల్గామ్ ఘటనలో మిలిటెంట్లు కాల్పులు జరిపారు అని మాత్రమే రాసిన న్యూయార్క్ టైమ్స్‌ను అమెరికా విదేశాంగ శాఖే సరిదిద్దవలసి వచ్చింది. పెహల్గామ్‌లో ఉగ్రవాదులు దాడి చేసిన రెండు వారాల తరువాత భారత్ పాకిస్తాన్ లోని శిబిరాల మీద దాడులు చేసింది అని పేర్కొన్నది. పెహల్గామ్ కాల్పులకు పాల్పడిన వారిని మిలిటెంట్లు అని పేర్కొనడంపై ఆ పత్రిక తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొన వలసి వచ్చింది.

ప్రతీకారం తీర్చుకుంటాం: షెహబాజ్

నోరు మాట్లాడుతుంటే నొసలు వెక్కిరించడం అంటే ఇదే. మే 7నాటి భారత సైనిక దాడుల తరువాత పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. పార్లమెంట్ నుంచి ఆయన చెప్పిన మాటలు కూడా యుద్ధానికి కాలు దువ్వే ధోరణిలోనే ఉన్నాయి. తొలి అడుగులో భారత్ పై చేయి సాధించినట్టు రుజువైనప్పటికీ ఆ దేశ ప్రధాని విజ్ఞతను ప్రదర్శించకలేకపోయారు. భారత్ సైనిక దళాలు చేసిన దాడులకు ప్రతీకారం తీర్చుకునే సామర్థ్యం పాకిస్తాన్‌కు ఉందని అన్నారు. మీ (ప్రజలు) క్షేమం కోసం మా సైన్యం ప్రతీకారం తీర్చుకుంటుందని అన్నారు. మన సైన్యం మన ప్రజల కోసమే అని కూడా ఉద్ఘాటించారు. మనం ఎప్పుడూ ఐక్యంగానే ఉన్నామని, ఉగ్రవాదం కారణంగా మనం కూడా నష్టపోయామని షెహబాజ్ అన్నారు. అంతకు ముందు షెహబాజ్ అధ్యక్షతన అత్యున్నత స్థాయి జాతీయ భద్రతా సంఘం సమావేశం జరిగింది. భారత్ సేనల దాడి చట్టవ్యతిరేకమని, పాకిస్తాన్ సార్వభౌమత్వాన్ని అతిక్రమించడమేనని పాకిస్తాన్ భద్రతా సంఘం ఒక ప్రకటనలో ఆరోపించింది. భారత్‌పై ప్రతీకారం తీర్చుకోవడానికి ఎక్కువ సమయం లేదని ఆ దేశ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ మునీర్ పాత పాటే పాడారు. ఒక పక్క భారత్ దాడులు ఆపితే తాము కూడా ఆపేస్తామని చెబుతూనే మరొక పక్క ఇలాంటి ప్రకటనలు చేయడం ఒక ముస్లిం ఉగ్రవాదానికే చెల్లుతుంది. ఇజ్రాయెల్ మీద మొదట దాడికి దిగిన హమాస్ తరువాత దాడులు ఆపాలని కోరినట్టే, మొదట పాకిస్తాన్ దాడికి దిగి, తీరా భారత్ ప్రతిదాడికి దిగగానే చేతులెత్తేసే తీరులో మాట్లాడుతున్నది.

తనను రక్షించుకునే హక్కు భారత్‌కు ఉంది

ఉగ్రదాడితో పెహల్గావ్ కూడా ముంబై, న్యూఢిల్లీ, ముష్కరుల దాడికి గురైన ఇతర నగరాల చెంత చేరిందని, ఉగ్రవాదం మిగిల్చిన మచ్చగా ఉండిపోయిందని ఇంగ్లండ్ ఎంపీ ప్రీతీ పటేల్ వ్యాఖ్యానించారు. తనను తాను రక్షించుకునే హక్కు భారత్‌కు ఉందని చెప్పారామె. ఏప్రిల్ 22 నాటి దుర్ఘటనను ఆమె ఇంతకు ముందే ఖండించారు. ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాల నిరోధం కోసం భారత్‌తో కలసి ఇంగ్లండ్ వని చేయాలని

ప్రీతీ కోరారు. హౌస్ ఆఫ్ కామన్స్‌లో మాట్లాడిన ప్రీతి, సరిహద్దుకు ఆవల నుంచి వస్తున్న ఉగ్రవాదాన్ని గుర్తించాలని బ్రిటన్‌ను కోరారు. ఏప్రిల్ 22న జరిగిన దుర్ఘటన దారుణమని, చాలామందిని పాయింట్ బ్లాంక్ దూరం నుంచే కాల్చారనిఆ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు సడలిపోవాలని మనం కోరుకుంటున్నాం. దేశాల మధ్య సైనిక పాటవాల ప్రదర్శన తగ్గాలని ఆశిస్తున్నాం. అయితే భారత్‌కు బాధ్యతాయుతమైన తీరులో తనను తాను రక్షించుకునే హక్కు ఉందన్నది మాత్రం స్పష్టం అని ప్రీతి స్పీకర్‌ను ఉద్దేశించి అన్నారు. ఉగ్రవాదులు పాకిస్తాన్‌లో ఉన్నారని, వారు తరుచు భారత్‌కు, పాశ్చాత్య దేశాల ప్రయోజనాలకు బెడదగా పరిణమించారని మనందరికీ తెలుసు అని ప్రీతి తన సుదీర్ఘ ఉపన్యాసంలో చెప్పారు.

పాకిస్తాన్ ఎంపీ రోదన

'ఈ దేశాన్ని రక్షించండి! రక్షించమని అల్లా ముందు మోకరిల్లి కోరండి' అంటూ పాకిస్తాన్ నేషనల్ అసెంబ్లీ సభ్యుడు తాహిర్ ఇక్బాల్ సాక్షాత్తు సభలోనే విలపించాడు. మే 8వ తేదీన జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో వెంటనే వైరల్ అయింది. ఇతడు పాకిస్తాన్‌కు ఒక సమయంలో మేజర్‌గా కూడా పనిచేశాడు. భారత సైనికుల దాడి నుంచి ఈ దేశాన్ని రక్షించండి అంటూ ఆయన కన్నీటితో పాకిస్తాన్ సైన్యానికి విజ్ఞప్తి చేశారు. ఈ దేశానికి రక్షణ కల్పించవలసిందని ఆయన దేవుడిని కూడా వేడుకున్నాడు. మే 7న ఉగ్రవాద శిబిరాల మీద దాడి చేసిన భారత సైన్యం, గురువారం పాక్ రక్షణ వ్యవస్థకు చెందిన రాడార్ విభాగాల మీద కూడా దృష్టి పెట్టింది. పాకిస్తాన్ నాయకులు ఒక వైపు ఇలా మాట్లాడుతూ ఉంటే, మరొక పక్క మాత్రం ఆ దేశ సైన్యం భారత రక్షణ వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని కదులుతున్నది. పంజాబ్‌లో ఒక శకలం పడడం ఇందుకు ఉదాహరణ.





ఈ కాంగ్రెస్ పిచ్చోడు ఏం చేశాడో చూడండి!

జినాభిప్రాయానికి తలొగ్గో, లేకుంటే భయపడో పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాల మీద మన సైనికులు చేసిన దాడులకు కాంగ్రెస్ పార్టీ సంఘీభావం ప్రకటించింది. తాత్కాలికమే అయినా ఈ మార్పు గురించి ఇంకా కింది స్థాయి కార్యకర్తలకి సమాచారం లేదు కాబోలు. రాష్ట్ర స్థాయి కాంగ్రెస్ నేతలు కూడా పాత పాటే పాడుతున్నారు. సైన్యం మీద, మన ఆయుధ సంపత్తి మీద అతి చౌకబారు వ్యాఖ్యలు చేస్తున్నారు. ఉత్తర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అజయ్ రాయ్ పిచ్చిచేష్ట, పిల్లచేష్ట చూడండి! ఒక విమానం బొమ్మ మీద భారత సైనిక దళంలోని రఫేల్ యుద్ధ విమానం అని రాసి, దానికే దిష్టి అన్నట్టు నిమ్మకాయలు, మిరపకాయలు కట్టి పరాచకాలు ఆడాడు. దీనితో వారణాసిలోని చేత్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. ఆపై ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేశారు.

దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలు పెరిగిపోతున్నాయి. దీనితో ప్రజలు చాలా ఇక్కట్లకు గురి అవుతున్నారు. పెహల్గామ్ ఉగ్రవాద దాడిలో మన యువకులు ప్రాణాలు కోల్పోయారు. కానీ పెద్ద పెద్ద మాటలు చెప్పే మన కేంద్ర ప్రభుత్వం, రఫేల్ యుద్ధ విమానాలను తెచ్చిపెట్టుకున్న ప్రభుత్వం చేతలలో మాత్రం ఏమీ చూపడం లేదని మే 4న అజయ్ రాయ్ తన ఎక్స్ ఖాతాలో వ్యాఖ్యానించాడు. దాంతో పాటే ఈ పిచ్చిచేష్టను కూడా జాతి ఎదుట ప్రదర్శించాడు. తన వికృత మనస్తత్వాన్ని నిస్సిగ్గుగా చూపించాడు. దేశ సార్వభౌమాధికారాన్ని అంతర్జాతీయ సదస్సులలో ఎగతాళి చేయడం, భద్రతా దళాలను హేళన చేయడం ఈ చచ్చు పార్టీ ఎప్పుడు మానుతుంది? భారత వ్యతిరేక ముఠాలను అంటకాగే రాహుల్ వంటి నాయకుడు ఉన్న ఆ పార్టీ నుంచి ఇంతకు మించి ఆశించలేం కూడా. పెహల్గామ్ దాడులు మోదీకి ముందే తెలుసునంటాడు ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే. ఏ నిఘా అధికారిని అడిగినా ఒక విషయం చెబుతాడు. దేశంలో ఉగ్రవాద దాడి జరిగే అవకాశం ఉందని మాత్రమే నిఘా సంస్థలు చెప్పగలవు. అంతేగాని, కశ్మీర్‌లో, పెహల్గామ్ అనే చోట మధ్యాహ్నం ఉగ్రవాదులు వచ్చి కాల్పులు జరుపుతారని ఎవరూ చెప్పలేరు.

అయితే 2006, 2008 ముంబై పేలుళ్ల సమయంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ సభ్యులు కూడా ఇలాంటి విమర్శలకు దిగడం ఈ దేశ దౌర్భాగ్యం. అలాంటి పార్టీ పార్లమెంట్‌లో ప్రతిపక్ష హోదాలో ఉండడం స్వతంత్ర భారత చరిత్రలోనే విషాదం.

నేపాల్‌లో రాజకీయ కలకలం రేపిన పాక్ సైనిక ప్రతినిధి బృందం పర్యటన

భారత్–పాక్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొని ఉన్న సమయంలో 12 మందితో కూడిన పాకిస్తాన్ సైనిక ప్రతినిధి బృందం ఆరు రోజులు పర్యటనకు నేపాల్‌కు రావడం రాజకీయ వివాదానికి తెరలేపింది. నేపాల్ ప్రతినిధుల సభలో ఒక ఇండిపెండెంట్ సభ్యుడు ఈ పర్యటనను ప్రశ్నించారు. నేషనల్ డిఫెన్స్ యూనివర్సిటీ–పాకిస్తాన్ పరిధిలోని స్టూడెంట్స్ ఆఫ్ నేషనల్ సెక్యూరిటీ అండ్ వార్ కోర్స్ మే 4వ తేదీ ఆదివారం నేపాల్ పర్యటనకు ఖట్మాండు చేరుకుంది. ఇది అధ్యయన యాత్రగా చెబుతున్నారు. అయితే పాకిస్తాన్ బృందం సైనిక తర్ఫీదు ఇవ్వడానికి వచ్చిందని సాక్షాత్తు అమెరికా సైన్యమే వెల్లడించింది. ఖట్మాండులోని దర్శనీయల స్థలాలను చూడడంతో పాటు సైనిక తర్ఫీదు కార్యక్రమాలలో కూడా వీరు పాల్గొంటారని నేపాల్ సైన్యం చెప్పింది. దీనితో మే 6న ప్రతినిధుల సభలో మాట్లాడుతూ ఇండిపెండెంట్ సభ్యుడు అమరేశ్ కుమార్ సింగ్ తీవ్ర వ్యాఖ్యలే చేశారు. 'ఏ క్షణంలో అయినా ఆ రెండు దేశాల మధ్య యుద్ధం ప్రారంభమవుతుందని అంతా అనుకుంటున్న సమయంలో నేపాల్ ప్రభుత్వం ఆహ్వానం మేరకు పాకిస్తాన్ సైనిక ప్రతినిధి బృందం నాలుగో తేదీన వచ్చింది. అసలు పాకిస్తాన్ సైనిక ప్రతినిధి బృందాన్ని దేశానికి ఆహ్వానించి నేపాల్ ప్రభుత్వం ఎలాంటి సందేశం ఇవ్వాలని అనుకుంటున్నది?' అని నిలదీశారు. పాకిస్తాన్ సైనిక ప్రతినిధులు తర్ఫీదు కార్యక్రమానికి హాజరు కావడం రివాజేనని, ఈ కార్యక్రమం చాలా ముందే ఏర్పాటు చేసుకున్నదని నేపాల్ సైన్యం అధికార ప్రతినిధి గౌరవ్‌కుమార్ కేసీ వివరణ ఇచ్చారు. ఇలాంటి కార్యక్రమాలు నెల లేదా నెలా పదిహేను రోజుల ముందే ఖరారవుతాయని కూడా గౌరవ్‌కుమార్ చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలు కొన్ని ఇతర దేశాలతో కూడా ఏర్పాటు చేశామని కూడా తెలియ చేశారు.

కథ

సాయంకాల సమయం! హైదరాబాద్ సిటీలోని ఒక గేటెడ్ కమ్యూనిటీలో ఒక పక్క గుబురుగా పెంచిన చెట్ల మధ్య పచ్చని పచ్చికతో చిన్న పార్కు. చల్లని వాతావరణంలో సేద తీరడానికి కాలిబాట పక్కగా ఏర్పరిచిన సిమెంటు బెంచీపై, ఒంటరిగా కూర్చుని ఉంది యాభై ఏళ్లకు పైబడిన అమృతవల్లి. ఒంటరితనం అనుభవిస్తూ, తన గడిచిన జీవితం నెమరు వేసుకోసాగింది! ఈ ఒంటరితనం తనను వీడక ఎప్పుడూ వెన్నంటి ఉంటున్నదే!! ఈరోజుకీ.. వదలక తీరని మనోవేదన కలిగిస్తున్నదే!

మధ్య తరగతి ఉద్యోగస్థులైన దంపతులకు తను ఒక్కగానొక్క కూతురు. తన బాల్యం, మరో తోబుట్టువు తోడు లేకుండానే గడిచింది! అమ్మా నాన్నా ఆఫీసులకు వెళితే, బిక్కు బిక్కుమంటూ, ఇంట్లో ఒంటరిగానే గడిపేది!! స్కూల్లో స్నేహితురాళ్లు, తమతమ కుటుంబాల్లో జరిగే సరదా ఆటలు, మాటల కబుర్లు చెబుతూ ఉంటే,... అలాంటి అనుభవాలు, అనుభూతులు తనకు లేవే అని, ఎంతో దిగులుపడేది! తనకు ఇంటి కంటే, స్కూలులోనే కాలక్షేపం బాగా జరిగేది!! అందుకే.. స్కూలు ఎప్పుడూ మానకుండా, శ్రద్ధగా చదువు సాగించింది. ఆపైన డిగ్రీ, బీఈడీ కూడా పూర్తిచేసి, తనకు ఇష్టమైన ఉపాధ్యాయ వృత్తిలో చేరింది! అలా.. నలుగురి మధ్యలో స్కూలు వాతావరణంలో, పిల్లల మధ్య ఇష్టంగా గడుపుతూ, చాలా ఆనందంగానే గడిపింది, అప్పటి ఆ దినాలు!

ఆ తర్వాత,.. యుక్తవయసులో కెమికల్ ఇంజనీర్ కరుణాకరరావుతో వివాహం అయిన తర్వాత అయినా.. భర్త సాహచర్యంలో, సంసార జీవితంలో నైనా.. ఒంటరితనం విముక్తి కోసం కన్నకలలు, ఆశలు ఎండమావిగానే ముగిశాయి! భర్తకు నైట్ డ్యూటీలు, ఆఫీస్ టూరులు... తనకేమో.. పగటి పూట ఉద్యోగంతో జీవితం అనాసక్తంగా సాగింది తప్ప తానాశించిన విధంగా దాంపత్య జీవితం లేదు! భర్త కూడా, సంసార జీవితం అంటే.. యాంత్రికంగా గడపాడేకానీ బాంధవ్య బంధాల పట్ల పెద్దగాఆసక్తి, అనురక్తి కలిగిననుట్ల ఎన్నడూ ప్రవర్తించలేదు! ఎలాంటి అనుభూతులు లేకుండానే, ఒక బిడ్డకు తల్లి కూడా అయ్యింది! కొడుకు వివేక్‌ను అల్లారు ముద్దుగా, ప్రాణప్రదంగాపెంచి పెద్ద చేసింది.

కొడుకుకు ఏడెనిమిది ఏళ్ల వయసున్నప్పుడు జరిగిన ఒక సంఘటన తనకు బాగా జ్ఞాపకం!అది తన బతుకులో మరో మలుపునకు కారణమయ్యింది!! వివేక్ చదువుతున్న కార్పొరేట్ స్కూలు ప్రిన్సిపాల్ తనను పిలిచి చెప్పిన విషయం–

"వివేక్ తరగతి సోషల్ టీచర్, 'కుటుంబం' అనే పాఠం బోధించే సందర్భంగా, ఫ్యామిలీ ఫోటో తీయించుకు రమ్మంటే.. మీ చిన్నారి వివేక్ చెప్పిన సమాధానం –

'కుదరదు టీచర్!.. మా నాన్నకు నైట్ డ్యూటీలు! అమ్మకు పగలు ఆఫీసు!.. సోమవారాల్లో సెలవు, నాన్నకు బుధవారాలు ఆఫ్!.. మరి నాకేమో ఆదివారం సెలవు' అంటూ.. మీ ఇంటి పరిస్థితిని వివరిస్తూ, అమాయకంగా తెలియ జేసాడు!... అలా అయితే పిల్లవాడి భవిష్యత్తు ఎలా?!"అంటూ.. విషయం విశదపరిచి, బాగోగులు నచ్చజెప్పి, తనకు కనువిప్పు కలిగించింది!

వెనువెంటనే బాధ్యతగా భావించి, తను చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి, ఇంటికీ, కొడుకు వివేక్ బాగోగులు, పెంపకానికే పూర్తిగా అంకితం అయ్యింది ఆ తర్వాతంతా! వివేక్‌ను మంచిగా చదివించి, సాంకేతిక పట్టభద్రుడై పెద్ద కంపెనీలో మంచి జీతంతో స్థిరపడే వరకు, వెన్నుదన్నుగా నిలచి పెంచింది, తన భర్తకు ఏమంత తీరిక, వీలు చిక్కక పోయినాఅతన్ని అనుకోవలసిన పని మాత్రం ఏముంది! అతని ఉద్యోగ విధులు, ధర్మం, బాధ్యతలు అలాంటివి!! డ్యూటీ షిఫ్టులు, తరచూ టూర్ల ప్రయాణాలతో, కాలక్రమేణా.. అతని ఆరోగ్యం కూడా దెబ్బతింటూ వచ్చింది! ఆర్థికంగా ఎంత ఎదిగినా, ఆస్తులు కూడబెట్ట గలిగినా, పదవీ విరమణ వయసు వరకూ కొనసాగలేక పోయాడు. అనేక ఆరోగ్య సమస్యలు, రుగ్మతలతో స్వచ్ఛంద పదవీ విరమణ చేసి, పిన్న వయస్కుడు గానే.. కొడుకును తనను ఒంటరులను చేసి వెళ్లిపోయాడు. అటుపైన తనది మళ్లీ ఒంటరి జీవితం! కొడుకు పైచదువులకై, వేరే చోటికి యూనివర్సిటీ కాలేజీకి వెళ్లినా తిరిగి ఒంటరితనం భరించలేక, కాలక్షేపం కోసమని ఎప్పుడో మానేసిన ఉద్యోగంలో చేరి, ఏడాది క్రితం వరకు బాధ్యతగా విధులు నిర్వర్తించింది.

ఏడాది క్రితమే.. కొడుకు వివేక్ తోటి ఉద్యోగస్తురాలు మాధురిని ఇష్టపడితే, ప్రేమ వివాహం



సంక్షోభం

గోపరాజు వెంకట సూర్యనారాయణ



కూడా జరిపించి ఒక ఇంటివాడిని చేసింది! దంపతులు తమ కొత్త కాపురానికి హైదరాబాదులో, ప్రస్తుతం ఇప్పుడుంటున్న కమ్యూనిటీలోని, ఒక బహుళ అంతస్థుల భవనం పదవ అంతస్తులో, మూడు పడక గదుల ఫ్లాట్ తీసుకొన్నారు. తనను కూడా వచ్చేయమని కోరితే, కాదనలేక కొడుకు సంసారానికి సహాయంగా ఉండొచ్చని వచ్చి చేరింది. కొడుకు కోడలు డ్యూటీకి వెళ్లిన తర్వాత తనకు ఒంటరిగా ఇంట్లో ఉండి గడపటం తప్పటం లేదు!

ఇలా.. ఆలోచనలు, పాత అనుభవాల జ్ఞాపకాలు మనసులో సుళ్లు తిరుగుతూ,చూస్తుండగా, పొద్దువాలి చీకటి పడిపోయింది! కొడుకు కోడలు వచ్చే వేళయ్యిందని, హడావిడిగా లిఫ్ట్ వైపు నడిచింది అమృతవల్లి, ఆనాటికి దినచర్య సాయంత్రం వాహ్యాళి ముగించుకొని!!

ఫ్లాట్‌లోకెళ్ళి కాఫీ ఫలహారాలు సిద్ధం చేసి, కొడుకు, కోడలు రాకకోసం ఎదురుచూడసాగింది! వాళ్లు రాగానే కాఫీ తాగి, తిరిగి ఫ్రెష్ గా తయారయి అరగంటలోనే, హడావిడిగా బయటకు వెళుతూ.. వివేక్ తల్లితో

"అమ్మా! మేం బయట చిన్న పార్టీకి వెళుతున్నాం! తిరిగి వచ్చేసరికి ఆలస్యం కావచ్చు!! నువ్వు భోంచేసి పడుకో! మాకోసం ఎదురుచూడకు!" అని చెప్పి,.. మారు మాటకైనా ఎదురు చూడకుండా వెళ్లిపోయారు.

ఇదేమీ కొత్త అనుభవమేమీ కాదు తనకు! వాళ్లు ఆఫీసు నుంచి వస్తారు, స్థిమితంగా నాలుగు కబుర్లు, ముచ్చట్లతో కలిసి భోజనాలు చెయ్యొచ్చని తాను ఎదురుచూడడం, అదేమీ పట్టనట్టుగానే.. రాగానే, రెడీగా ఉన్న ఫలహారం కాఫీ కానిచ్చి, వారి గదిలోకెళ్లి, వారివారి సొంత పనుల్లో మునగడమో, విశ్రమించటమో తప్ప, తనతో తీరిగ్గా కలిసి ముచ్చటిస్తూ గడిపిన సందర్భాలు, వేళ్ల మీద లెక్కించుకోవలసిందే!

అసలు తప్పంతా తనదే! కొత్త సంసారం వాళ్లంతట వాళ్లు కుదుటపడి స్థిరపడకుండానే వాళ్లు 'వచ్చేయ్' అనగానే, రావడం మొదటి పొరపాటు! కొడుకుతో కలిసి ఉండొచ్చు కదా అనే ఆశతో, అక్కడి తన ఒంటరి జీవితం ఉద్యోగం వదలి ఇక్కడి కొచ్చి ఇంటి బాధ్యతనంతా తలకెత్తు కోవటం మరో తప్పు!! అదే అదనుగా చూసి.. కోడలు పిల్ల తన ఇంటి బాధ్యత, వూర్తిగా విన్మరించి ప్రవర్తించటం తనకు నిత్యం వేదననే మిగులుస్తోంది.

మరోపక్క కోడలు మాధురి, అత్తగారనే మర్యాదైనా చూపకపోగా, కనీస మన్నన ఆప్యాయత కూడా కనబరచకపోవటం మరింత ఎక్కువ బాధిస్తోంది. దానికితోడు.. తనతో అవసరమైన ప్పుడల్లా, భర్త ద్వారానే తెలియపర్చడం, మధ్యవర్తిగా వివేక్‌తోనే కబురు పంపడం లాంటివి, చాలా చిరాకు, చికాకు కలిగిస్తున్నాయి! వంట ఇంటి బాధ్యతలో కొంతైనా కోడలికివ్వాలనే తలంపుతో, ఉదయం పూట ఆఫీసులకు తీసుకెళ్లే టిఫిన్ బాక్సుల వ్యవహారం చూడ్డం, అంత తొందరగా తన వల్ల కావటం లేదని చెపితే.. "సరే అయితే! అలాగేలే! అని, ఆరోజు నుంచి ఆఫీసు కాంటీన్‌లోనే తింటున్నారు. కోడలు మాధురి వంటిల్లు వైపు చూసింది లేదు. తన కోసమైనా ఇంట్లో ఒంటరిగా వంట చేసుకొనే శ్రమ, రోజంతా ఒంటరిగా గడపటం తప్పటం లేదు. అందుకే.. తానిలా బయటి ప్రపంచం, వాతావరణం చూడ్డానికైనా వీలవు తుందనే, సాయంత్రాలు కిందకి దిగి, కాసేపు పార్కులో గడపటం అలవాటు చేసుకుంది!

ఒక రోజు పార్కుకు రావటం కొంచెం ఆలస్యం అయ్యింది! తాను రోజూ విశ్రమించే బెంచీ మీద వేరే ఎవరో కూర్చుని ఉండడం చూసిన తాను అల్లంత దూరంలోనే ఆగిపోయింది. అది గమనించిన ఆ పెద్ద మనిషి, " రండి కూర్చోండి! రోజూ ఈ స్థలంలో మిమ్మల్ని చూస్తూనే ఉన్నాను! ఆలస్యమైతే ఈరోజు రారనుకున్నాను!" అంటూ సాదరంగా ఆహ్వానించి లేచి నిలబడ్డాడు.

దానికి తబ్బిబ్బయి, ''లేదు లేదు! మీరు కూర్చోండి!"

"నేనా పక్కగా కూర్చుంటానులెండి" అంటూ.. మొహమాటంగా ఇంకోవైపు చివర ఒదిగి కూర్చుంది.

నా నడక ప్రదక్షిణాలు ఇప్పుడే పూర్తయ్యాయి!

నేను కొన్నాళ్లుగా రోజూ.. ప్రతి ప్రదక్షిణలోనూ మిమ్మల్నిక్కడ ఒంటరిగా కూర్చోని ఉండడం చూస్తూనే ఉన్నాను. మీరు, ఇక్కడకు కొత్తగా వచ్చారా?" అంటూ వివరం అడిగాడు.

"అవునండీ! కొన్ని నెలల క్రితమే మా అబ్బాయి వివేక్ దగ్గరకు వచ్చాను. రెండవ బ్లాకు పదవ

అంతస్తులో ఉంటున్నాము.” చెప్పింది.

“అలాగా.. నేనూ మీ వెనకే, నాలుగో బ్లాకులో ఆరో అంతస్తులోనే ఉంటాను ఒంటరిగా! నా పేరు ఆనందరావు, రిటైర్డు ఫిజిక్స్ లెక్చరర్ని. మూడేళ్లుగా భార్యా వియోగిని. పిల్లలిద్దరకూ పెళ్లిళ్లయిపోయి అబ్బాయి అమెరికాలో, అమ్మాయి ఢిల్లీలో ఉంటారు. ఇదండీ! క్లుప్తంగా నా పరిస్థితి!” అంటూ తన వివరణ ఇచ్చాడా పెద్ద మనిషి. ఇన్నాళ్లకు స్నేహపాత్రంగా మాట్లాడే ఒక వ్యక్తి తారసపడినందుకు తన మనసు ఎంతో సంతోషపడింది ఆనాడు.

అప్పటినుంచీ అక్కడే ఆయన తరచు తారసపడుతూ పలకరించి మాట్లాడుతూనే ఉన్నాడు కలుపుగోలుగా! మనిషి మర్యాదస్తుడు, గౌరవించి స్నేహపూర్వకంగా మాట్లాడే మనిషి కావడంతో, తను కూడా సంభాషణ కొనసాగిస్తోంది కాలక్షేపంగా! సాయంత్రాలు అలా మరో వ్యక్తితో మాటామంతి సాగడంతో, తన ఒంటరితనానికి ఒకింతసేపు ఎంతోకొంత ఆటవిడుపు దొరికినట్టయ్యి, సంతోషంగానే వుంది.

వారాంతాల్లో.. శని ఆదివారాలలో కూడా, కొడుకు కోడలు తనతో గడిపేది తక్కువే! వారికి జంటగా గడిపే, విలాస విహార ప్రోగ్రాములే ఎక్కువ!! తాను ఇంటిలో ఒంటరిగా ఉంటానన్న ధ్యాసే, వారికి ఉన్నట్టు తోచదు! తాను ఇంటికి ఒక కాపలాదారుగా గడపవలసి వస్తోంది ఇన్నాళ్లుగా!

అలా ఒంటరితనం భరించలేక, ఉండబట్టలేక ఒకరోజు కొడుకు వివేక్ తో.. “బాబూ! వివేక్!.. రోజంతా ఒంటరిగా గడపటం నావల్ల కావటం లేదురా! నలుగురితో గడిపే వ్యాపకం ఏదైనా చూడరా నాకోసం! ” అడిగింది.

“అమ్మా! నీకు ఈ వయసులో ఇంకా ఏమి వ్యాపకం అమ్మా! విశ్రాంతిగా గడపాలిగాని! అయినా,.. రోజంతా ఇంట్లో పనే సరిపోతుంది కదమ్మా నీకు! ” అంటూ విషయాన్ని దాట వేశాడు ముద్దుల కొడుకు తమ సేవలోనే తరించమన్నట్టుగా సూచిస్తూ!

అమృతవల్లికి అర్థమయ్యింది! తన ఒంటరితనానికి అక్కడ విముక్తి లేదని, తన ఆశ వారితో నెరవేరదని! అందుకు తన ప్రయత్నమేదో తానే చేసుకోవాలని కృత నిశ్చయానికొచ్చింది! అదే ఆలోచనతో వార్తా పత్రికలో తనకు అనుకూలమైన ప్రకటనలకై దృష్టి సారించటం మొదలుపెట్టింది. ఏదో ఒక అవకాశం దారి దొరక్క పోతుందా అని! వయసు మీరిన కారణంగా ఉద్యోగ ప్రయత్నాలేవీ ఫలించ లేదు!

కానీ, పేపర్లోని ఒక ప్రకటన తనను బాగా ఆకర్షించింది! రెండు మూడు రోజులు తనలో తాను తర్జనభర్జన పడి, మనసు నిశ్చయ పర్చుకొన్న తర్వాత,.. కొడుకు కోడలు ముందుకు ఆ ప్రస్తావన తెచ్చింది!

అమృతవల్లి చేసిన ఆ అనుకోని,ఊహించ ప్రస్తావనకు కొడుకు కోడలు విస్తుపోయారు! అది విడ్డూరంగా తోచిన ఇద్దరూ వెంటనే తీవ్రంగా స్పందిస్తూ కోడలు మాధురి తీవ్రమైన స్వరంతో, భర్తతో, “ఇక మన పరువేం కావాలి? నలుగురికీ మనం ఏం జవాబు చెప్పుకోవాలి?”అంటూ రుసరుసలాడుతూ లోనికి వెళ్లిపోయింది.

కొడుకు వివేక్ కూడా,.. “అమ్మా! ఇప్పుడు నీకు ఇక్కడ ఏం తక్కువైంది? ఇలా ఈ విధంగా ప్రవర్తించడానికి!”అని ఆవేశంగా విరుచుకు పడ్డాడు.

అంతే ధీటుగా అమృతవల్లి, సమాధానం ఇచ్చింది.

“తక్కువైంది.. ప్రేమ, అభిమానం, ఆప్యాయత, కలుపుగోలుగా కలిసిమెలిసి మెలగడం. అన్నీ తక్కువై నేను ఏకాకిగా, ఒంటరి భావనతో మసల వలసి రావడం నాకు చాలా కష్టంగానే ఉంది! అందుకే ఈ సన్నాహ ప్రయత్నం!” అంటూ.. చేతిలో, అడ్రెసు కాగితాన్ని మరోసారి చూసుకుంటూ,.. ఆ వయోజన పరిచయ వేదిక, ‘తోడు నీడ’ నగర సాంస్కృతిక పరిషత్ హాల్ ఉన్న ప్రదేశం చేరుకోడానికి బయలుదేరింది.

* * *

స్నేహాన్ని ఇతరులతో పంచుకోడానికి, ప్రేమను ఇచ్చి పుచ్చుకోవడానికి, మనోపాజ్ లేదుగా మరి!!

అమృతవల్లి వేదిక వద్దకు చేరేసరికి, అప్పటికే.. ఎంతోమంది ఆడ మగ వయోజనులు చేరి, సభలో సభ్యులుగా పేర్లు నమోదు చేసుకుని కూర్చొని ఉన్నారు. తనుకూడా పేరు నమోదు చేసుకున్న కాసేపటికే వేదిక మీద ఒక్కొక్కరి స్వీయ పరిచయాల కార్యక్రమం మొదలయ్యింది.

మొదట.. పరిచయ వేదిక లక్ష్యాలు, ప్రాధాన్యాలు సమావేశకర్తలు వివరించిన తర్వాత, కార్యకర్తలు ఒక్కొక్కరిని పిలుస్తూ స్వీయ పరిచయం చేసుకొమ్మని కోరారు సభ్యులను.

అమృతవల్లికి ఆశ్చర్యంగా, ఆ సభలో అంతకు ముందు తనకు పరిచయం ఉన్న ఆనందరావు గారు కూడా ఎదురు పడ్డారు! ఇద్దరూ కాస్త బిడియ పడుతూనే ఒకరినొకరు పలకరించుకున్నారు.

వేదిక మీద అందరి స్వీయ పరిచయాలు అయిపోయిన తర్వాత, స్నేహపూర్వక ఇష్టాగోష్టిగా ఒకరినొకరు విడివిడిగా సన్నిహితంగా మాట్లాడు కొనేందుకు వీలుగా, ప్రత్యేక సమావేశాల ఏర్పాటుకు వీలుగా టేబుళ్లు ఏర్పాటు చేశారు.

ఆనందరావుతో ముందే కొంత పరిచయం ఉండడంతో అక్కడ అలా కలుసుకోవడం ఇద్దరికి కొంత వింతగానే అనిపించినా...మరింత చనువుగా, ఆప్యాయంగా అన్యోన్యంగా, అరమరికలు లేకుండా తమ పరిస్థితులు, శేష జీవితంపై తమకున్న ఆశలు, ఆకాంక్షలనన్నీ వివరంగా మాట్లాడుకొని, ఒకరినొకరు అర్థం చేసుకునే వీలు కల్పించిందా సమావేశం!

తిరుగు ప్రయాణంలో, ఇద్దరూ కలిసే కమ్యూనిటీకి చేరుకున్నారు! ఆనందరావు గారు మొదటిసారిగా తన ఇంటికి తీసికెళ్లి స్వయంగా ఆతిథ్యమిచ్చారు.

ఒంటరివాడైనా ఇల్లు చాలా శుభ్రంగా ఉంది! ఇంట్లో ఫర్నీచరు, గోడల మీది అలంకరణ ఆయన జీవనశైలిని అభిరుచిని తెలియజేస్తూ, ఎక్కడివక్కడ అమర్చినట్టుగా ఉన్నాయి! వాటినన్నిటినీ ఆకర్షణీయంగా నిత్యం కాపాడుతున్న రావుగార్ని అభినందించకుండా ఉండలేకపోయింది అమృతవల్లి!

దానికి రావుగారు సమాధానంగా

‘దానిదేముందండీ! ఒంటరిగాణ్ణి! ఇంట్లో ఉన్న చాలా వాటిని రోజూ ఉపయోగించేదే తక్కువ! ఏదో ఒక మూల ఏకాకిగా, పాత జ్ఞాపకాలతో కాలక్షేపం

‘కార్టూన్ పోటీ-2025’లో ప్రోత్సాహక బహుమతి పొందినది



చేయడంతోనే సరిపోతుంది నాకు! నా భార్యాపిల్లలు ఉండగా, ఇల్లు కళకళ లాడుతూ సందడిగా ఉండేది! ఈ వయసులో...ఈ పరిస్థితి నుండి బయటపడి మళ్లీ మంచితోడు సంపాదించి గడపాలనే ఆలోచనతో అక్కడికి వచ్చాను! ఈ ఆధునిక యుగంలో.. ఇది నా ఒక్కడి సమస్యే కాదని, నాలాగే పలు సమస్యలతో ఒంటరితనం నుంచి విముక్తి కోరేవాళ్లు చాలామందే ఉన్నారని, అక్కడికొచ్చిన వారి గోడు వింటుంటే అర్థమైంది.!!

''సారీ!.. క్షమించండి! నా ధోరణిలో చెప్పుకుపోతున్నాను. ఉండండి! కాఫీ ఇస్తాను!" అంటూ లేచాడు ఆనందరావు.

"ఆగండి! వంటిల్లు చూపించండి! ఆ ప్రయత్నం నేను చేస్తాను"అంటూ లేవబోయింది అమృతవల్లి.

''భలేవారే! నేను కూడా, వంటొచ్చిన మగాడినేనండీ!! నా ఈ 'తోడునీడా' ప్రయత్నం, తాపత్రయం తిండితిప్పలు తీర్చుకునేందుకే అనుకునేరు! నా చేతి వంట, కాఫీ రుచి చూశారంటే, మీరే మెచ్చుకుని మరో కప్పు కావాలని అడుగుతారు!" అంటూ.. ఆమె చొరవకు బ్రేకులు వేసి, తనే వంటింటి వైపు నడిచాడు.

కాసేపాగి వంటింటిలోని ఏర్పాట్లు కూడా చూడాలనే కుతూహలంతో, వెనకాలే వెళ్లింది అమృతవల్లి. వంటింటిని ముచ్చటగా ఉన్న తీరు చూసి మురిసి, రావుగార్ని మరోసారి నిండా అభినందించకుండా ఉండలేకపోయింది!

వెంటనే 'రావుగారూ! మీరు చూపిస్తున్న ఈ ఆప్యాయతకు, మీరిచ్చిన ఈ ఆతిథ్యానికి ధన్యవాదాలు! రేపటి ఆదివారం.. మీరు కూడా, దయచేసి మా ఫ్లాట్‌కి వస్తే, మా వాళ్లను కూడా పరిచయం చేస్తాను. మా ఇంటికి మీరు తప్పక భోజనానికే రావాలి! సరదాగా అందరం కలిసి గడపొచ్చు! అప్పుడే.. అక్కడికక్కడే, మన విషయమై కూడా, మావాళ్ల ముందరే, ఒక నిర్ణయానికీ రావచ్చు!" అంటూ.. ఆత్మీయంగా ఇంటికి భోజనానికి ఆహ్వానించింది.

* * *

ఆ రోజు రాత్రి భోజనాల తర్వాత, కొడుకు కోడలికి 'తోడు నీడ' పరిచయ వేదికలో జరిగిన విషయాలన్నీ వివరించి, కమ్యూనిటీలోనే ఉన్న ఆనందరావు గురించి కూడా చెప్పి, ఆదివారం ఆ పెద్దమనిషిని వారికి పరిచయం చేసేందుకు తమ ఇంటికి భోజనానికి ఆహ్వానించినట్లు కూడా తెలియజేసింది.

ఆ ఆదివారం ప్రొద్దున్నే ఫోన్ చేసి శుభోదయం చెప్పారు రావుగారు అమృతవల్లికి! ఆయన ఇంటికి వచ్చే సమయం నిర్ధారణ చేసుకుని విందు ఏర్పాట్లకు వంటింట్లో నిమగ్నమైంది. రావుగారు వస్తానన్న సమయం చెప్పి, ఇంట్లో వాళ్లను తయారుగా ఉండమని ఎలర్ట్ చేసింది. తల్లి హడావిడికి కాస్త

సుదీర్ఘమైన రావుగారి వివరణాత్మక భాషణ విన్నాక, వివేక్‌కు తల్లి పడుతున్న ఒంటరితనం ఆవేదన, కష్టం అర్థమయ్యాయి. ఇన్నాళ్లూ ఇలాంటి సమస్యకు ఇంత మంచి పరిష్కారం, అవకాశం ఉంటుందని ఊహించలేదు. తనను తీర్చిదిద్దడంలో తల్లి పాత్రను ఎరగనివాడు కాదు. అలాంటి తల్లి, ఒంటరితనం భరించలేక, విముక్తిని కోరుకుంటూ, తానే ఒక దారి ఎంచుకుంటే, ఎలా కాదనగలడు? పైగా ఒక సహృదయుడు తానై ఆ బాధ్యతను తీసుకుంటానని ముందుకొస్తే, కాదనేదేముంది?

చిరాకుగానైనా, ముభావంగా ఆయన రాక కోసం ఎదురుచూస్తూ గడిపారా భార్యాభర్తలు.

సరిగ్గా చెప్పిన సమయానికి వచ్చి తలుపు తట్టారు రావుగారు. వివేక్ తలుపు తీసి, నిండైన పెద్దమనిషిని సాదరంగా లోపలికి ఆహ్వానించాడు.

'హలో! వివేక్! నిన్నిలా కలవడం చాలా సంతోషం! మీ అమ్మగారు మీ విషయాలన్నీ చెప్పారు, మంచి స్థితిలో ఉన్నావని. నా కొడుకు తరుణ్ వయసు వాడివే! నిన్ను చూస్తుంటే వాడే గుర్తుకొస్తున్నాడు! వాణ్ణి చూసి ఏళ్లు గడుస్తున్నాయి! వాళ్ల అమ్మ పోయినప్పుడు మూడేళ్ల క్రితం వచ్చాడు అమెరికా నుంచి. మళ్లీ రాలా! అంటే, ఏవేవో సాకులు చెపుతాడు"అంటూ దూరంగా ఉన్న కొడుకును గుర్తుచేసుకున్నారు రావుగారు. ఆయన మాట్లాడే ఆప్యాయత ధోరణికి వివేక్‌కు కూడా, తన తండ్రి గుర్తుకు వచ్చాడు ఒక్కక్షణం! కాసేపు కుశల ప్రశ్నలు, ఆఫీసు కబుర్లతో ముచ్చటించాక, కాస్త చనువు ఏర్పడ్డాక...

"చూడు వివేక్! నా ఈ మాటలు శ్రద్ధగా పూర్తిగా ఆలకించు. ప్రస్తుతం నేను, మీ అమ్మగారు ఒకే పరిస్థితిలో, ఎటూకాని వయసులో, మాట్లాడే తోడు లేక ఒంటరి జీవితాలు గడుపుతున్నాం! మీ దంపతులకా ఆఫీసులతో నిండా పని! పైగా.. వయసులో తరాల భేదం!, జీవన వ్యత్యాసం! మీ అమ్మగారిని చాలా రోజులుగా సాయంకాలాలు కింద పార్కులో ఒంటరిగా ఆలోచిస్తూ దిగులుగా ఉండడం చూస్తున్నాను. నా పరిస్థితి కూడా అంతే! లంకంత కొంపలో ఒంటరిగా కాలక్షేపం! ఆప్యాయంగా మాట్లాడే తోడులేక దిగులు! మీ అమ్మగారితో పరిచయంతో, మొన్న 'తోడునీడ' వేదికలో కలిసినప్పుడు ఇద్దరం వివరంగా మాట్లాడుకొన్నాం! మా సమస్యకు ఒకరికొకరం తోడైతే పరిష్కారం లభిస్తుందని నమ్ముతున్నాం!

ఇలా రావుగారు కొడుకుతో ముచ్చటిస్తుండగా, వంటింటిలోంచి పని తెముల్చుకుని అమృతవల్లి కోడలు సహా హాలులోకి వచ్చి, రావుగారికి నమస్కరిస్తూ, వారితో చేరారు.

రావుగారు అందరినీ పరికించి చూసి కొనసాగింపుగా

'మరో విషయం! నా పిల్లలతో పాటు నిన్నూ సమంగా భావించి, నీకు తండ్రి సమానంగా అన్ని విషయాలలో చేదోడు వాదోడుగా ఉంటానని భరోసా ఇస్తాను! అలా అని.. నా బరువు బాధ్యతలేవి నీమీద మోపను సరికదా.. ఇక మీదట మీ అమ్మగారి పూర్తి బాధ్యతను నేను తీసుకుంటాను. ఇదీ.. సూక్ష్మంగా నేను చేస్తున్న ప్రతిపాదన! ఈ విధంగా మన రెండు కుటుంబాలు కలిసి ఒక్కటవుతాము. మా ఇరువురి శేష జీవితాలలో వెలితి తీరినట్లవుతుంది! మాకీ ఒప్పందం ద్వారా, అనుక్షణం ఒకరికొకరం తోడునీడగా మెలిగే అవకాశం కలుగుతుందని మేమిద్దరం గట్టిగా నమ్ముతున్నాము. మీ అందరి సమ్మతి సహకారం కూడా ఉంటే, మా సహజీవనం సంతోషంగా సాగగలదని మా నమ్మకం! ఈ రోజు మీ సమ్మతి తెలుసుకున్న మీదట, వీలయినంత త్వరలోనే మా అమ్మాయి, అబ్బాయిని కూడా రమ్మంటాను. వాళ్లు కూడా వచ్చిన తర్వాత మనమందరం ఏకకుటుంబ సముదాయమవుదాం!" అని ముగించి, వివేక్ అభిప్రాయం కోసం ఎదురు చూసారు రావుగారు.

సుదీర్ఘమైన రావుగారి వివరణాత్మక భాషణ విన్నాక, వివేక్‌కు తల్లి పడుతున్న ఒంటరితనం ఆవేదన, కష్టం అర్థమయ్యాయి. ఇన్నాళ్లూ ఇలాంటి సమస్యకు ఇంత మంచి పరిష్కారం, అవకాశం ఉంటుందని ఊహించలేదు. తనను తీర్చిదిద్దడంలో తల్లి పాత్రను ఎరగనివాడు కాదు. అలాంటి తల్లి, ఒంటరితనం భరించలేక, విముక్తిని కోరుకుంటూ, తానే ఒక దారి ఎంచుకుంటే, ఎలా కాదనగలడు? పైగా ఒక సహృదయుడు తానై ఆ బాధ్యతను తీసుకుంటానని ముందుకొస్తే, కాదనేదేముంది?

వివేక్ నిదానంగా మౌనం వీడి, 'సరేనండీ! తండ్రిలాంటి మీరు ఇంత చెప్పిన తర్వాత, మాకు మాత్రం అమ్మ సంతోషం కంటే మించి, కోరుకునే దేముంది? అమ్మ, మీరు శేషజీవితాన్ని స్నేహితులుగా తోడునీడై సంతోషంగా గడపగలరని మీ మాటలతో నమ్మకం కుదిరింది! నేను మీ ఇద్దరి ఒప్పందాన్ని మనస్ఫూర్తిగా అంగీకరిస్తూ, మిమ్మల్ని మా కుటుంబంలోకి గౌరవంగా ఆహ్వానిస్తున్నాను!" రావుగారికి వంగి నమస్కరించాడు వివేక్.

"ఈవిడ పేరు అమృతవల్లి! నాకు కొన్నాళ్లుగా కింద పార్కులో పరిచయం! రోజూ సాయంత్రాలు ఒకే సమయంలో ఒంటరిగా చూస్తుండడంతో నెమ్మదిగా మా పరిచయం పెరిగింది! ఇద్దరం ఏకాకులం కావటంతో మాటామాట కలసి స్నేహాభావం కుదిరింది. ఆత్మీయంగా కొద్దిసేపయినా రోజూ కలుస్తూ ఉండడంతో మా మాటలు కలిసాయి! ఇద్దరికీ కూడా మాటలాడే తోడు లేనివారం కాబట్టి, ఒకరిపై ఒకరికి సానుభూతి స్నేహం పెరిగాయి".

మాధురి కూడా, మరో మాట లేకుండా అంగీకారంగా, చిరునవ్వుతో అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేసింది!

ఆపైన అందరూ కలిసి సరదా కబుర్లు చెప్పుకుంటూ అమృతవల్లి చేతివంట విందు భోజనం ఆరగించారు.

చాలా కాలం తర్వాత సకుటుంబంగా, ఆనందంగా తృప్తిగా భోజనం చేసిన అనుభూతి కలిగింది అందరికి! "మనమిలాగే నందడిగా ఆప్యాయంగా ముందంతా గడపాలని ఆశగా ఉంది!" అంటూ.. ఆనందం వ్యక్త పరుస్తూ రావుగారు అప్పటికి సెలవు తీసుకున్నారు.

ఆ మరునాడే ఆనందరావు గారు అమెరికాలోని కొడుకుకి, ఢిల్లీలోని కూతురుకు ఫోన్లు చేసి, "అత్యంత అవసరంగా మాట్లాడవలసిన, సంప్రదించ వలసిన విషయాలున్నాయి" అని, పూర్తిగా విషయం విశదీకరించకుండా, కుటుంబ సమేతంగా వీలయినంత తొందరగా, పది రోజులు ఉండేటట్లుగా రమ్మని హుకుం జారీ చేశారు.

తండ్రి ఇలా.. అత్యవసరంగా రమ్మనటానికి కారణం ఏమిటో ఊహించలేక, ఒంటరి తండ్రికి ఏమయ్యిందోనన్న ఆదుర్దాతో, అన్నాచెల్లెలు ఒకరినొకరు ఆదరాబాదరా సంప్రదించుకొని, కుటుంబాల సమేతంగా హైదరాబాదు చేరుకున్నారు. తండ్రి ఆరోగ్యంగా ఉండడం చూసిన తర్వాత, మనసు కుదుట పర్చుకున్నారు.

'నాన్నా! మీరు ఈ హైదరాబాదు వదిలి రమ్మంటే రారు! కనీసం ఒక వంటమనిషినైనా కుదుర్చుకోక పోయారా?" అంటూ.. వాపోయింది కన్నకూతురు మీనాక్షి.

"అవును మావగారు.. మీరే ఇలా ఒంటరిగా చేయి కాల్చుకోవటమెందుకూ? మీ అమ్మాయి చెప్పినట్లు ఎవరినైనా కుదుర్చుకోక పోయారా?" వంత పాడాడు అల్లుడు విశ్వనాథం.

"అవును నాన్నా! అమెరికా అయితే మా తిప్పలు మేము స్వయంగా పడక తప్పదు ఎంత దర్జా వెలగబెట్టినా! ఇక్కడ అది సమస్య కాదుగా?" వరస కలిపాడు.. పుత్రరత్నం తరుణ్.

'నాకు.. వంట, తిండి, పెద్ద సమస్యలు కాదురా! ఇంతకాలం అందరితో సందడిగా గడిపినవాడిని! ఇంట్లో మాట్లాడే తోడు లేకుండా, ఒంటరిగా గడపటం ఒక్కటే, నాకున్న ఏకైక కష్టం" అని చెప్పి, అప్పటికి అందరిని సమాధానపరిచారు రావుగారు.

అన్నాచెల్లెళ్ల కళ్లు చెమర్చాయి. తల్లి ఉన్న రోజులు, వారి మనసుల్లో మెదిలి!

రెండు రోజుల తర్వాత అందరికి ప్రయాణ బడలికలు తీరాక, ఆ ఆదివారం కమ్యూనిటీలో పరిచయస్తులైన ఒక సన్నిహిత కుటుంబాన్ని, తమ ఇంటికి భోజనానికి ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించారు రావుగారు. తండ్రి వ్యవహార శైలి తెలిసిన వారందరూ, 'ఎవరా కొత్త మిత్రులు' అనుకొంటూనే, ఆరోజు కోసం ఆసక్తిగా ఎదురుచూడక తప్పలేదు.

ఆ ఆదివారం రావుగారు, మంచి హోటల్ నుంచి విందుకు ఘనంగానే ఆర్డర్ చేసి తెప్పించారు మొత్తం అన్నీ, వంటకై ఇంట్లోవాళ్ల నెవ్వరినీ కష్టపెట్టకుండా, శాంతిగా సావకాశంగా ఉండేందుకు వీలు కల్పిస్తూ!

అమృతవల్లి కుటుంబం ఇంటికి రాగానే, రావుగారు ఎదురేగి లోనికి తీసుకువచ్చి, తన కుటుంబ సభ్యులనందరిని పేరు పేరున పరిచయం చేశారు వారు ఆశీనులు అయిన తర్వాత, తన వాళ్ల వైపు తిరిగి, "మన కుటుంబంలోనివారి అందరి గురించిన వివరాలు ముందుగానే వారికి చెప్పాను. వచ్చిన అతిథుల గురించే మీకు నేను చెప్పాలి వివరంగా!" అంటూ మొదలు పెట్టారు

"ఈవిడ పేరు అమృతవల్లి! నాకు కొన్నాళ్లుగా కింద పార్కులో పరిచయం! రోజూ సాయంత్రాలు ఒకే సమయంలో ఒంటరిగా చూస్తుండడంతో నెమ్మదిగా మా పరిచయం పెరిగింది! ఇద్దరం ఏకాకులం కావటంతో మాటామాట కలసి స్నేహాభావం కుదిరింది. ఆత్మీయంగా కొద్దిసేపయినా రోజూ కలుస్తూ ఉండడంతో మా మాటలు కలిసాయి! ఇద్దరికీ కూడా మాటలాడే తోడు లేనివారం కాబట్టి, ఒకరిపై ఒకరికి సానుభూతి స్నేహం పెరిగాయి".

"ఈ మధ్యే ఒకనాడు.. ఇక్కడ సిటీలోని 'తోడు నీడ' అనే వయోజన పరిచయ వేదిక వద్ద, అనుకోకుండా తారసపడ్డాం. ముందే ఉన్న పరిచయంతో, అరమరికలు లేకుండా మనసు విప్పి మాట్లాడుకొని, ఒక నిర్ణయానికి వచ్చాము. మీ అందరినీ ఇక్కడకు రప్పించడానికి ముందే ఒకనాడు అమృతవల్లి గారి ఇంట్లో ఈ విషయం చర్చించి వారి కుటుంబ సభ్యులతో కూడా ఒక అవగాహనకు వచ్చాను. ఆ తదుపరి పర్యవసానమే, మిమ్మల్ని ఫోన్లు చేసి, ఇక్కడకు పిలవడం, ఈ రోజు ఇక్కడ మన సమావేశ ముఖ్యోద్దేశం కూడా!

"చూడండి! నేను మీ అందరికీ, ఒక్క విషయం తేటతెల్లం చెయ్యదల్చు కున్నాను! ఈ విషయంలో ఎలాంటి ఆస్తుల ఒడంబడికలు లేవు!మేం మీలో ఎవరిపైనా, సరికొత్తగా మోపబోయే బరువుబాధ్యతలు కూడా ఏమీ లేవు.

మేమిద్దరం ఒంటరితనం నుంచి విముక్తికై కోరుకొంటున్న సరికొత్త శేషజీవితం! ఈ చర్యతో.. రెండు కుటుంబాలు కలసి, ఒక విస్తృత సకుటుంబ మయ్యే అవకాశం. మేమిద్దరం అందుకు సంసిద్ధులమై ఉన్నాం! మీరంతా మనస్ఫూర్తిగా పూర్తి అంగీకారం తెలుపుతారన్న విశ్వసిస్తున్నాం" అంటూ..తమ నిర్ణయాన్ని విస్పష్టంగా, నిర్మొహమాటంగా ప్రకటించారు రావుగారు.

తండ్రి సుదీర్ఘ వివరణను ఆకళింపు చేసుకున్న రావుగారి పిల్లలు, ఒంటరిగా ఉంటున్న తమ తండ్రి, ఒంటరితనం వల్ల అనుభవిస్తున్న మనోవేదనను అర్థం చేసుకుని, దూరంగా ఎక్కడో ఉంటున్న తాము చేసే ఉపశమనం మరేదీ లేదని గ్రహించి, ఆయన విజ్ఞతతో తీసుకున్న నిర్ణయానికి అభినందనల రూపంలో తెలియజేశారు.

తేలికవడిన వాతావరణంలో, రెండు కుటుంబాలు కలిసి, కలివిడిగా పరిచయాలు, కబుర్ల మధ్య విందు భోజనం ఆరగిస్తూ, సంతోషంగా ఆనందంగా గడిపారు.

ఆనందరావు గారి పిల్లలు ఉన్నంతకాలం ఇరు కుటుంబాల సభ్యులంతా, ఒకే చోట కలసి సరదా ముచ్చట్లతో, కులాసాగా కాలక్షేపం చేశారు సందడిగా పాత రోజులను నెమరువేసుకుంటూ!!

ఆ తర్వాతి రోజుల్లో, అమృతవల్లి ఆనందరావుల సహజీవనం.. పరిణతి చెందిన వారిరువురి మధ్య, ఎలాంటి ఒడుదొడుకులు, పొరపొచ్చాలు లేకుండా, సాఫీగా సాగింది. ఒకరినొకరు వొద్దికగా మన్నించు కొంటూ, ఎన్నడూ ఏకవచన సంబోధనలకు ఆస్కారం లేకుండా వ్యక్తిత్వాలను గౌరవించుకుంటున్నారు. వారు, బాల్కనీ ఊయలమంచం నుంచి వారి మొదటి సమాగమం పార్కు బెంచీని వీక్షిస్తూ, సాయం సమయాలు, సరదా ముచ్చట్లతో గడుపుతున్నారు హాయిగా!

వచ్చేవారం కథ..

ఆరనికుమా తీడి!

- మల్లాప్రగడ బాలాత్రిపుర సుందరి

భారత సేనకు 'సైనిక' క్రీడాకారుల వెన్నుదన్ను

భారత క్రీడారంగానికి దశాబ్దాలుగా సేవలు అందించిన పలువురు దిగ్గజ క్రీడాకారులు గౌరవ సైనికాధికారులుగా మారితే... కొందరు సైనిక అధికారులు క్రీడాకారులుగా దేశఖ్యాతిని ఇనుమడింప చేశారు. సరిహద్దు ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న దాయాదిదేశం పాకిస్థాన్‌కు తగినరీతిలో భారత సైనికదళాలు బుద్ధి చెప్పడంతో యుద్ధమేఘాలు తేలిపోయాయి. దీంతో.. దేశమాత కోసం పోరాడటానికి సిద్ధమైన క్రీడాసైనికులు, సైనిక క్రీడాకారులు తమ సన్నాహాలను ప్రస్తుతానికి ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. అవసరమనుకున్నప్పుడు కదనంలో దిగడానికి సిద్ధమంటున్నారు.

పెహల్గామ్ కిరాతకానికి భారత్ తగురీతిలోనే బదులు తీర్చుకొంది. సిందూరాస్త్రంతో దీటైనరీతిలో ముష్కర పాక్‌కు బుద్ధి చెప్పడంతో సరిహద్దుల్లోని అలజడి చల్లారినట్లయ్యింది. పాకిస్థాన్‌తో యుద్ధం తప్పదనుకొన్న తరుణంలో దేశం యావత్తూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వానికి, సరిహద్దుల్లో పోరాడుతున్న సైనిక బలగాలకూ బాసటగా నిలిచింది. క్రీడారంగం సహా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు తమదైనరీతిలో సందేశాలు పంపడం ద్వారా మన సైనికుల్లో సమరస్ఫూర్తిని నింపారు.

భారత సైనికదళాలలోని వివిధ విభాగాలలో గౌరవ హోదా పొందిన కపిల్ దేవ్, సచిన్ టెండుల్కర్, మహేంద్రసింగ్ ధోనీతో పాటు సైనిక ఒలింపియన్లు రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్, నీరజ్ చోప్రాతో సహా పలువురు సమరానికి సైతం సిద్ధమని ప్రకటించినా.. కాల్పుల విరమణతో ఆగిపోవాల్సి వచ్చింది.

క్రీడల నుంచి సైనికదళాలకు

క్రీడారంగం నుంచి.. ప్రధానంగా క్రికెట్ నుంచి సైనికదళాలలో గౌరవహోదాతోపాటు శిక్షణ పొందిన దిగ్గజ ఆటగాళ్లు పలువురు ఉన్నారు. దేశానికి 1983 వన్డే ప్రపంచకప్ అందించిన హరియాణా హరికేన్ కపిల్‌దేవ్ భారత ప్రాదేశిక దళాల నుంచి లెఫ్ట్‌నెంట్ కర్నల్‌గా గౌరవ హోదా పొందారు. 2008లో భారత సరిహద్దు భద్రతా దళాలలో గౌరవ్ లెఫ్ట్‌నెంట్ కర్నల్‌గా చేరి.. సాధారణ సైనికుడిలా శిక్షణ పొందారు. భారత క్రికెట్‌కు కపిల్‌దేవ్ చేసిన అసమానసేవలు, అన్నింటికీ మించిన దేశభక్తిని గుర్తించి గౌరవ లెఫ్ట్‌నెంట్ హోదాను కల్పించారు.

విమానదళంలో సచిన్ టెండుల్కర్

భారత క్రికెట్‌కు రెండుదశాబ్దాలపాటు అపూర్వ సేవలు అందించిన వంద సెంచరీల మాస్టర్ సచిన్ టెండుల్కర్ రిటైర్మెంట్ ప్రకటించిన రెండేళ్లకు (2010) భారత వైమానికదళం గ్రూప్ కెప్టెన్ గౌరవ హోదాతో సత్కరించింది. 83వ భారత వైమానికదళ దినోత్సవాలలో భాగంగా వైమానికదళం ధరించే దుస్తులను ప్రదానం చేసింది. రాజస్థాన్‌లోని పొఖ్రాన్‌లో నిర్వహించిన వాయుశక్తి వైమానిక పాటవ ప్రదర్శనకు సచిన్‌ను ముఖ్యఅతిథిగా ఆహ్వానించింది. భారత వైమానికదళం అమ్ములపొదిలోని మిగ్-29 ఫైటర్లు, సుఖోయ్-30, మిరాజ్ -2000 జాగ్వార్, మిగ్ -21, జైసన్ మిగ్ -27,మిగ్ -29, ఐఎల్ 78, హెర్క్యులెస్, ఏఎన్ -32 విమానాల విన్యాసాలు చూసిన సచిన్ తన జన్మధన్యమైందని ప్రకటించాడు.

పారాట్రూపర్ గా మహేంద్రసింగ్ ధోనీ

భారత్ కు రెండు ప్రపంచ కప్‌లు, 15 సంవత్సరాలుగా భారత క్రికెట్‌కు ఘనమైన సేవలు అందించి దేశ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ కెప్టెన్‌గా నిలిచిన మహేంద్ర సింగ్ ధోనీ పూర్వికులకు భారత సైనిక దళాలతో సంబంధం ఉంది. 2011లోనే భారత ప్రాదేశిక దళాలకు చెందిన పారాట్రూప్ వింగ్‌లో ధోనీ.. గౌరవ లెఫ్ట్‌నెంట్ కర్నల్ హోదా సంపాదించాడు. తాను విశ్వవిఖ్యాత క్రికెటర్‌గా నిలిచినా.. ఓ సైనికుడుగా సేవ చేయాలని కంకణం కట్టుకొన్నాడు. ఆగ్రాలోని భారత సైనికదళాల పారా ట్రూప్ శిక్షణ విభాగంలో.. ఐదుసార్లు పారా ట్రూప్ జంప్‌లు చేయడం ద్వారా సుక్షితుడైన పారాజంపర్‌గా గుర్తింపు సంపాదించాడు.

సైనిక క్రీడాకారులు రాజ్యవర్ధన్, నీరజ్

కపిల్, సచిన్, ధోనీ క్రికెట్ నుంచి సైనిక దళాలలోకి అడుగుపెడితే... మాజీ ఒలింపియన్ రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్, రెండుసార్లు ఒలింపిక్స్ పతక విజేత నీరజ్ చోప్రా మాత్రం సైనిక దళాల నుంచి క్రీడారంగంలోకి అడుగుపెట్టి దేశానికే గర్వకారణంగా నిలిచారు. ఏథెన్స్ ఒలింపిక్స్ షూటింగ్‌లో భారత్‌కు రజత పతకం సాధించడం ద్వారా చరిత్ర సృష్టించిన రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ అప్పటికే భారత సైనికదళాలలో అధికారిగా పనిచేస్తున్నారు. ఆ తర్వాతి కాలంలో కేంద్ర క్రీడా మంత్రిగా కూడా రాజ్యవర్ధన్ సేవలు అందించారు.

మరోవైపు బల్లెం విసురుడులో బాహుబలిగా పేరుపొందిన, రెండు ఒలింపిక్స్ పతకాల మొనగాడు నీరజ్ చోప్రా సైతం భారత సైనికదళాలలో జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు.

టోక్యో ఒలింపిక్స్‌లో బంగారు పతకం, పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకాలతో పాటు..విశ్వవిజేతగా స్వర్ణపతకం సాధించిన నీరజ్ భారత్‌కు మాత్రమే కాదు.. భారత సైనిక దళాలకు సైతం అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చాడు. ఇటు క్రీడాకారులు గానూ, అటు గౌరవ సైనిక అధికారులు గానూ సేవలు అందిస్తున్న కపిల్, సచిన్, ధోనీతోపాటు సైనిక రంగం నుంచి క్రీడారంగంలో పతకాల మోత మోగించిన రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్, విశ్వవిజేత నీరజ్ చోప్రా దేశంలోని కోట్లాదిమంది యువతకు స్ఫూర్తిగా నిలిచిపోతారు. ★

కృష్ణారావు చాప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

జాతీయ భావాలను సమాజంలోకి తీసుకుపోవాలి

జాగృతి పాఠకుల ఆత్మీయ సమ్మేళనంలో కాచం రమేశ్

సికింద్రాబాద్ : జాగృతి చదవడం ద్వారా మాతృభాష తెలుగును మన కుటుంబాలలోని భావితరాలకి అందించిన వారమవుతాము. తెలుగులో అనేక పత్రికలు బాగా నడిచాయి. కానీ ఏడున్నర దశాబ్దాలుగా నిరంతరంగా నడుస్తున్న ఏకైక తెలుగు పత్రిక జాగృతి వారపత్రిక అని జాగృతి పాఠకుల ఆత్మీయ సమ్మేళనంలో తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేశ్ అన్నారు.

సికింద్రబాద్, సింధు భవన్‌లో మే 11న జరిగిన ఈ కార్యక్రమం జరిగింది. జాగృతి సంచలన వార్తలు (బ్రేకింగ్ న్యూస్)రాసే పత్రికకాదు, ఉద్యోగ పత్రిక కాదు, అయినప్పటికీ ఇన్ని సంవత్సరాలుగా నిరంతరంగా నడవడానికి కారణం సత్యాన్ని నిర్భయంగా పాఠకులకు అందజేయడమే. అనేక దండయాత్రలను మనం ఎదుర్కొన్నాం. బానిసత్వాన్ని చవి చూశాం. 1947లో స్వాతంత్ర్యం వచ్చాక మన బడ్జెట్‌లో సుమారు 70 శాతం రక్షణ కోసం కేటాయించుకోవలసిన దుస్థితి బ్రిటిష్‌వారి కుటిలనీతివలన ఏర్పడింది అని ఆయన చెప్పారు.

జాగృతి ఆవిర్భావం వెనుక ఉన్న వాస్తవాన్నికూడా ఆయన వివరించారు. 19వ శతాబ్దంలో ఇది హిందూరాష్ట్రం అనే సత్యాన్ని నమ్మి హిందూ సంఘటనకై డాక్టర్ హెడ్గేవార్ ఆర్ఎస్ఎస్‌ను ప్రారంభం చేశారు. 1948లో అసత్యం ఆధారంగా ఆర్ఎస్ఎస్‌పై నిషేధం విధించినపుడు ఇది తప్పు అని ఒక్క పార్లమెంటు సభ్యుడు కూడా గొంతు విప్పలేదు. ఒక్క పత్రిక కూడా నిషేధం అర్థరహితం అని రాయలేదు. ఆ సమయంలోనే ఢిల్లీలో ఆర్గనైజర్, పాంచజన్య పత్రికలతోపాటు తెలుగులో విజయవాడ కేంద్రంగా జాగృతి పత్రిక ప్రారంభమైంది. జాగృతి పత్రిక కేవలం వార్తలను అందించే పత్రిక కాదు. కానీ జరిగిన విషయాలను విశ్లేషణాత్మకంగా ప్రజలకు అందివ్వడమే గాక దాని వెనుక ఉన్న సత్యాన్ని కూడా ప్రతిపాదిస్తూ జాతీయభావంతో ప్రజలను ప్రభావితం చేస్తున్న ఏకైక పత్రిక జాగృతి అని రమేశ్ చెప్పారు.

జాగృతి చేతిలో ఉంటే మన విలువ ఇనుమడిస్తోంది. ఇంట్లో ఉంటే ఆ ఇంటి ప్రతిభ పెరుగుతుంది. చాలామంది జాగృతి పత్రికను చదివి సంఘానికి కనెక్ట్ అవుతున్నారు. తెలుగు రాష్ట్రాలలో ఉన్నత విద్యా ప్రమాణాలతో వేలాదిమందికి విద్యను అందిస్తూన్న శిశుమందిరాలను ప్రారంభంచేసిన ఎస్ఎల్ఎన్ ఆచార్యులు ప్రచారక్‌గా రాకపూర్వం ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉంటూ జాగృతి చదివి ప్రభావితుడై ఉద్యోగానికి రాజీనామా చేసి సంఘప్రచారక్‌గా వచ్చి పూర్తిజీవితాన్ని భారత మాతసేవలో సమర్పించు కున్నారు.

ఏదైనా సామాజిక విషయాలపై ఉపన్యసించాలంటే జాగృతిలో వస్తున్న విషయాలను చదివితే ఎంతో సమాచారం లభిస్తుందన్నది అనేకమంది అనుభవం. అనేక పోటీపరీక్షలకు తయారయ్యేవారు కూడా జాగృతి చదవడం ద్వారా లబ్ధిపొందుతున్నారు. గతంలో పాలమూర్ విభాగ్ సంఘచాలక్‌గా బాధ్యత నిర్వహించిన డాక్టర్ బీచుపల్లి పాలమూరు జిల్లా ఆత్మకూరులో ప్రముఖ వైద్యులుగా ఉంటూ రోజూ రాత్రి నిద్రపోయేముందు 10 ని.లు జాగృతి, 10 ని.లు పాంచజన్య హిందీ వారపత్రిక జీవితాంతం చదవడం ద్వారా ఎంతో జ్ఞానాన్ని సంపాదించుకున్నానని అనేక సందర్భాలలో చెప్పారు.

'పత్రికొక్కటున్న చాలు పదివేల సైన్యం' అనేది నార్ల (నార్ల వెంకటేశ్వరరావు, ఆంధ్రజ్యోతి సంపాదకులు) వారి మాట. నేడు జరుగుతున్నది సాధారణ పోరాటం కాదు, తీవ్రమైన సైద్ధాంతిక పోరాటం. ఉదాహరణకు తెలుగు రాష్ట్రాలలో జాతీయ వాదంపై సైద్ధాంతికంగా పోరాటం చేస్తున్న వారి సంఖ్య అతి స్వల్పమైనప్పటికీ వారు చెబుతున్న విషయాలకు విశేష ప్రచారం మీడియా ద్వారా కల్పించబడుతున్నది. మనకు పవిత్రమైన శరగోపం, దక్షిణ లాంటి పదాలను వ్యంగ్యంగా వాడుతూ రామాయణం రంకు, భారతం బొంకు అని అనే కథనాలకు కథనాలను పత్రికలలో వ్రాస్తూ ప్రజలను హిందూ సంస్కృతికి దూరం చేస్తున్నారు.

జాగృతిని మన ఇంటికి తెప్పించుకోవటమే కాకుండా, అందులోని విషయాలను అధ్యయనంచేసి, ఆకలింపు చేసుకొని పదిమందికీ ఆ భావాలను పంచాలి. తద్వారా జాగృతి అందిస్తున్న సత్య సిద్ధాంతంతో కూడిన జాతీయ భావజాలాన్ని సమాజంలోకి విస్తృతంగా తీసుకుపోవడం సంఘశతాబ్దిలో వేగవంతం చేద్దాం. ఇది నేటి తక్షణ అవసరం.

ఈ కార్యక్రమంలో విభాగ్ సంఘచాలక్ డి. దుర్గారెడ్డి, ప్రాంత ప్రచారప్రముఖ్ కట్టా రాజగోపాల్, జాగృతి ప్రకాశన్ ట్రస్ట్ కార్యదర్శి పులిగద్ద రాఘవేంద్ర, జాగృతి అసోసియేటెడ్ ఎడిటర్ కుర్రాదుర్గారెడ్డి, సంభాగ్ ప్రచారప్రముఖ్ నవీన్, విభాగ్ ప్రచార ప్రముఖ్ కల్యాణ్‌రావు కోలార్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు. ★

స్వయంసేవకులకు ఆత్మీయుడు

ప్రాంత సహకార్యవాహగా పనిచేసిన జ్యేష్ఠ కార్యకర్త, స్థానం భావనారాయణ మే 10తేదిన కన్నుమూశారు. 1940 నవంబర్ 21న బాపట్లలో జన్మించారు. బాల్యంలోనే పెద్దల మార్గదర్శనంలో బాలరామాయణం, భజనలు, భక్తి గీతాలు కంఠస్థం చేశారు. 12వ ఏట బాల స్వయంసేవక్‌గా సంఘంలో ప్రవేశించి 1952 నుండి శ్రీరాంసాతే మార్గదర్శనంలో సంఘకార్యకర్తగా ఎదిగారు. 1960లో హైదరాబాద్ వచ్చి ఎంప్లాయిమెంట్ ఎక్స్‌చేంజ్‌లో ఉద్యోగ నిమిత్తం పేరు నమోదు చేసుకున్నారు. అర్ధగంటలో ఎక్స్‌ఛేంజ్ ద్వారా స్పాన్సర్ చేయబడి ఇన్స్‌పెక్టర్ జెనరల్ ఆఫ్ పోలీస్‌వారు నిర్వహించిన పరీక్షలో పాసై టైపిస్టుగా చేరారు.

ఆనాటి ప్రభుత్వ విధానం ప్రకారం వారి పుట్టుపూర్వోత్తరాల గురించి గుంటూరు జిల్లాలో విచారణ చేశారు. ఆ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌వారి నివేదికలో సంఘంలో వీరి పరిచయం, తీసుకున్న శిక్షణ వివరాలు, గోవా విమోచన పోరాటంలో ఊరేగింపులు నిర్వహించి అరెస్ట్ అయిన వివరాలు, 1958లో భారతీయ జనసంఘ్ గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శిగా ఎన్నిక లాంటి వివరాలు ఐజి ఆఫీస్‌కు చేరినందు వల్ల ఉద్యోగం నుండి తొలగించారు. తరువాత రోజుల్లో అనేక ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రవేశించినప్పటికీ పోలీస్ విచారణ ద్వారా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిట్టచివరగా 1961లో వ్రాసిన ఎల్ఐసి పరీక్షలో ఉత్తీర్ణులై హైదరాబాద్ డివిజన్‌లో టైపిస్ట్‌గా ఉద్యోగంలో చేరారు.

1960 లో హైదరాబాద్ వచ్చినప్పటి నుండి సంఘ కార్యంలో హిమాయత్ నగర్ లోని కేశవమెమోరియల్ పాఠశాల ప్రభాత్, సాయం శాఖల ముఖ్యశిక్షక్ గా బాధ్యతలు నిర్వహించారు. క్రమక్రమంగా మండల ప్రముఖ్, భాగ్‌ప్రముఖ్‌గా, హైదరాబాద్ మహానగర్ శారీరిక్ ప్రముఖ్‌గా బాధ్యతలు నిర్వహించి అనేకమంది కార్యకర్తలను తయారుచేశారు. 1968లో నాటి ప్రాంత ప్రచారక్ సోమయ్య సూచన మేరకు భారతీయ మాజ్దూర్ సంఘ్‌లో బాధ్యత స్వీకరించారు.

1968 నుండి 2001 ఆగష్టు వరకు బిఎమ్ఎస్‌లో వివిధ స్థాయిలలో బాధ్యతతో పనిచేశారు. 1969లో హైదరాబాద్ ఎల్ఐసి ఆఫీస్‌లో జరిగిన వామపక్ష భావజాలం ఉన్న యూనియన్ ఎన్నికలలో కార్యదర్శిగా భావనారాయణ ఎన్నిక కావడం విశేషం.

1969 ఆగష్టు 4న పూణేలో National Organisation of Insurance Workers (NOIW) సంస్థ ఆవిర్భావం సందర్భంగా ఆ సంస్థకి అఖిల భారతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1985 మే నెలలో భారతీయ మాజ్దూర్ సంఘ్ ప్రతినిధిగా భారత ప్రభుత్వంచే జెనీవాలో అంతర్జాతీయ కార్మిక సంస్థ (ILO) Commercial and Financial Sector లో

పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను చర్చించి తగు నిర్ణయాలు తీసుకోవటానికి ఏర్పాటు చేసిన సమావేశంలో వారం రోజుల పాటు పాల్గొన్నారు. ఆ సమావేశాలలో జరిగిన విషయాలను, నిర్ణయాలను క్రోడీకరించటానికి ఏర్పడ్డ సబ్‌కమిటీలో కూడా సభ్యులుగా ఎంపిక అయ్యారు. ఆ సమావేశాల అనంతరం France, Switzerland, amsterdam, Rome, Zürich నగరాల సందర్శించారు. బ్రిటన్‌లో సంఘ (హెచ్ఎస్ఎస్) కార్యాలయంలో సంఘ కార్యకర్తలతో పరిచయ కార్యక్రమం పూర్తిచేసుకొని తిరిగి భారత్ చేరారు.

2000 వ సంవత్సరం మే 31 న ఎల్ఐసి నుండి పదవీవిరమణ చేశారు. ఆనాడు జరిగిన "స్నేహ సంధ్య"(పదవీ విరమణ) కార్యక్రమంలో ఎల్ఐసి అధికారులు, సంఘ , బిఎమ్ఎస్ అధికారులు, తోటి ఉద్యోగుల సమాగమం ఒక అవిస్మరణీయమైన సంఘటన. 1969 నుండి పదవీవిరమణ అయ్యే వరకు NOIW లో వివిధ స్థాయిలలో పనిచేశారు.

పదవీవిరమణ తరువాత సంఘ పెద్దల సూచన మేరకు సంఘ క్షేత్రంలో ప్రాంత కార్యకారిణి సదస్యులుగా బాధ్యత స్వీకరించారు. 2002 నుండి 2008 వరకు ప్రాంత సహకార్యవాహగా పనిచేశారు. ఆ సమయంలోనే శ్రీశైలంలోని శివాజీ స్ఫూర్తి కేంద్రం కార్యవర్గ సభ్యులుగా, హైదరాబాద్‌లోని కేశవ స్మారక విద్యాసమితిలో సహ కార్యదర్శిగా, కరెస్పాండంట్‌గా 2017 వరకు బాధ్యతల నిర్వహిం చారు. ఆనాటి హైదరాబాద్ మహానగర్ ప్రచారక్ శ్రీరాంసాతేజీతో పాటు బిఎమ్ఎస్ సంస్థాపకులైన దత్తోపంత్‌ఠెంగ్డేజీ ప్రభావం వీరిపై చెరగని ముద్ర వేసింది. వీరు ఏ బాధ్యతలో ఉన్నప్పటికీ ఆత్మీయతను పంచుతూ, మధురవాక్కుతో కార్యకర్తలందరినీ కార్యోన్ముఖులను చేసేవారు. వీరికి భార్య, ఇద్దరు కుమారులు.

స్థానం భావనారాయణ 31 మే 2000లో ఎల్ఐసి నుండి పదవీవిరమణ సందర్భంగా ఈ క్రింది సంస్థలకు చెక్కు రూపంలో విరాళాలు అందచేశారు:

సేవాభారతి, సంస్కృతభారతి, విశ్వహిందు పరిషత్, దేవాలయ పరిరక్షణ సమితి, భారతీయ మజ్దూర్ సంఘ్ తదితర సంస్థలకు. బాపట్లలో తన సొంత స్థలాన్ని సంఘ కార్యాలయానికి కేటాయించారు. ★

సామూహిక సాగర హారతి

తేదీ. 12.5.25 బాపట్ల జిల్లా, చీరాల మండలం, వాడరేవు (సముద్ర తీర ప్రాంతం) లో ఈరోజు పౌర్ణమి సందర్భంగా హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో డాక్టర్ తాడివలస దేవరాజు గారి పర్యవేక్షణలో అత్యంత వైభవోపేతంగా సామూహిక సాగహారతి కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంలో చుట్టుప్రక్కల గ్రామాల నుండి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

బాల జాగృతి

భక్తాగ్రేసరులు

తులసీదాసు



తులసీ(రాముడు)దాసు రామభక్త హనుమత్ వరప్రసాది. నేటి ఉత్తరప్రదేశ్‌లోని రాజపూర్‌కు చెందిన ఆయన చిన్నతనంలోనే తల్లిని కోల్పోయి, తండ్రి నిరాదరణ కారణంగా నాయనమ్మ దగ్గర పెరిగాడు. ఆమె కూడా కాలం చేయడంతో ఆలయమే ఆశ్రయం, భక్తులు పెట్టే ప్రసాదమే రోజువారీ భోజనమైంది. 'ఆంజనేయుడు నాకు అన్నీ అయి సాకిన తండ్రి' అని చెప్పుకునేవాడు. ప్రముఖ పండితుడు, ప్రవచన కర్త నరహరిదాసు ఆతనిలోని భక్తిభావాన్ని గమనించి శిష్యునిగా చేర్చుకున్నారు. అప్పటికే పండిత భక్తాగ్రేసరుడైన ఆయన జీవితం.. భార్య పలికిన ఒక్క మాటతో యదార్థం గోచరించి శ్రీరామచంద్రుని భక్తుడిగా మారి పోయాడు. ఆయన రాసిన 'రామచరిత మానసం' (తులసీ రామాయణం) గ్రంథం ఉత్తర భారతదేశంలో విశిష్టమైనది. తన భక్తిభావంతో అశేష జనంకి అర్థవంతమైన జీవితానికి మార్గదర్శి అయ్యాడు.

కథ

సహనం!



వీరయ్య అనే వ్యాపారి ఒక రోజు బావి దగ్గర హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్నాడు. మాటిమాటికి బావిలోకి తొంగిచూస్తున్నాడు. అతనికి దిక్కుతోచడం లేదు.

రెండు రోజులుగా అంగడికి కూడా వెళ్లడం లేదు. ఇట్లా అయితే ఎట్లా? అని ఆలోచిస్తున్నాడు.

అంతలో అటుగా వెళుతున్న భీమయ్య అనే కూలి పని చేసుకునే వ్యక్తిని పిలిచి "నీకు వంద రూపాయలు ఇస్తాను. బావిలో నీళ్లు తోడి పక్కనే ఉన్న బానలో పోస్తావా?'' అని అడిగాడు.

భీమయ్య సరేనని బావిలో నీళ్లు చేదతో తోడి పక్కనే ఉన్న పెద్దబానలో పోయడం ప్రారంభించాడు. ఎంతసేపు నీళ్లు తోడి పోసినా బాన నిండటం లేదు.

ఏమైంది..? అని పరిశీలించి చూడగా బానకు పెద్ద పెద్ద చిల్లులు ఉన్నాయి. చిల్లులో నుండి నీళ్లు తోటలో చెట్లకు వెళ్లిపోతున్నాయి. దాంతో భీమయ్యకు కోపం వచ్చి "చిల్లు పడిన బాన నింపమంటున్నావు. నీకు నేను వెర్రివాడిలా కనబడుతున్నానా?' అని తిట్టి, పని వదిలేసి వెళ్లిపోయాడు.

ఈసారి వీరయ్య.. రామయ్య అనే మరో వ్యక్తిని పిలిచి బావిలో నీళ్లు తోడి బానలో పోస్తే వంద రూపాయలు ఇస్తానన్నాడు.

పద్యం

తగిలి మదంబుచే నెదిరి తన్ను నెఱుంగక దొడ్డవానితో
పగఁగొని పోరుటెల్ల నతిపామరుఁడై చెడు, టింతెగాకఁ?
నెగడి జయింప నేరఁ,డది నిక్కము, దప్పదు ధాత్రి లోపలన్
దెగి యొక కొండతో దగరు ఢీకొని తాకిన నేమి భాస్కరా!

భావం : భాస్కరా! ఎదుటివాని శక్తిని, తన శక్తిని గ్రహించక గొప్పవానితో శత్రుత్వం పూని మదంతో పోరాడటం వల్ల, అవివేకియై చెడిపోవడమే గాని తాను జయింపలేడు. అది నిజము. పొట్టేలు సాహసంతో కొండను ఢీ కొంటే దాని ప్రాణం పోతుంది కదా!

శ్లోకం

అన్నదానం మహాదానం విద్యాదానం మహత్తరం
అన్నేన క్షణికాతృప్తిః యావజ్జీవంతు విద్యయా

భావం : దానాలలో అన్నదానం గొప్పదైతే అంతకంటే మహత్తరమైనది విద్యాదానం. అన్నదానం వల్ల ఆ పూటకే కడుపు నిండి తృప్తి కలుగుతుంది. విద్యాదానంతో జీవిత పర్యంతం సుఖం కలుగుతుంది.

జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

కైనోఫోబియా	మంచు
రూపోఫోబియా	కుక్కలు
చినోఫోబియా	మురికితనం
క్రోమోఫోబియా	కొత్తదనం
కైనలోఫోబియా	రంగులు

సమాధానాలు : కైనోఫోబియా-కుక్కలు; రూపోఫోబియా-మురికితనం; చినోఫోబియా-మంచు; క్రోమోఫోబియా-రంగులు; కైనలోఫోబియా-కొత్తదనం

నిర్వహణ : నయనశ్రీ

శాస్త్రవేత్తలు

శ్రీనివాస రామానుజన్ (1887-1920)

శ్రీనివాస రామానుజన్ ప్రముఖ గణిత శాస్త్రవేత్త. 1887 డిసెంబర్ 22న జన్మించారు. ఈయన జన్మదినం రోజునే మనం జాతీయ గణిత దినోత్సవంగా జరుపుకుంటున్నాం. రామానుజన్ 3,900 గణితశాస్త్ర సమీకరణాలను పరిష్కరించారు. అనంత క్రమాన్ని (Infinite Series for Pi) కనుగొన్నారు. 1729 (103 + 93) (123+ 13)ను రామానుజన్ సంఖ్యగా పిలుస్తారు.

జనరల్ నాలెడ్జ్

1. పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ తాజాగా చేపట్టిన ఆపరేషన్ పేరేమిటి?
2. ప్రపంచంలో అతిపెద్ద ఇతిహాసం?
3. హెచ్.డి.టి.వి.ని విస్తరించండి?

సమాధానాలు : 1. ఆపరేషన్ సిందూర్; 2. మహాభారతం; 3. హై నెఫినెషన్ టెలివిజన్.

మెదడుకు మేత

వానా లేక ఎండా లేక
పైరు పచ్చంగా,
ఆకు లేక సున్నం లేక
నోరు ఎర్రంగ..
ఏమిటది?

జవాబు : రామచిలుక

రామయ్య నీళ్లు తోడి బానలో పోయసాగాడు. ఎన్ని నీళ్లు పోసిన బాన నిండటం లేదు. చిల్లు నుంచి చెట్లకు నీళ్లు వెళ్లిపోతున్నాయి. ఆ విషయం గమనించి కూడా రామయ్య యజమాని వద్దు అనే వరకూ నీళ్లు తోడుతూ ఉంటే సరిపోతుందనుకున్నాడు.

వంద రూపాయలు వస్తాయి కదా అనుకుని ఆపకుండా నీళ్లు తోడసాగాడు. మధ్యాహ్నానికి బావిలో నీళ్లన్నీ అయిపోయి, మట్టి కనబడసాగింది.

ఆ మట్టిలో ధగధగలాడిపోతున్న చంద్రహారం బయటపడింది.

"పొరపాటున బావిలో చంద్రహారం పడిపోయింది. దీని కోసమే నీళ్లు తోడమన్నాను" అని వీరయ్య సంతోషించి రామయ్యకు రెండు వందల రూపాయలు ఇచ్చాడు. సహనంతో ఏ పని చేసినా ఫలితం ఉంటుందని రామయ్య నిరూపించాడు. ★

మంచిమాట

అడ్డంకులకు కుంగిపోతే
అపజయం, వాటిని
అనుభవాలుగా
మలచుకోగలిగితే
విజయం

విందు.. వినోదం... పెండ్లి.. పేరంటం...
అన్నింటా మీ నేస్తం.
క్రేన్
వక్క పలుకులు
వీటికి సాటి మరేవి లేవు
www.craneindia.net
ఇప్పుడు మీ కోసం
సరికొత్త ప్యాకింగ్‌లో
సరికొత్త రుచులతో
Taste of India
CRANE
BETEL NUT PIECES
CRANE
BETEL NUT PIECES
CRANE
BETEL NUT PIECES
CRANE
SWEET BETEL NUT PIECES

వారఫలాలు

19-25 మే 2025

సింహంభట్ల సుబ్బారావు
6300674054

మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

స్థిరాస్తి వివాదాలను పరిష్కరించు కుంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. దూరప్రాంతాల నుంచి ఉపయుక్త సమాచారం అందుతుంది. కొత్త కాంట్రాక్టులు దక్కించుకుంటారు. పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారులకు పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగు లకు అనుకోని హోదాలు దక్కవచ్చు. కళాకారులకు అనుకూల పరిస్థితులు. 23,24 తేదీల్లో వృథా ఖర్చులు. వ్యయప్రయాసలు. శ్రీరామస్తోత్రాలు పఠించండి.

వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ఆరోగ్యం కుదుటపడి ఉపశమనం పొందుతారు. ఆలోచనలు అమలులో పెడతారు. చిన్ననాటి స్నేహితులను కలుసుకుంటారు. విద్యార్థులు, నిరుద్యోగులకు కొత్త ఆశలు. ఇంతకాలం పడిన కష్టం ఫలిస్తుంది. వ్యాపారులకు క్రమేపీ లాభిస్తాయి. ఉద్యోగులకు ఉన్నత స్థితి దక్కుతుంది. పారిశ్రామిక వేత్తల యత్నాలు సఫలం. 19,20 తేదీల్లో వృథా ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. హనుమాన్ చాలీసా పఠించండి.

మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

ఒక సమాచారం ఆకట్టుకుంటుంది. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. కొన్ని వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వం వహిస్తారు. సేవాకార్యక్రమాలపై ఆసక్తి చూపుతారు. వ్యాపారులు అనుకున్న పెట్టుబడులు అందుకుంటారు. ఉద్యోగులకు మరింత ప్రోత్సాహకరంగా ఉంటుంది. రాజకీయ వేత్తలకు కొత్త అవకాశాలు. 21,22 తేదీల్లో వృథాఖర్చులు. మానసిక అశాంతి. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.

కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

సొమ్ములు అంది అవసరాలు తీరతాయి. కొత్త వారితో పరిచయాలు ఏర్పడతాయి. చిన్ననాటి సంఘటనలు ఎదురవుతాయి. ముఖ్యమైన కార్యక్రమాలు అనుకున్న రీతిలో పూర్తిచేస్తారు. భూములు, వాహనాలు కొంటారు. వ్యాపారులకు మరింతగా లాభాలు అందే అవకాశం. ఉద్యోగులకు కొత్త బాధ్యతలు దక్కవచ్చు. రాజకీయవేత్తల యత్నాలు సానుకూలం. 22,23 తేదీల్లో శారీరక రుగ్మతలు. అంగారక స్తోత్రాలు పఠించండి.

సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

ఆలయాలు సందర్శిస్తారు. ప్రముఖులతో పరిచయాలు సంతోషం కలిగిస్తాయి. ఇళ్లు, వాహనాలు కొనుగోలు చేస్తారు. వివాహయత్నాలు సానుకూలం. వ్యాపారులకు లాభాలు అందుతాయి. ఉద్యోగులకు ఉన్నతస్థితి దక్కవచ్చు. కళాకారులకు అవకాశాలు అప్రయత్నంగా దక్కుతాయి. 24,25 తేదీల్లో వ్యయప్రయాసలు. బంధువులతో విభేదాలు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

ముఖ్యమైన వ్యవహారాలు క్రమేపీ అనుకూలిస్తాయి. మిమ్మల్ని వ్యతిరేకించిన వారే ప్రశంసించడం విశేషం. వ్యాపారులు లాభాల బాటలో పయనిస్తారు. ఉద్యోగులకు హోదాలు దక్కవచ్చు. పారిశ్రామికవేత్తలకు కృషి ఫలిస్తుంది. క్రీడాకారులు, రచయితలకు మరింత ఉత్సాహం. 19,20 తేదీల్లో శారీరక రుగ్మతలు. కుటుంబసభ్యులతో విభేదాలు. గాయత్రీ ధ్యానం చేయండి.

తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

ఆదాయం ఆశా జనకంగా ఉంటుంది. దీర్ఘకాలిక రుణబాధలు తొలగుతాయి. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. భూములు, వాహనాలు కొనుగోలులో ముందడుగు వేస్తారు. ఉద్యోగులకు బాధ్యతలు తగ్గుతాయి. పారిశ్రామికవర్గాలకు కొత్త విషయాలు తెలుస్తాయి. కళాకారులు, రచయితలకు ఉత్సాహవంతంగా ఉంటుంది. 20,21 తేదీల్లో వృథా ఖర్చులు. శారీరక రుగ్మతలు. సూర్యాష్టకం పఠించండి.

వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

భూములు కొంటారు. సంతానపరంగా ముఖ్య సమాచారం అందుతుంది. ఆశ్చర్యకరమైన సంఘటనలు ఎదురవుతాయి. వాహనసౌఖ్యం. వ్యాపారులకు విస్తరణ కార్యక్రమాలు చకచకా సాగుతాయి. ఉద్యోగులకు పనిభారం నుంచి విముక్తి. కళాకారులకు అవకాశాలు అప్రయత్నంగా దక్కుతాయి. 22,23 తేదీల్లో వ్యయప్రయాసలు. స్నేహితులతో తగాదాలు. విష్ణుధ్యానం చేయండి.

ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

ముఖ్యమైన కార్యక్రమాలు కొంత నిదానిస్తాయి. అదనపు ఖర్చులు మీదపడి సతమతమవుతారు. బంధువుల నుంచి ఆసక్తికర సమాచారం. శారీరక రుగ్మతలు బాధిస్తాయి. చిన్ననాటి విషయాలు గుర్తుకు వస్తాయి. గృహ నిర్మాణయత్నాలు వాయిదా వేస్తారు. కళాకారులు, రచయితలకు శ్రమ ఫలిస్తుంది. 23,24 తేదీల్లో శుభవార్తలు. చర్చలు సఫలం. గణేశ్‌ను పూజించండి.

మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

కాంట్రాక్టులు అనూహ్యంగా దక్కి ఉత్సాహంగా గడుపుతారు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులకు తగినంత లాభాలు అందుతాయి. ఉద్యోగులకు ఆటంకాలు తొలగుతాయి. పారిశ్రామిక వర్గాలకు ఉత్సాహవంతంగా గడుస్తుంది. కళాకారులు, క్రీడాకారులకు మరింత ఉత్సాహం. 24,25 తేదీల్లో వృథా ఖర్చులు. అనారోగ్యం. సుబ్రహ్మణ్యేశ్వరుని పూజించండి.

కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

ఆదాయం సంతృప్తినిస్తుంది. బంధువుల నుంచి ధనలాభం కలిగేసూచనలు. మీ నిర్ణయాలు అందరూ హర్షిస్తారు. ఆశ్చర్యకరమైన విషయాలు తెలుసుకుంటారు. వ్యాపారులకు లాభసాటి. కళాకారులు అనుకున్నది సాధిస్తారు. పరిశోధకులు, క్రీడాకారులకు సంతోషకర సమాచారం. 23,24 తేదీల్లో శారీరక రుగ్మతలు. కుటుంబంలో సమస్యలు. శివాష్టకం పఠించండి.

మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

స్థిరాస్తి వివాదాలు తీరతాయి. బంధువులతో సఖ్యత నెలకొంటుంది. ఇంటి నిర్మాణాలపై చర్చలు సఫలం. నిరుద్యోగులకు అనుకోని ఉద్యోగయోగం. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులకు అనుకోని విధంగా లాభాలు. ఉద్యోగులకు కీలక సమాచారం అందుతుంది. పారిశ్రామికవేత్తల యత్నాలు సఫలం. 24,25 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. స్వల్ప రుగ్మతలు. అన్నపూర్ణాష్టకం పఠించండి.

పదరసం - 514



ఆధారాలు

అడ్డం

1. ప్రస్తుతం పుష్కరాలు జరుగుతున్న నది (4)
3. గీతగోవిందం కర్త (3)
6. పెద్ద సోదరి (2)
7. పాలూ నీళ్లను వేరు చేసే పక్షి (2)
8. పొడి, ముక్క (2)
9. ఇది సముద్రంలో కలవాల్సిందే (2)
11. పంచాంగంలో ఒక అంశం (2)
13. నువ్వులే (3)
16. పది పదులు (2)
18. సొంత ఇల్లు (3)
19. దేవయాని వలచిన రాజు (3)
21. శరం (2)
22 ఈ 'దేవుడు' దాత (2)
25. 'ప్రతిభ' అటు నుంచి (3)
28. బతుకుతెరువు (3)
30. చేసేవాడు (2)
31. ....కొయ్యేనోయ్! (3)
32. పాతకాలపు కొలమానం (2)
33. తాడు, ఆయుధం (2)
34. వినికిడి అవయవాలు 93)
35. సుగ్రీవ అగ్రజుడు (2)

నిలువు

1. వ్యాసుని తల్లి (4)
2. బంధువులు, అయినవారు (4)
3. అమరశిల్పి.... (3)
4. శరీరమే... (2)
5. ఇల్లు, ఉనికి (3)
10. పగలు, దినం (2)
12. తెలుగులో గెస్టు కింద నుంచి (3)
14. ఉప్పు (3)
15. మీ చేతిలోని పత్రిక (3)
17. జాలి లాంటిదే (2)
18. గొంతు...కంఠం (2)
20. యజ్ఞం...(2)
21. తిరుమలేశుడికి ఉత్తరాదివారి పిలుపు (3)
23. ఇది సర్వత్రా వర్జయేత్ అంటారు (2)
24. అరణ్యం (2)
25. పతిదేవుడు (2)
26. ఆంధ్రకేసరి (3)
27. ముష్టి...వేళ్లు ముడిస్తే...(4)
29. వరుడి జోడి (3)
30. పెరుగు చిలికే సాధనం (3)
33. వీరు చిరాయువట (2)

పదరసం - 513 సమాధానాలు



సింపుల్ లవ్ స్టోరీతో '#సింగిల్'

హీరో శ్రీవిష్ణు కాస్తంత భిన్నమైన కథలను ఎంపిక చేసుకుని, బాగానే హోంవర్క్ చేసి సినిమాను సెట్స్ పైకి తీసుకొస్తుంటాడు. అయినా జడ్జిమెంట్‌లో లోపం కారణంగా అవి పరాజయం పాలవుతూ ఉంటాయి. అయినా మడమ తిప్పకుండా తన ప్రయత్నం తాను చేస్తూనే ఉన్నాడు. 'సామజ వర గమన' సినిమా తర్వాత అతనికి చెప్పుకోదగ్గ విజయం లభించలేదు. 'ఓమ్ భీమ్ బుష్', 'స్వాగ్' వంటి సినిమాలు కొందరికి మాత్రమే నచ్చాయి. ఈ సమయంలో శ్రీవిష్ణు తనకు అచ్చివచ్చిన అవుట్ అండ్ అవుట్ కామెడీని నమ్ముకుని చేసిన సినిమానే 'హ్యాష్ ట్యాగ్ సింగిల్'. అల్లు అరవింద్ సమర్పణలో కార్తీక్ రాజు తెరకెక్కించిన సినిమా ఇది.

కొన్ని సినిమాలు కథానుగుణంగా సాగుతాయి. కొన్ని కేవలం సీన్స్ బేస్డ్‌గా ఉంటాయి. 'హ్యాష్ ట్యాగ్ సింగిల్' రెండో కోవకు చెందిన సినిమా. కథగా చెప్పుకోవాలంటే పెద్దగా ఏమీ లేదు. పెళ్లి పెటాకులు లేకుండా ఒంటరిగా ఉంటున్న విజయ్ (శ్రీవిష్ణు)కు తానూ ఎవరినైనా ప్రేమించి పెళ్లి చేసుకుని జీవితంలో సెటిల్ అవ్వాలనే కోరిక ఉంటుంది. తన ఫ్రెండ్ అరవింద్ (వెన్నెల కిషోర్) కూడా ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నాడని తెలియడంతో ఆ కోరిక ఇంకా బలపడుతుంది. అదే సమయంలో కార్ షోరూమ్‌లో సేల్స్ గర్ల్ పూర్వ (కేతిక శర్మ)ను చూసి ప్రేమలో పడతాడు. ఆమె ప్రేమను పొందడం కోసం కారు కొంటానని మాట ఇస్తాడు. ఆమె కూడా ఇతని మాటలు నమ్మేస్తుంది. ఇదే సమయంలో హరిణి (ఇవానా) విజయ్‌ను ప్రేమిస్తున్నానంటూ అతని వెనకే వడుతూ ఉంటుంది. పూర్వ మనసును గెలుచుకోవడానికి, హరిణిని వదిలించుకోవడానికి నానా ఇబ్బందుల పడతాడు విజయ్. చివరకు వీరిద్దరిలో అతను ఎవరివైపు మొగ్గు చూపాడు? ఎందుకు అలాంటి నిర్ణయం తీసుకున్నాడు? దాని కారణంగా ఎలాంటి చేదు అనుభవాన్ని ఎదుర్కొన్నాడు అనేది మిగతా కథ.

దర్శకుడు కార్తీక్ రాజు బలమైన కథను రాసుకోవడం మీదకంటే... తాను అనుకున్న పాయింట్‌ను సరదాగా జనాలకు చెప్పడానికే అధిక ప్రాధాన్యమిచ్చాడు. దాంతో సినిమా ప్రారంభం నుండి ముగింపు వరకూ డైలాగ్ అండ్ సిట్యుయేషనల్ కామెడీ మీదనే ఆధారపడ్డాడు. అందుకోసం అతను ఎంచుకున్న అస్త్రం 'వెన్నెల' కిశోర్. ఈ సినిమాకు ఓ రకంగా అతనే హీరో అనుకోవాలి.

చాలా సన్నివేశాలలో శ్రీవిష్ణును డామినేట్ చేస్తూ, ఫ్రస్ట్రేటెడ్ ఫ్రెండ్ పాత్రకు బాగా న్యాయం చేకూర్చాడు. శ్రీవిష్ణు సైతం తనవంతు ప్రయత్నం చేశాడు. అయితే హీరోయిన్ల నుండి గొప్ప నటనను ఆశించడం వేస్ట్. రాజేంద్రప్రసాద్, కల్పలత, వీటీవీ గణేశ్, ప్రభాస్ శ్రీను, క్రిరాక్ సీత, శత్రువంటివారు సహాయ పాత్రలు పోషించారు. సినిమా మొత్తం శ్రీవిష్ణు, వెన్నెల కిశోర్, కేతిక శర్మ, ఇవానా మీదనే సాగిపోతుంది. క్లయిమాక్స్‌లో నార్నే నితిన్, రెబ్బా మోనికా జాన్, మానసా చౌదరి అతిథి పాత్రల్లో మెరిశారు. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న బాలనటుడు మాస్టర్ రేవంత్ కూడా ఓ రెండు సీన్స్‌లో కనిపించాడు.

సింగిల్‌గా ఉన్న ఓ కుర్రాడు పెళ్లి చేసుకుని జీవితంలో స్థిరపడాలని అనుకున్నప్పుడు ఎదురైన వింత అనుభవాలే ఈ సినిమా. సన్నివేశాలు కొత్తగా రాసుకోలేదు కానీ వాటి నుండి కామెడీని జనరేట్ చేయడం కోసం రైటర్స్ బృందం బాగానే కష్టపడింది.

సింగిల్‌గా ఉన్న ఓ కుర్రాడు పెళ్లి చేసుకుని జీవితంలో స్థిరపడాలని అనుకున్నప్పుడు ఎదురైన వింత అనుభవాలే ఈ సినిమా. సన్నివేశాలు కొత్తగా రాసుకోలేదు కానీ వాటి నుండి కామెడీని జనరేట్ చేయడం కోసం రైటర్స్ బృందం బాగానే కష్టపడింది. ముఖ్యంగా శ్రీవిష్ణు తనదైన బాడీ లాంగ్వేజ్‌తోనూ, డైలాగ్ డెలివరీతోనూ రక్తి కట్టించాడు. పాపులర్ హీరోలను నందర్భానుసారం అనుసరించి మెప్పించాడు. అయితే ట్రైలర్ విడుదలైనప్పుడు ఎదురైన చేదు అనుభవం దృష్ట్యా కొన్నింటిని తొలగించారు. విశాల్ చంద్రశేఖర్ అందించిన పాటలు ఏమంత గొప్పగాలేవు కానీ కొన్ని సన్నివేశాలను కేవలం తన నేపథ్య సంగీతంతోనే నిలబెట్టాడు. వేల్ రాజు ఫోటోగ్రఫీ బాగుంది. సినిమా ప్రారంభం నుండి ముగింపు వరకూ శ్రీవిష్ణు ఎక్కడా ఎనర్జీ లెవల్స్ తగ్గకుండా చేశాడు. క్లయిమాక్స్ కాస్తంత భిన్నంగా ఉండాలని చేసిన ప్రయత్నం ఏమంత సఫలం కాలేదు. బలమైన కథ ఏదీ లేని కారణంగా 'హ్యాష్ ట్యాగ్ సింగిల్' కేవలం టైమ్ పాస్ మూవీగానే మిగిలిపోయింది. ఈ మధ్య కాలంలో వచ్చిన శ్రీవిష్ణు సినిమాలతో పోల్చితే కాస్తంత బెటర్ మూవీ ఇది.

అరుణ: సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.300/-

వెల : ₹.300/-



వెల : ₹.100/-

వెల : ₹.160/-



వెల : ₹.200/-



వెల : ₹.499/-



వెల : ₹.300/-



వెల : ₹.120/-

వెల : ₹.300/-



వెల : ₹.180/-



వెల : ₹.350/-



వెల: PB ₹.550/-



వెల :₹.450/-

వెల : ₹.699/-



వెల : ₹.150/-

పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠి, హైదరాబాద్. 9440589722.

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 77 Issue : 30



Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyd-01